

వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**


సంపుటి : 25 సంచిక : 2
డిసెంబర్ - 2021
'ప్లవ' మార్గశిర మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi

***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక,**
**2-2-1109/బికె - ఎల్‌ఐజి-10,**
**బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,**
**హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**




# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


మూసీ సాహిత్య ధార ... 6
భవభూతి తెలిపిన 'పద్మపురం / పద్మనగరం' ఏది? ... బాదరవేణి నాగరాజు 7
మా వూరు తీరు (బందారం కథలు-1) ... డా. నందిని సిధారెడ్డి 11
మధురకవి - కూరెళ్ళ విఠలాచార్య ... ఎం. పుష్పలత 13
ప్రౌఢ పద్యకళానిధి 'ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరం' ...డా. నీలిమా కృష్ణమూర్తి 17
విధాత తలపున వెలిగిన 'సిరివెన్నెల' ... డా. డి. కామేశ్వర రావు 21
ఆపద్బాంధవుడు (కథ) ... డా. తాళ్ళపల్లి యాకమ్మ 29
పద్య మనోహరం - 25 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 30
జానపద పరిశోధన - మెళకువలు ... డా. బుక్కా బాలస్వామి 31
దినపత్రికలలో సాహిత్య విమర్శ ... మహేందర్ జి. 35
పదవినోదం-33 ... డా. తాడేపల్లి పతంజలి 38
కోలాహలం లక్ష్మణరాజు కథాసాహిత్యం ... పగిడోజు యాకానంద చారి 39
గ్రంథాంతరంగం 7 - ప్రాకృత గ్రంథకర్తలూ ప్రజాసేవానూ ... ఘట్టమరాజు 41
కథా సాహిత్యంలో రజకుల ప్రస్తావన ... బాసాని సీతారాములు 44
తెలంగాణ యక్షగానం - చంద్రహాస చరిత్రము - రసపోషణ ... కె. సురేష్ 47
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 18 ... టి. లక్ష్మీనారాయణ 51
శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 54
సుచరిత్ర కీర్తి పతాక శ్రీ బి.ఎన్.శాస్త్రి ... డా. భిన్నూరి మనోహరి 55


### కవితలు


దివ్యధాత్రి భారతీ! ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ -6; ఇక శూన్యంలో ... అరుణ ధూళిపాళ - 16; సీతారామస్వామీ! ... గురిజాల రామశేషయ్య - 20; వెన్నెలలో కలిసిన పాటల సిరి ... అవుసల భానుప్రకాశ్ - 40; కన్నీటి ఉపదేశం ... నరేశ్ చారి -46; దయ కలిగిన తల్లి ... ఏటూరి నాగేంద్ర రావు - 46; మాండూక్యోపనిషత్తు (అనువాదం) ... జక్కని వెంకటరాజం - 51; కొన్ని కన్నీళ్ళు అద్దెకు కావాలి ... డి. ప్రకాశ్ - 62.


### సమీక్షలు


పావన సంస్కృతీ ధార 'పరంపర' ... శ్రీమతి కె. వీణారెడ్డి 57
విభిన్న భావాల ఆహ్లాద కవిత్వం 'అనాది అనాథ శతకం' ... యడవల్లి సైదులు 59
స్వీకృతి ... 61




**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**



*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# అమరం

మరణం లేని స్థితి అమరం. భారతీయ జీవన విధానంలో మాత్రమే ప్రత్యేకంగా ఆలోచించే పదజాలాలలో ఇది ఒకటి. అమర్‌హై అంటూ నినాదాలు చేస్తూనే ఉన్నాం. ఎవరు అమరులు. మరణం దేనికి? ఈ ప్రశ్నలు ఎప్పటినుండో వేధిస్తున్న వివరాలు. ఈ లోకంలో శరీరాన్ని కొంతకాలం ఉంచడం పుట్టిన వారికి తప్పదు. ఎందరెందరో ఈ లోకంలో పుట్టినా, వారి మరణం తర్వాత వారిని ఎక్కువ కాలం గుర్తుంచుకునే వారే లేరు. చివరికి అతి పరిమితమైన కుటుంబ సభ్యులు కూడా అతి తక్కువ కాలం మాత్రమే గుర్తుంచుకుంటారు. కాలవశాత్తు వారు కాలగర్భంలో కలిసి పోతూనే ఉన్నారు. శరీరం పోయిన కొద్ది రోజులకే వారి జ్ఞాపకాదుల నుండి కూడా మనం దూరం అవుతూనే ఉన్నాం. తొంబైతొమ్మిది శాతం జనానికి ఇది సహజంగా మారిపోయింది.

ఈ లోకంలో అందరిలాగే జన్మించినా, వారు వారి శరీరాన్ని, మనస్సును పూర్తిగా శుద్ధంగా మలచుకొని తాము చేయదగిన కార్యక్రమాలను నిర్వహించేవారు మరికొందరుంటారు. వారు ఈ లోకంలో వారి దేహాన్ని వదిలిపెట్టినా, ఎన్నో వందల సంవత్సరాల తర్వాత కూడా అందరిచేతా గుర్తింపబడుతూ, చదువబడుతూ ఉంటారు. రంగాలు ఏవైనా సరే ... వారి మరణం తర్వాత కూడా మళ్ళీ వారు ఈ లోకంలో వేరు వేరు రూపాల్లో కనిపిస్తుంటారు. సమాజ శ్రేయోదాయక మైన కార్యక్రమాలు చేసిన రాజులు, లోకహితాన్ని ఆశించి కావ్యాదులు రాసిన రచయితలు, కవులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విముక్తికోసం పోరాటాలు చేసిన యోధులు కొందరు మాత్రం ఇప్పటికీ గుర్తుంచుకోబడుతున్నారు. వారు శరీరంతో ఉన్న కాలంలో చేసిన వేరు వేరు కార్యక్రమాలను మనం గుర్తు చేస్తున్నాం, తరువాతి తరాలకు వారి యోగదానాన్ని తెలియజేస్తూనే ఉన్నాం. వారిని వేరు వేరు సందర్భాలో ఉదహరిస్తూనే ఉన్నాం. వారే అమరులు. వారే మనకు ఆదర్శ ప్రాయులు. వారి మార్గమే అందరికీ శిరోధార్యం. ఆ మార్గంలో వెళ్ళడానికి లోకహితం కోరుకోవాలని, దానికి సప్త సంతానాల మార్గాలను భారతీయ మార్గం నిర్దేశించింది.

మరణం పొందినవారు అమరులు కావాలంటే తమ పనులు ఈ లోకంలో నిశ్శేషం కావాలి. దానికి గాను, తక్కువ సమయంలో ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించాలి. ఆ నిర్వహణకు అనుకూలంగా శరీరం శుద్ధం కావాలి. దానికి విశ్వశక్తితో అనుబంధం అధికం కావాలి. అధికమైన విశ్వశక్తిని తమ మనశ్శక్తిగా మార్చుకునే వారు తమకు ఉన్న శరీరాన్ని, సకాలంలో సద్వినియోగం చేసుకుని తమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటారు. లోక వ్యవహారాల్లో ఉంటూనే, శక్తితో నిరంతరం సంయోగం పొందుతూ ఉండాలి. మన సెల్‌ఫోన్‌ను ఛార్జర్ ద్వారా పవర్ వద్దకు చేర్చి శక్తిని నింపి, ఆ శక్తి ఉన్నంత సేపూ ఉపయోగించుకున్నట్లే... ఈ జీవితానికి కూడా శక్తిని నింపి తమకు నిర్దేశించిన కార్యక్రమాలను అతి త్వరగా, ఉన్నతంగా నిర్వహించిన వారు శరీరానంతరం కూడా జీవించే అవకాశం ఉంటుంది. వాల్మీకి వ్యాస కాళిదాసాదులు, నన్నయ పోతనాదులు, ఆర్యభట వరాహమిహిరాదులు ఇప్పటికీ బ్రతికి ఉండటం వెనుక అర్థం ఇదే. సాధారణంగా అందరం మృత్యుద్వారానికి వెళ్తున్నా, అమృతత్వానికి వెళ్ళడం లేదు. దీనికి కారణం కేవలం అజ్ఞానమే. అమృతులు, అమరులు అతి తక్కువ మంది మాత్రమే ఉంటున్నారు. వారి కోవలోకి మనమూ చేరాలి. శుద్ధత సాధించాలి. విశ్వశక్తితో నిరంతరం అనుసంధానం కావాలి. అప్పుడే కీర్తిశేషులవుతారు. అటువంటి కోవలోకి చేరినవారే ఈ పత్రిక వ్యవస్థాపకులు శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు. వారికి వందనాలు సమర్పించుకుంటూ...

ఇటీవల కీర్తిశేషులైన ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరం గారు, ప్రముఖ సినీకవి సిరివెన్నెల సీతారామశాస్త్రి గార్ల అమరత్వానికి ప్రణమిల్లుతూ మూసీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

# దివ్యధాత్రి భారతీ...!



భారతి భవ్యమాత సమభావన జీవన దివ్యధాత్రి, వి
స్తార, రసౌషధి ప్రకర, సంయుత రాజిత రత్న గర్భ, సా
కార సుధర్మ నిత్యఘన, కాంచన దీపఖని ప్రపూర్ణ, వి
ద్యారత సాహసాంక వరదాయిని, తత్పదమంటి మ్రొక్కెదన్

మోమున హాస చంద్రికల మోఘసువర్ణ సుదీప్తులీనగా
కామితముల్సుపుత్రుల కఖండముగానొనగూర్చి ధారగా
నోమిన సాహితీ వ్రతము, నోచిన వెంకటనె యిచ్చి భావనల్
బ్రేమము పంచుచు మాతకిదె, ప్రేముడి నర్చన జేతు నెమ్మెదిన్.




నీదగు గర్భవాసమున నిర్మల జన్మము నొందు భాగ్యముల్
మేదిని లోపలలిగె, మేలగు పుణ్యము లెన్ని జేసితో
వేదనలేని జీవనము విఘ్నముగా కొనసాగుచుండగన్,
మోదము డెందమందలర, మోక్షము గోరను నీదుసన్నిధిన్

అక్కున జేర్చుకొందువిల, నమ్మగమమ్ముల నాదరించియున్
మక్కువ తోడ జిత్తమున, మామదికాంక్షలు దీర్తువమ్మ, నిన్
మ్రొక్కిన యొక్కసారి బహు మోదము గూర్తువు మానసంబునన్
గ్రక్కున నీదు వైభవము గానము జేసెద దేశభక్తికై



ధైర్యము నిచ్చియు న్నైనగు, దర్పమొసంగియభేద్యమైన, స
ద్వీర్యము నిచ్చి మానసము ప్రీతిగ వజ్ర నిభంబు జేసియున్
శౌర్యము నిండి పోర్ల ఘన శత్రు శిరంబుల జీల్చు సాహసాం
బుర్విని మాకొసంగుమని యుల్లము పొంగగ నీకు మ్రొక్కెదన్!




డా. గన్నోజు శ్రీనివాసాచార్య
నాగర్ కర్నూల్, ఫోన్ : 8555899493

# మూసీ సాహిత్య ధార - 38

## 'జానపద సాహిత్య పరిశోధన – మెళకువలు'

పరిశోధన స్రవంతిగా నిరంతరం సాగుతున్న 'మూసీ సాహిత్య ధార' 38 వ సమావేశంలో డా. బుక్కా బాలస్వామి గారు ప్రసంగించారు. జానపద సాహిత్యంలో విశేషమైన కృషిచేసిన బాలస్వామి గారు **'జానపద సాహిత్య పరిశోధన – మెళకువలు'** అనే అంశంమీద ప్రసంగించారు. జానపద సాహిత్యంలో పూర్వం అపూర్వంగా కృషిచేసిన పరిశోధకులను, పరిశోధనను గురించి ప్రస్తావించి, ఇప్పుడు చేయవలసిన జానపద అంశాలు, విధానాలకు కావల్సిన మెళకువలను తెలియపర్చారు.

ఈ అంతర్జాల సమావేశంలో యథాప్రకారంగా ఒక స్వీయ పరిశోధన, ఒక పుస్తక సమీక్ష, కవితాగానాలు సాగాయి. వాటిలో స్వీయ పరిశోధన గురించి జి. మహేందర్, పుస్తక సమీక్షను అవకానందచారి గార్లు మాట్లాడారు. డి.ప్రకాష్ కవితా గానం చేసారు. ఈ వేదికను సమీక్షిస్తూ, డా. ఎస్.రఘు, డా. సాగి కమలాకరశర్మ గార్లు మార్గదర్శనం చేసారు. వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సుసంపన్నం చేసినారు.




## బి.ఎన్.శాస్త్రి గారి స్మారక పురస్కారం ... డా. కూరెళ్ళ విఠలాచారి గారికి

మూసీ మాస పత్రిక వ్యవస్థాపకులు, ప్రముఖ చారిత్రక, శాసన పరిశోధకులు, బహు గ్రంథ కర్త కీ.శే. బి.ఎన్. శాస్త్రి గారి 89వ జయంతిని పురస్కరించుకుని, వారి జన్మదినమైన 10.12.2021 నాడు పురస్కార ప్రదానం జరుగుతుంది. ఈ సంవత్సరం ఈ పురస్కారాన్ని ప్రముఖ కవి, రచయిత, పరిశోధకులు, గ్రంథాలయ వ్యవస్థాపకులు, దాశరథి పురస్కార గ్రహీత డా. కూరెళ్ళ విఠలాచారి గారికి ఇవ్వడానికి నిర్ణయించడం జరిగింది. హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ప్రారంభంలో ఉన్న 'సురభారతి' ప్రాంగణంలోని మీటింగ్‌హాల్‌లో ఈ కార్యక్రమం 10.12.2021నాడు సాయంత్రం 5 గంటలకు నిర్వహించబడుతుంది.

మూసీ సాహిత్య ధార ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరికీ సాదరంగా స్వాగతం పలుకుతున్నాం.

## తుకారాం అభంగం

ఎంత ఉపకారమో నాపై
కురిసె సాధు జనుల ప్రేమ
నాదు అంతరంగమిదే
జాగృతమవ్వగ

ఏమి దేవా
నీ భక్తి తరంగములలో
దించేసే ఈ ఉపదేశాలు
ఇక నీ పాదాల చెంతే
నాదు జీవనము

సహజమైన మధురవాణి
సాధు సజ్జనుల మార్గము
నడుతునిదే నేనీ
అమృత మార్గమున

తుకా పలికే నా చిత్తము నీపై
నిలిపితినిదే దేవా
నా తండ్రి విఠలా
నీవే కాచుమో దేవా




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

# భవభూతి తెలిపిన "పద్మపురం / పద్మ నగరం" ఏది?

**బాదరవేణి నాగరాజు,** తెలుగు ఉపాధ్యాయులు, నిజామాబాద్. ఫోన్ : 8106734042

భవభూతి మాలతీ మాధవ ప్రస్తావనలో **"అస్తి దక్షిణాపథే విదర్భేషు పద్మనగరం నామ నగరమ్"** అని మహావీర చరితం ప్రస్తావనలో **"అస్తి దక్షిణాపథే పద్మపురం నామ నగరమ్"** అని తెలిపాడు. మాలతీ మాధవంలో **"దక్షిణాపథే విదర్భేషు పద్మనగరం"** అని ప్రయోగించగా మహావీర చరితంలో **"దక్షిణాపథే పద్మపురం నామ నగరమ్"** అని ప్రయోగించాడు.


దక్షిణాపథంలోని విదర్భ అంటే In ancient days the country of Vidarbha comprises the whole of Berar, khandesh and portions of the nizams territory and Central provinces అని తెలుస్తోంది. విదర్భలోని నిజాం భూభాగం యొక్క భాగాలు అనగా పూర్వపు నిజాం రాజ్యం లోని నాందేడ్, ఔరంగాబాద్ జిల్లాలు, తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల లోని కొన్ని ప్రాంతాలుగా చెప్పవచ్చును. ఈ ప్రాంతాల్ని వాకాటకుల్లోని వత్సగుల్మ శాఖ రాజులు పాలించినట్లు తెలుస్తున్నది.

at the death of Hari sena in C.510 A.D (the Vakataka Kingdom).....practically the whole of Hyderabad state, Bombay, Maharashtra, Berar and most of Central provinces (to the south of the Narmada) over under its (the Vakataka Kingdom) direct administration అనే విషయం వాకాటకులు ఒకప్పటి హైదరాబాద్ రాజ్య భూభాగాలను పాలించారని తెలుపుతోంది.

ఈ పద్మపురం లేదా పద్మనగరం ఏది? ఎక్కడుంది? అనే విషయమై ఎందరో పండితులు ఎన్నో పరిశోధనలు చేసి వారి అభిప్రాయాలను తెలిపారు. విదర్భ ప్రాంతంలోని బండార జిల్లాలోని ఆమ్ గావ్ కి దగ్గరలోని పదమ్ పూర్ భవభూతి జన్మస్థలమని వి.వి.మిరాశి తెలిపాడు. స్థానికంగా పదమ్ పూర్ అని పిలువబడే ఈ పద్మపుర ఒక చిన్న గ్రామమని, అది ఆమ్గావ్ జమీందారిలో భాగమని, ఆమ్గావ్ రైల్వే స్టేషన్ కి రెండున్నర మైళ్ళ దూరములో ఉందని తెలిపాడు. ఈయన విదర్భలోని చందా, భండారా జిల్లాల్లో పదం పూర్, పద్మాపూర్ లేదా పదమ్ పూర్ అనే పేర్లతో గల దాదాపు ఆరు గ్రామాలను గుర్తించానని, ప్రాచీన పద్మపుర పెద్ద పట్టణమని ఇది వాకాటక రాజుల రాజధానిగా కూడా ఉందని పేర్కొన్నాడు. కాని ఆ పద్మపుర పట్టణంగా ఉన్నట్లు తెలిపే ఏ ప్రామాణిక ఆధారాలని చూపలేదు. పురావస్తు పరిశోధనలు తెలిపిన రెండు దేవాలయాలు ఉండటం వల్ల, శివుని ప్రతిమ లభించటం వల్ల, తైత్తిరీయ శాఖకి చెందిన బ్రాహ్మణులు ఈ పద్మపురకి దగ్గరలో ఉండటం వల్ల మిరాశి ఈ అభిప్రాయానికి వచ్చాడని జి.కె. భట్ తెలిపాడు.

మధ్యప్రదేశ్ దుర్గ్ జిల్లాలోని పనబరాస్ జమిందారీ ప్రధాన కేంద్రమైన మొహల్లాలో దొరికిన రాగిరేకుపై దాన్ని పద్మపుర నుంచి జారీ చేసినట్లుగా ఉందని... పద్మపుర ఒక పవిత్ర స్థలంగా పిలువ బడేదని దీన్ని జారీ చేసిన వాకాటక రాజు పద్మపురని రాజధానిగా పాలించి ఉండవచ్చునని Birth place of bhavabhuti అనే వ్యాసంలో మిరాశి అభిప్రాయపడ్డాడు.

రాష్ట్రకూట రాజు నన్నరాజు వేయించిన సంగలూడ శాసనం పద్మనగరం నుండి జారీ చేసినట్లు తెలుస్తున్నదని, అకోలా జిల్లాలో కనుగొన్న తామ్ర శాసనాలు నన్నరాజుచే పద్మనగరం నుండి జారీచేయబడ్డాయని, ఇవి వాకాటకుల అసంపూర్తి తామ్ర శాసనాల్లో మరియు సంస్కృత సాహిత్యంలో భవభూతి నివాసంగా పేర్కొనబడిన పద్మపురతో సమానంగా ఉండవచ్చునని,



Dr.B.ch.chhabra అభిప్రాయపడ్డాడు.

మాలతి మాధవంలో భవభూతి చెప్పిన **"అస్తి దక్షిణాపథే విదర్భేషు పద్మపురం"**లో విదర్భేషు అనే పదం ముద్రిత ప్రతిలో ఉన్నప్పటికి అన్ని రాత ప్రతులలో లేకపోవడం చేత గ్వాలియర్‌కి చెందిన M.V.లేలే, భవభూతి జన్మస్థలం విదర్భలో లేదని అన్నాడని, Birth place of Bhavabhuti అనే వ్యాసంలో వి.వి. మిరాశి తెలిపాడు.

బెల్వాల్కర్ పండితుడు పద్మపురంని బెరార్ ప్రాంతంలో ఉందని తెలుపుతూ **Bhavabhuti Says :** These hills and forests remind me of the Godavari and the southern mountains.The word "remind" (smarayanti, malati madhava. 3) clearly marks his familarity with the south as the erliar one. pending the discovery of new data then, we may assume that Bhavabhuti's ancestral home, padmapura, was in the Berars, and not near the site

of Narvar in Gwalior state. అని అభిప్రాయపడ్డాడు.

తోడర్‌మల్ పండితుడు మొదట భవభూతి నివాస స్థలం నాగపూర్ భూభాగాలలో ఎక్కడో ఓచోట ఉండి ఉండవచ్చు అని అభిప్రాయ పడ్డాడు. కానీ ఆ తర్వాత భవభూతి నివాస స్థలం గురించి చర్చిస్తూ, ఓ అద్భుతమైన విషయాన్ని తెలియజేశాడు. అదేమిటంటే "The river godavari must have been at or near his native Place" అని అన్నాడు. ఈ మాటలను బట్టి భవభూతి స్వస్థలం లేదా నివాస ప్రాంతం గోదావరి నదికి దగ్గరలో ఉంటుందని తెలుస్తున్నది.

ఇక భవభూతి ప్రయోగించిన **"పద్మపురం/పద్మనగరం, నామ నగరమ్"**, అనే వాక్యాన్ని బట్టి భవభూతి స్వస్థలమైన పద్మపురం లేదా పద్మనగరం ఖచ్చితంగా నగరమై ఉండాలి. భవభూతి కాలము క్రీ. శ 7 వ శతాబ్ది ఉత్తరార్థము, 8 వ శతాబ్దికి పూర్వార్థము అనగా క్రీ.శ.675 నుండి క్రీ.శ.725 వరకు అని విమర్శకుల అభిప్రాయము. ఇలా 7వ, 8వ శతాబ్దాలలోనే నగర స్థాయిని పొందిందంటే ఆ ప్రాంతానికి ఎంతో చారిత్రక ప్రాశస్త్యం ఉండి ఉండాలి.

మిరాశి పండితుడు "Bhavabhuti's padmapura was a nagara. yasodhara, a commentator of Vatsyayana's Kamasutra, defines nagara as a place where the business of 800 villages is transacted" అని తెలిపాడు. అంటే ప్రాచీన పద్మపురం ఆర్థిక, వాణిజ్య, వ్యాపార పరంగా ఎంతో ప్రసిద్ధంగా ఉండేదన్నమాట.

భండార్కర్, మిరాశి, బెల్వాల్కర్, కానే, కర్మార్కర్, తోడర్ మల్, జి.కె. భట్, అయోధ్యా ప్రసాద్ సింగ్ మొదలగు వారు ఈ పద్మపురాన్ని సరిగా గుర్తించలేరనేది సత్యదూరం కాదు. అయితే వారు తెలిపిన పద్మపురం, ప్రాచీనకాలంలో నగరంగా ఉందనడానికి, ఆర్థిక, వాణిజ్య, వ్యాపారపరంగా వృద్ధి చెందింది అనడానికి సమగ్రమైన ఎటువంటి చారిత్రక, శాసన, సాహిత్య ఆధారాలను చూపలేదు. అయితే పద్మపురంగా పిలువబడుతూ భవభూతి కాలానికే, ఇంకా చెప్పాలంటే భవభూతి కన్నా ముందు కాలం నుంచే నగరంగా ఉంటూ, ప్రసిద్ధి వహించిన ప్రాంతమే నేటి బోధన్ ప్రాంతం. ఈ బోధన్ నగరం పూర్వ నామమే పద్మపురం/పద్మనగరం. ఈ నగరమే భవభూతి పేర్కొన్న 'పద్మపురం' నగరం అని భావిస్తూ, పద్మపురం(బోధన్), నగరం అనేందుకు తగిన చారిత్రక,శాసన,సాహిత్య ఆధారాలను చూపడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

భవభూతి నివాస స్థానమైన పద్మపురమే బోధన్ అని షాహజలి అనే చరిత్రకారుని వాదము. అంబదాస్ కానోలే అనే మరో చరిత్రకారుడు వ్రాసిన ఒక వ్యాసము ఈ వాదనను బలపరుస్తున్నది. ఏకచక్ర మహత్యం అనే ఒక ప్రాచీన హస్త లిఖిత గ్రంథం గంగాధర రావు శాస్త్రి గారి వద్ద ఉంది. అందులో గోదావరి, మంజీర(నదుల) సంగమ స్థానం వద్ద పద్మపురం (బోధన్) ఉందని వ్రాయబడింది.

**'అత్యంత ప్రాచీన కాలం నుండి దక్షిణ భారతదేశ చరిత్రలో మహా రాజ్యాల కీర్తిని ఆర్జించి, అనేక రాజవంశాలకు రాజధానిగా విరాజిల్లిన ఒకనాటి మహానగరమే నేటి బోధన్.'** ఈ నగరం ఒకప్పుడు అశ్మక రాజ్యానికి రాజధానిగా ఉంది. ప్రస్తుతం ఈ నగరం తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో ఉంది. ఈ నగరానికి పద్మపురం, పద్మ నగరం, బహుధాన్య పురం, పోతలీ, పోతన, పోదన, పౌదన, బోధన, బోధన్ అనే పేర్లు కలవు.

బోధన్‌కి పద్మపురం అలంకారిక రూపమని, బోధన్ చుట్టూ నీరు ఉండి మధ్యలో కోట, పద్మము లాగా విలసిల్లుచున్నదనే అలంకారిక రూప వర్ణన కన్నడ పంప భారతంలో కలదని, బహువిధాలైన ధాన్యాలకు బోధన్ ఉత్పత్తి స్థానం అవడం వల్ల దీనికి బహుధాన్య పురము అను అన్వర్థ నామం ఏర్పడి ఉంటుందని పరిశోధకుల అభిప్రాయం. మహా భారతంలో అశ్మక రాజధానిగా చెప్పబడిన "పౌదన్యపురం" బోధన్ నగరమే. ఇదే బహుధాన్యపురంగా పిలువబడింది. ఈ బాహుధాన్యం క్రమంగా పౌదన్యం, పౌదనం, పోదనం, బోధన్ గా పరిణామం చెందింది.

ప్రఖ్యాత శాసన పరిశోధకులు డా.వి. పరబ్రహ్మశాస్త్రి గారు **"ఆంధ్ర ప్రదేశ చరిత్ర రాజకీయంగానూ, సాంస్కృతికంగాను, పోతన (నేటి బోధన్) విషయంతో ప్రారంభమైందనటానికి ఆధారాలు లభిస్తున్నాయి"** అని పేర్కొన్నాడు.

వినయ పీఠిక (46), అంగుత్తరనికాయ(213) ప్రకారం, క్రీ.పూ. 600 సవత్సరాల నాటికి, షోడశ మహా జనపదాల్లో నిజామాబాద్ పరిసర ప్రాంతాలు కరీంనగర్ జిల్లా ప్రాంతాలు కలిసిన గోదావరి తీరస్థ ప్రాంతమైన అశ్మకం(అస్సక) ఒకటని సుత్తనిపాతము(977) పేర్కొన్నట్లు తెలుస్తున్నది. బుద్ధుని సమకాలికుడైన అశ్మక రాజు సుజాతుడు, పోతలీ (బోధన్) పురమును పాలించినట్లు తెలుస్తున్నది. బోధన్ కు ఉత్తరాన 2 కి.మీ. దూరంలో అతి ప్రాచీన స్థలంలో 20 అడుగుల ప్రాచీన మట్టి కోట ఉందని, దీంట్లో జరిపిన తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి పూసలు,పెంకులు లభించాయని, ఈ మృణ్మయ దుర్గము క్రీ. పూ. 8వ శతాబ్దిలోనే శత్రు దుర్భేద్యంగా నిర్మితమైనదని, మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో మౌర్యుల ఆధీనంలోని 30 దుర్గాలలో అశ్మక కోట ఒకటని, ఇది బలిష్టమైనదని పేర్కొన్నట్లు తెలుస్తున్నది.

క్రీ.శ.1వ శతాబ్దానికి చెందిన కుందకుందాచార్యులు అనే జైన కవి తన 'దసబత్తి' అనే ప్రాకృత గ్రంథంలో పోదనపురం పవిత్ర తీర్థ స్థలమని, ఇక్కడ ఎందరో మునులు, ఋషులు నిర్వాణం పొందారని పేర్కొన్నట్లు తెలుస్తున్నది.

**"నగరే పోతనాభిధానే"** అన్న దానికి పౌదన్యమన్న పాఠాంతరం తర్వాత వచ్చిందని డా. సూక్తాంకర్ పేర్కొన్నట్లు తెలుస్తున్నది. మత్స్య పురాణములో, మహాభారతములో, బౌద్ధ గ్రంథమైన సుత్త నిపాతములో, రోమన్ శాస్త్రకారుడైన ప్లినీ వ్రాతలలో, దండి కవి దశకుమార చరిత్రలో, పంపకవి విక్రమార్జున విజయములో బోధన్ నగర వర్ణన కలదు.'

అప్పాప్రగడ జోగప్పయ్య వేయించిన బోధన్ కన్నడ శిలాశాసనము ద్వారా, పర్భణీ తామ్ర శాసనం ద్వారా, పంపకవి, విక్రమార్జున విజయం ద్వారా, బోధన్ నగరం గొప్ప వర్తక కేంద్రముగా ఉండేదని, ఆ నగరము సుందరంగా ఉండేదని, ప్రజలు భోగభాగ్యాలతో జీవించేవారని తెలుస్తున్నది.

అంతే కాకుండా బోధన్ లో దొరికిన క్రీ. పూ. 4 వ శతాబ్ది నాటి విద్దంక నాణేలు మరియు సామాగ్రిని బట్టి ఇక్కడ టంకశాల ఉండే దని, వీరు స్వతంత్రులు కాబట్టి స్వతంత్రులుగా నాణేలు ముద్రించారని చెప్పవచ్చు.

పై వివరాలను బట్టి పద్మపురంగా పిలువబడిన బోధన్ నగరం ఎంత ప్రాచీనమైనదో, ఎంత ఆర్థిక పరిపుష్టతను కలిగి ఉన్నదో తెలుస్తున్నది.

సంస్కృత వ్యాస భారతంలోని ఆది పర్వములోని సౌదాస సుతోత్పత్తి అనే (176వ) అధ్యాయంలోని 47 వ శ్లోకములో –

**తతోపి ద్వాదశే వర్షే సజజ్ఞే పురుషర్షభః।**

**అశ్మకో నామ రాజర్షి: పౌదాన్యం యోఽన్యవేశయత్॥**

(ఆ తరువాత పండ్రెండు సంవత్సరాలకు పశిష్ట మహర్షి దివ్య విధానం ద్వారా అయోధ్యా రాజైన కల్మషపాదునికి భార్య మదయంతికి కొడుకు పుట్టాడు. అతడు పురుషోత్తముడు, రాజర్షి అయి అశ్మకుడనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. అతడు తన అశ్మక రాజ్య రాజధాని నగరమైన (బోధన్) పౌదాన్య నగరంలో నివసించేవాడు) అని భావం.

మహాభారత కాలంలో అశ్మక రాజు ఎంత సంపద్వైభవం కలవాడో వ్యాస సంస్కృత మహాభారతంలోని సభా పర్వములోని ద్యూత పర్వము అనే ఉప పర్వములోని దుర్యోధన సంతాపము అనే 51వ అధ్యాయం లోని దక్షిణాత్య అధిక పాఠ శ్లోకములో–

**అశ్మకో హేమశృంగీశ్చ దోగ్ధ్రీర్హేమ విభూషితాః ।**

**సవత్సా: కుంభ దోహాశ్చ గా: సహస్రాణ్య దాద్ దశ ॥**

అశ్మక మహారాజు బంగారు తాపడం చేసిన కొమ్ములు, కుండల వంటి పొదుగులు కలిగి బంగారు హారాలతో అలంకరింపబడిన పదివేల గోవులను దూడలతో సహా ఇచ్చాడు అని ఉంది. దీన్ని బట్టి ఆనాడు ఈ అశ్మక (బోధన్) ప్రాంతం ఆర్థికంగా ఎంత పరిపుష్టంగా ఉండేదో తెలుసుకోవచ్చు.



చారిత్రకంగా భవభూతి కాలం తర్వాత ఈ నగర ప్రాశస్త్యాన్ని పరిశీలించినట్లయితే రాష్ట్రకూట రాజు దంతిదుర్గని సేనాని వినయాదిత్య యుద్ధమల్లుడు (యుద్ధమల్ల 1 క్రీ. శ.750–775). ఇతని సేవలకు మెచ్చిన దంతిదుర్గుడు ఇతన్ని బోధన్ (నిజామాబాద్), కరీంనగర్ ప్రాంతాలకు సామంత రాజుగా నియమించాడు. ఇతను బోధన్ పట్టణాన్ని రాజధానిగా చేసుకుని పాలించాడని తెలుస్తున్నది.

ఈతని రాజ్యం "సపాదలక్షతి" అని వ్యవహరింపబడేది. అంటే లక్షా ఇరవైయైదు వేల గ్రామాల దేశం. కృష్ణా, గోదావరి నదుల నానుకొని ఉన్న తెలంగాణలోని పశ్చిమ భాగం అనగా నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ మండలాలు పూర్తిగా, నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లోని కొంత భాగం ఆనాడు బోధను రాజ్యంలో ఉండేవని తెలుస్తున్నది.

బోధన పురము దిగంబర జైనులకు ప్రధాన కేంద్రము.... జినసేనాచార్యుని పూర్వ పురాణంలో పౌదన పురము ఈ విధంగా వర్ణింపబడింది.

**ఉపశల్య భువ: కుల్య ప్రణాళి ప్రస్తరోదకః**

**శాలీక్షుజీరక క్షేత్రైః వృక్ష తస్య మనోహరం**

(పౌదనపురము చుట్టును అందమైన వరిమళ్ళు, చెరుకు తోటలు, జిలకర చేలు, వృక్షములు మనోహరములై యుండినవి. ఈ పొలము లలో నిరంతరము కాలువలు పారుచుండెను) అని భావం. ఇది 9వ శతాబ్దము నాటి పోదన పురం వర్ణన.

వినయాదిత్య యుద్ధమల్లుని కాలంలో బోధన్ ఎంతో ప్రసిద్ధి వహించింది. అతని గొప్పదనాన్ని నిరూపించే శాసన, సాహిత్యాధారా లున్నాయి. 2వ అరికేసరి (క్రీ.శ 930–955) వేయించిన వేములవాడ శాసనంలోని మొదటి ప్రక్క 13,14,15 వరుసల్లో

**యః పోదనే సౌదామయిం గజానాం**

**విధాయ వాపిం అపి తైల పూర్తై ।**

**స సర్వ సేకం సతతం వితేనే**

**చాత్రో: కుచానాం అరి సుందరీనాం॥** అని వర్ణించబడింది. అంటే యుద్ధమల్లుడు పోదన నగరంలో 'ఇటుక, సున్నంతో ఒక చెరువు

(తటాకం) నిర్మించి, దాన్ని నూనెతో నింపి 500 ఏనుగుల దినవారి స్నానాలను ఏర్పాటు చేసెనని చెప్తారు. నేటికీ బోధన్ చుట్టూ పాండు, చక్రి, దౌత్యాల్, దుదియాల్, బల్లాల్ అను ఐదు చెరువులు ఉన్నాయి పైన చెప్పినది దుదియాల్ చెరువు.

పంపకవి తన విక్రమార్జున విజయం (కన్నడం)లో ఇదే విషయాన్ని ఉంటంకిస్తూ యుద్ధమల్లుని గొప్పదనాన్ని ఇలా వర్ణించాడు.

**ఏనం పేళ్వుదో సిరియు**
**ద్దానియ నెణ్ణియొళె తీవి దీర్ఘ కెగళనం**
**తానృపతి నిచ్చలయ్యూ**
**రానెయ నవగాహ మిరిసిదం బౌదననొళ్ (1-17)**

(అతని సంపద్వైభవము నేమని పొగడుదును. తన బోధన పురమునందలి కోనేరులను నూనెతో నింపి రాజు నిత్యమును 500 ఏనుగులను స్నానమాడించుచుండె) అని తెలుస్తున్నది.

ఇదే విషయాన్ని 3వ అరికేసరిబ(క్రీ.శ.966) తన పర్భణి శాసనంలో పేర్కొన్నాడు. ఈ శాసనంలోని 3వ పద్యంలో

**సపాద లక్ష భూమిభర్త తైలవాప్యాం సపోదనే**
**అవగాహోత్సవం చక్రే శక్ర శ్రీర్మదదంతి నామ్**

అని వర్ణించబడింది. అంటే యుద్ధమల్లుడు పోదన నగరంలోని నూనెతో నింపిన దిగుడు బావుల్లో తన మదపుటేనుగులకు అవగాహోత్సవాన్ని అంటే తలంటు స్నానం చేయించే ఉత్సవాన్ని నిర్వహించేవాడని తెలుస్తున్నది.

నిజానికి ఈ పర్భణి తామ్ర శాసనం బోధన్‌దే. బోధన్ లోని చెరువులో చేపలు పట్టేవారికి ఈ శాసనం దొరికింది. దాన్ని వారు, హైదరాబాదులో న్యాయవాదిగా పని చేస్తున్న పర్భణి వాస్తవ్యులైన గోవిందరావు నానల్ గారికి ఇచ్చారు. ఆయన ఈ శాసనాన్ని పూనాలోని భారతీయ ఇతిహాస సంశోధనా మండలి వారికి పంపించారు. ఆ పూనా సంస్థ వారు దానికి "పర్భణి తామ్ర శాసనం" అని పేరు పెట్టారని సీతారాం జాగీర్దార్ పేర్కొన్నాడు.


ఇంతటి చారిత్రక ప్రాశస్త్యము ఉంది. కనుకనే భవభూతి పేర్కొన్న పద్మపురం, బోధన్ అని భావించవచ్చు. ఈ వాదనకు బలాన్నిచ్చే వివరణ మనకు పంపకవి రాసిన విక్రమార్జున విజయంలో లభిస్తుంది. విక్రమార్జున విజయం తృతీయాశ్వాసంలోని 22వ రఘటలో ఏకచక్ర (బోధన్)ను పంపకవి ప్రత్యేకమైన పద్ధతిలో తొమ్మిది ద్విపదములలో వర్ణించాడు. ఈ పద్యాల తర్వాతి వచనంలో

**"యిన్నవు పోళల్గ ళిల్లా పోళల్గే నాల్కుయుగ దోళం, వసుమతి, పద్మనగర, మేక చక్రం, బహుధాన్యమెంబ నాల్కు పెసరాదు..."** అని రాశాడు. "దీని వలె మరియే పట్టణము గూడ లేదు ఈ పట్టణమునకు నాలుగు నామాలు గలవు వసుమతి, పద్మనగర, ఏక చక్ర, బహుధాన్య మనునవి వరుసగా నాలుగు యుగములందు పేర్లు" అని దీని భావం. అంటే త్రేతాయుగం నాటికే నేటి బోధన్‌కి పద్మనగరం అని పేరు ఉండేదని స్పష్టం అయింది. **'దీని వలె మరియే పట్టణము గూడ లేదు'** అని బోధన్ గురించి అనడాన్ని బట్టి ఇది ఆ రోజుల్లో పెద్ద నగరమని తెలుస్తోంది.

పరశురాముడు ఈ నగరమును తన చక్రంతో రక్షించడం వలన దీనికి ఏకచక్రపురం అని పేరు వచ్చిందని అతను ఈ నగరమునందే చక్రతీర్థమనే చెరువును నిర్మించెనని పాండవులు ఈ నగరమున దూదియాల్, దౌత్యాల్ అను తీర్థములను నిర్మించారని ఐతిహ్యాము. ఈ నగరానికి ఏకచక్రపురమనే పేరుని బలపర్చే మరొక ఆధారం కూడా ఉంది.

బోధన్ లోని శ్రీ గంగాధర శాస్త్రి గారి వద్ద సంస్కృతంలో రాయబడిన 'ఏకచక్రపుర మాహాత్మ్యం' అనే వ్రాతప్రతి పుస్తకం ఉందని, అందులో బోధన్‌కి ఏకచక్ర, బహుధాన్య నగరము అనే పేర్లున్నాయని దీని ఆధారంగా బోధన్‌లో జరిపిన త్రవ్వకాలలో ఏకచక్రేశ్వరాలయం బయట పడిందని, మరియు పంప కవి తన ఆదిపురాణంలో బోదనను, పీదన పురమని మూడుసార్లు రాశాడని, ఈ పీదన నుండి పొదనగా వ్యుత్పత్తినొందుట సమంజసమని సీతారాం జాగీర్దార్ పేర్కొన్నాడు.

'తోడర్ మల్' భవభూతి స్వస్థలం లేదా నివాస ప్రాంతం గోదావరి నదికి దగ్గరలో ఉంటుందని అన్నాడు. ఆయన మాటల్ని అన్వయించుకుంటే గోదావరి నది నుండి నేటి బోధన్ (నాటి పద్మపురం) నగరం కేవలం 21 కి.మి.దూరములో ఉంది. కానీ మిరాశి చెప్పిన పదమ్ పూర్ గోదావరి నదికి దూరం 480 కి.మి పైననే ఉంది. కాబట్టి 'తోడర్ మల్' సూచన ప్రకారం బోధన్ నగరమే పద్మపురం అయ్యేందుకు అవకాశం ఉంది. ఇంకా పద్మపురం(నేటి బోధన్) మహాభారత కాలంలోను, మహా జనపదాల కాలంలోను, బుద్ధుని కాలం లోను, వాకాటకుల, శాతవాహనుల, బోధన్ చాళుక్యుల కాలంలో ఇలా ప్రాచీన కాలం నుండి ఏ విధంగా ఉన్నత స్థితిలో (నగరంగా) ఉందో చర్చించాం. పైన చర్చించిన విషయాలను బట్టి, భవభూతి పేర్కొన్న పద్మ నగరం/పద్మపురం, అనే నగరం బోధన్ నగరమేనని భావించాలి.



బందారం కథలు -1

# మా వూరు తీరు

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148


మనుషలను పోలిన మనుషులున్నట్లే ఊళ్ళను పలిన ఊళు ్లంటాయి. ఒకే పేరుతో ఎంతోమంది ఉన్నట్టే చాలా ఊళ్లకు ఒకే పేరు ఉంటుంది. అట్లా ఒకే పేరున్న ఊర్లను గుర్తించేటప్పుడు మరొక గుర్తు తగిలించడం మామూలుగా జరిగేదే.

మా వూరు బందారం. అదే పేరుతో మరో బందారం ఉండటం వల్ల మా వూరు కట్టుపోతుల బందారం అయింది. మరోటి శేరిపల్లి బదారం. శేరిపల్లి పక్కన ఉంది గనుక అది శేరిపల్లి బందారం. సరే మాదే చిత్రం. 'కట్టుపోతుల' అనే ఊరేమీ లేదు. అటువంటి ఇంటిపేరు కూడా ఎవరికీ లేదు. మావూరు కట్టుపోతుల బందారమెందుకయిందీ అంటే మా వూళ్లో 'కనికట్టు' విద్యలో ఆరితేరిన వాళ్లుండేవారట. మంత్రాలతో దేన్నైనా కట్టడి చేయటం 'కనికట్టు'. అట్లా కట్టడి చేయటంలో దిట్టలున్న ఊరు, బంధం వేయటంలో బలమైన ఊరు కావటం వల్ల మా వూరు 'కట్టుపోతుల బందారం'గా ప్రసిద్ధి పొందింది.

నిజంగానే – కనికట్టుకు సంబంధించి చాలా కథలే ఉన్నాయి మా వూరు గురించి. మంత్రాలు, వాటి శక్తులు, వాటి ప్రభావాలు పక్కకు పెడితే కథలన్నీ ఆసక్తికరంగా, ఆశ్చర్యకరంగా ఉంటాయి. మరికొన్ని దు:ఖకరంగా కూడా ఉంటాయి.

మా వూరి నేలలో నీళ్లు తక్కువ. బండలెక్కువ. ఎక్కడ తొవ్వినా, ఎంత లోతు తొవ్వినా బండలే పడతాయి గనుక ఇది బందారమనే కథనం కూడా వుంది. బండల కింద గుండ్ల కింద బలయిపోయిన కథలు కూడా తక్కువేమీ కాదు. మా వూరు వెళ్లేటప్పుడు వూరికి మొదటనిలిచి ఆహ్వానించేది జంటగుండ్లు. తరువాత కొండాయబండ. ఆ బండ నడుమ కొంచెం నీళ్లు. పశువుల కింత మేత. పండీ పండని చేన్లు. గొర్లు, కుక్కలు, గొప్పలు, కొట్లాటలు, బర్రెలు, చెరువులు, బయ్యారాలు.

జంట గుండ్ల కాడ పశువులు కాసుకుంటూ ఐదారుగురు పిల్లలు సిర్రగోనె ఆడుకుంటున్నారు. యాదగిరి వాళ్లందరిలో వయసులో పెద్ద. బలవంతుడు. వాగుడుకాయ. గోనె జాడించి చిర్రను బలంగా కొట్టాడు. చిర్ర వెళ్లి దూరంగా గుబురు చెట్ల పొదల్లో పడింది. అందరి కంటే చిన్నపిల్లగాడు ఎల్లయ్య. ఎల్లుగాడనే పిలుస్తారందరూ. చిర్ర తేవాల్సిన పని ఎల్లయ్యది. లేకపోతే జట్టులో ఉండనివ్వరు. ఆడనివ్వరు. చిర్ర తేవాలి. అటు పోవాలంటే భయం. ఆ గుబురు పొదలంటే మరింత భయం. బుగులయితదని చెప్పాడు.



పాములుంటాయనీ, పాములంటే భయమనీ చెప్పాడు. భయపడొద్దని భరోసా ఇచ్చాడు యాదగిరి. అతను వెళ్ళలేదు. పిరికి ఎక్కువని బనాయించారు పిల్లలు. అయినా వెళ్లలేదు. రెండడుగులేసి ఆగిపోయాడు.

**'ఎల్లూ జంటగుండ్ల పౌరుషమన్నా ఉండాలె. బందారం పుటక పుట్టి భయపడితె ఎట్లరా'** యాదగిరి ఎంత అన్నా ఎల్లయ్య వెళ్ల లేకపోయాడు. ఎల్లయ్యను పిలిచాడు. జంటగుండ్ల కథ తెలుసా.... అడిగాడు. తెలువదని తలూపాడు ఎల్లయ్య. జంటగుండ్ల కథ చెప్పటం మొదలుపెట్టాడు. మిగతా పిల్లలు కూడా దగ్గరికి చేరారు.

మనూరి వాళ్లు రాజుగారికి కప్పం కట్టటం లేదని రాజుకు తెలిసిపోయింది. సైనికులెవరిని తోలించినా పొలిమేరల దాకా వచ్చి వెళ్లిపోతున్నారట. ఆరోజు బందారం నుంచి కప్పం వసూలు చేయాల్సిందేనని రాజు నిర్ణయించాడు. బలవంతులైన, ధైర్యవంతులైన సైనికుల్ని ఎన్నిక చేసి పదిమందిని పంపించాడట. పది గుర్రాల మీద పదిమంది సైనికులు గుంపుగా వస్తున్నారు. పొలిమేర దాటారు. వాళ్ల చేతుల్లో బరిసెలు, ఒరల్లో కత్తులు ఉన్నాయి. దుమ్ము, గిట్టల చప్పుడు, గుర్రాలు, సైనికులు వస్తున్న దృశ్యాన్ని దూరంనుంచే గమనించాడొక గొర్ల కాపరి. నడివయసు, భయమెరుగని వాడు ప్రమాదాన్ని పసిగట్టాడు. సైనికులొస్తే గొర్లకూ ప్రమాదమే. తనకూ

ప్రమాదమే. ఉపాయం తోచింది. గుబురు పొదల్లోకి వెళ్లి కొన్ని ఆకులు తెచ్చాడు. అరచేతిలోకనుకొని ఆకులు బాగా నలిపాడు. బాటకు అటు పక్క ఒకటి, ఇటు పక్క ఒకటి గుండ్లున్నాయి. రెండు గుండ్లమీద ఆకులు పిండి పసరు పోశాడు. గుండ్లు కదలటం మొదలు కాగానే పక్కన జరిగి గమనిస్తున్నాడు. సైనికులు జంటగుండ్ల దగ్గరికి చేరేసరికి గుండ్లు ఎగిరెగిరి గుద్దుకుంటున్నాయి. సైనికులు నివ్వెరపోయారు. గుండ్లు గుద్దుకోవటమేమిటి? గొనిఎలకాపరి నిలబడి తీక్షణంగా చూస్తున్నాడు. గుఱ్ఱం వెళ్లబోయి జడుసుకున్నది. మరో గుఱ్ఱం ముందుకెళ్లి గుండు తాకి పడిపోయింది. పడిపోయిన సైనికుడు లేచి వెనుకకు పరిగెత్తాడు. మిగతా సైనికులు అధైర్యపడ్డారు. ఫర్లాంగు వెనకకు వెళ్లి ఆలోచించారు. పొలిమేర గుండ్లే ఎగిరెగిరి గుద్దుకుంటుంటే వూరి మనుషులెంత వీరులో... నిజంగానే మంత్రమో మాయో అయితే వూరి మంత్రగాళ్లెంత మహిమ గలవాళ్లో... బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు. ప్రాణం మీద తీపితో సైనికులు ఎట్లొచ్చింగ్రో అట్ల పారిపోయింగ్రట. అట్లా ఒక్క గొర్లకాపరి పదిమంది సైనికుల్ని భయపెట్టి పంపిన చరిత్రరా మనది. భయపడితే ఎట్లరా! 'ఏం గాదు నేనున్న పో' యాదగిరి కథ ముగించి ధైర్యం చెప్పాడు. కథ విన్న తర్వాత ఎల్లయ్యకు కొండంత బలమొచ్చింది. గుబురు పొదల్లోకి వెళ్లి వెదుక్కొని చిర్ర తీసుకొచ్చాడు.

జంటగుండ్లను పరామర్శించిన తర్వాతనే బందారం వూర్లో అడుగుపెడతారెవరైనా. దాటి రెండు ఫర్లాంగులు ముందుకొస్తే కొండాయ బండ. బందారం వూరు నిలబెట్టిన పెద్దల్లో కొండయ్య ఒకరు. కొండంత బండ. వొడ్డెరలు మంటపెట్టి ఏండ్లకేండ్లు రాళు తీస్తున్నా ఇంకా మిగిలి వుంది. వొచ్చేవాళ్ళను, పొయ్యేవాళ్ళను పలకరించే బండ అది. బందారం పొందించేటప్పుడు ఎవరి యోచనైనా, ఎవరి పనితనమైనా గొప్పదే. బొడ్రాయి పొందించే టప్పుడు ఎవరి ముందుచూపయినా ఆ వూరు గుర్తు పెట్టుకొని పండుగ చేసుకోవటం గొప్ప. బందారం బొడ్రాయి, సారగమ్మ కథలు విశేషమైనవే. ప్రత్యేకంగా పెంచిన గొర్రెపొట్టేలును బలిచ్చి నెత్తురు సాకవోసి బొడ్రాయిని నిలబెట్టిన తీరు ఒకటయితే సారగమ్మను అడవినుంచి తెచ్చిన తీరు ఊరు మరువలేదు. పెద్దనుమాండ్ల దగ్గర జమగూడే ఊరి పెద్దలు అప్పుడప్పుడు ఆ కథలు చెప్పుకుంటుంటారు.

మీసాల మల్లయ్య మీసాల్లోనే మంత్రశక్తులుండేవంటారు. ఎన్నో ఊర్లు తిరిగి నేర్చుకొచ్చిన మహిమలు చూసి అందరూ అబ్బురపడేవారట. ఊరు బొడ్రాయి పొందించిన తర్వాత అడివి నుంచి సారగమ్మ దేవతను తేవాలె. సంద్రకఱ్ఱే అయి వుండాలి. పెద్దడివిలో పెద్దపులులు ఉన్నాయని వెళ్లటానికి భయపడి ఎవరూ ముందుకు రాలేదు. ఆ పనికి మల్లయ్యొక్కడే అర్హుడని అందరూ భావించారు. ఊరు స్థాపన పని పవిత్రమైందని మల్లయ్య సిద్ధపడ్డాడు. అతని కుటుంబం వొద్దని దు:ఖించిందట. కావలసిన వాళ్లు వారించారు. అయినా మల్లయ్య బండి కట్టుకొని ఒక గొడ్డలి తీసుకొని బయలుదేరాడు. అతని సాహసానికి సంతోషించినా, ఆ పెద్దల్లో కూడా కొంత సందేహం తొలుస్తూనే వున్నది. తెల్లవారుజామున బ్రాహ్మీ ముహూర్తంలో వెళ్లిన మల్లయ ఎంతకూ తిరిగి రాలేదు. ఉదయం గడిచింది. మధ్యాహ్నం దాటింది. సాయంత్రం అయినా జాడలేదు. సంధ్యవేళ, చీకటి ముసురుకుంటున్నది. కాబోయే ఊరు ఎదురుచూస్తున్నది. మనుషులు ఆందోళనలో ఉన్నారు. ఇంతలో పులుల గాండ్రింపులు వినబడ్డాయి. మల్లయ్య పని అయిపోయింది. పులులు ఇటువైపు వొస్తున్నాయేమోననిపించి భయపడుతున్నారంతా. చీకట్లో పరుగు, బండిచక్రాల చప్పుడు దగ్గరైంది. అందరూ అటు చూశారు. ఆశ్చర్యపోయారట. బండి కానికి ఎద్దుల్లేవు. కానికి వలపల దాపల పులులు ఉన్నాయట. పులుల మెడలో పొడుగాటి పాములు చుట్టి ఉన్నాయట. అవి మల్లయ్య చేతిలో పట్టుబడి ఉన్నాయి. ఎడ్లస్థానంలో పులులు, పగ్గల స్థానంలో పాములు చూస్తుంటే అక్కడున్న వాళ్లకు వణుకు పుట్టిందట. అందరి వంకా చూస్తూ మల్లయ్య విజయ దరహాసం చేసి సారగమ్మ కొయ్యదేవతను అందించాడట. అట్లా ఊరు నిలిచింది. బొడ్రాయి పక్కన స్థాపించిన సారగమ్మ ఇప్పటికీ పూజలందుకుంటుంది. మల్లయ్య మహిమలను బందారం ఇప్పటికీ చెప్పుకొని మురిసిపోతుంది. అట్లా బందారం విశిష్టతను గాలి కథలు కథలుగా చెబుతుంటే వినగలవాళ్లు విని ఉత్తేజితులవుతుంటారు. చుట్టుపక్కల పల్లెలకు అవి పరివ్యాప్త మవుతుంటాయి.

**జనశ్రుతి :** అంకిరెడ్డిపట్టె అనుబంధ గ్రామం దర్గా. 'దర్గా'ను బందారం దర్గా అనే అంటారు. ఎందుకంటారని దర్గా స్థాపకుడు ఫదరలీని అడిగితే **'బందారంతోనే దర్గ. బందారంతోనే ఉర్సు, బందారం పేరు పెట్టుకుంటేనే పైసలు పుడతయి'** అంటాడు.

బందారంలో స్థిరపడ్డ సంచారవృత్తి కళాకారుడు శారదమల్లయ్య. పుట్టి పెరిగిన ఊరు చెప్పుకోడు. శారదమల్లయ్య తనది బందారమనే చెప్పుకుంటాడు. ఎందుకని అడిగితే రొమ్ము విరుచుకొని చెబుతాడు. **"పద్దెనిమిదిమంది కుంటుంబం నాది. బందారంతోనే బతికింది. బందారం అని చెప్పుకుంటే అన్నం పుడుతుంది".**

**"ఎవడు పొందిచ్చిండో వూరు ఎప్పుడూ కటకటే"** అనేవాళ్లకూ కొదువ లేదు.

# మధుర కవి – కూరెళ్ళ విఠలాచార్య

**ఎం. పుష్పలత,** పరిశోధక విద్యార్థిని, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఫోన్ : 94900 63152



'జననీ జన్మభూమిశ్చ' అని వాల్మీకి మహర్షి రామునిచే పలికించిన మాటలు కూరెళ్ళ వారు నిజం చేశారనిపిస్తుంది. వాల్మీకి మహర్షి తమసా నదీతీరంలో సంచరించి ఆది కావ్యమును లిఖించి ధన్యుడయ్యాడు. కూరెళ్ళ వారు కూడా దందుభీ నదీ తీరం వెల్లంకిలో సాహితీ కుటీరాన్ని స్థాపించి సాహిత్య సృజన చేసి మధుర కవి నల్లగొండ కాళోజి అయ్యాడు. వెల్లంకి సాహితీ కుటీరం మట్టి పరిమళాలతో పాటు సాహిత్య కుసుమాలను వెదజల్లుతుంది. ఒకప్పుడు వెల్లంకి కుంటలు, చెరువులు, బావులతో కూడుకున్న సాధారణ ప్రాంతమే కాని ఇప్పుడు కూరెళ్ళ వారి పాదస్పర్శతో సాహిత్య కళను సంతరించుకుంది. అచ్చంగా పల్లెతో పెనవేసుకున్న జీవితం కూరెళ్ళవారిది. పల్లెలంటే వల్ల మాలిన ప్రేమ. ఎనభైయేండ్ల ముదిమి వయస్సులో సాహిత్య పరిరక్షణమనే కార్యాన్ని భుజానెత్తుకున్నారు. పట్టణానికే పరిమితమైన గ్రంథాలయాన్ని పల్లె ప్రజల గడప దగ్గరకు తీసుకువచ్చారు. లక్షల గ్రంథాల పరిరక్షణే కాకుండా సాహిత్య అధ్యయన కేంద్రంగా తీర్చిదిద్దాడు. సాహితీ కుటీరాన్ని తన పేరుకు పర్యాయపదంగా మార్చుకున్నారు. సాహితీ కుటీరాన్ని శాశ్వత చిరునామా చేశారు.

**పుట్టుకతోనె తండ్రి చనిపోయెను తల్లియె నన్ను పెంచె; ఇ**
**క్కట్టుల నెన్నొ పొందెను సుఖంబననేమొ ఎరుంగదాయె; న**
**న్నెట్టులొ వీధి బళ్ళొ చదివించెను మేధకు వన్నెపెట్టెనో;**
**నట్టి దయార్ద్ర మాతృచరణాలకు మ్రొక్కెద విఠ్ఠలేశ్వరా...**

కూరెళ్ళ వారి బాల్యం, విద్యాభ్యాసం ఎదుర్కొన్న ఇక్కట్లను ఒక్క పద్యంలో తెలిపారు. తల్లిదండ్రులకు ఒక్కరే సంతానం. ఒంటరినని ఈ కష్టాలు కన్నీళ్ళను తోబుట్టువులుగా వెంట తెచ్చుకున్నారు. ఘడియ ఘడియకు చూపును తగ్గించే గ్లోకోమా వ్యాధి జీవితాన్ని అంధకారం లోకి నెట్టేసింది. అయితేనేం పట్టువదలని విక్రమార్కునిలా సాహిత్య సృజన, సాహిత్య పరిరక్షణ చేస్తున్న నిరంతర సాహిత్య కృషీవలుడు.

డా॥ కూరెళ్ళ వారి సాహితీ ప్రస్థానం ఆరు దశాబ్దాలుగా కొనసాగుతుంది. డా॥ కూరెళ్ళ నిగర్వి, నిరాడంబరుడు, కల్తీలేని నిఖార్సైన వ్యక్తి. తాను నిర్వహించే సాహితీ సమావేశాలు, పండుగ వాతావరణం తలపిస్తాయి. ఉపాధ్యాయులుగా, ఉపన్యాసకులుగా, రచయితగా విమర్శకులుగా, వక్తగా, వివిధ సాహితీ సంస్థల స్థాపకులుగా, విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రేరణగా నిలిచిన ధన్యజీవి. ఏ రంగంలో అడుగుపెట్టినా అది పావనమై పదికాలాలు నిలుస్తుంది. దానగుణంలో కూడా ఒక మెట్టుపైన్నే నిలిచారు. తన సొంత భూమినే దానం చేసిన బలిచక్రవర్తి వంటి నిండు దానగుణాన్ని నిలుపుకున్న మానవ మహనీయుడు. ఇంటినే గ్రంథాలయంగా మార్చిన మానవతా మూర్తి. కూరెళ్ళ వారు సాహిత్యలేఖిని నుంచి ఇరవైకి పైగా గ్రంథాలు రచించబడ్డాయి. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆ ప్రేరణలో **తెలంగాణ కాగడాలు** అనే గ్రంథం రచించారు.

కూరెళ్ళ వారు పరిశోధనకు ఎంచుకున్న అంశాలు అసామాన్య మైనవి. సాధారణంగా పరిశోధనకు ఉపక్రమించే వారు సులభమైన అంశాలను ఎన్నుకొని పరిశోధన చేస్తారు. కూరెళ్ళ వారు అందుకు భిన్నంగా ఎంచుకున్నారు. వివరాలు లభించనివి, అతి ప్రయత్నం మీద సాధించేవి అసామాన్యమైన అంశాలను ఎన్నుకొన్నారు. శాస్త్రీయ పరిశోధన గావించి, ప్రామాణికమైన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఆవిధంగా కూరెళ్ల వారి యం.ఫిల్., పి.హెచ్.డి. పట్టా పొందిన గ్రంథాలు ప్రముఖుల ప్రశంసలందుకున్నాయి. ఈనాటి పరిశోధకులకు రిఫరెన్సులుగా నిలుస్తాయి. కూరెళ్ళ వారి యం.ఫిల్. సిద్ధాంత గ్రంథం **'తెలుగులో గొలుసుకట్టు నవలలు'.** అసలు తెలుగు సాహిత్యంలోనే గొలుసుకట్టు నవలలు ఒక ప్రయోగం. తెలుగు సాహిత్యానికి కొత్త ప్రక్రియ. ఈ గొలుసుకట్టు నవలల మీద పరిశోధన చేసిన మొదటి వ్యక్తి కూరెళ్ళ విఠలాచార్య. కూరెళ్ళ వారు గొలుసుకట్టు నవలలను ''సమిష్టి సాహిత్య రచనగా'' నిర్దేశించారు. ఈ రచనా సంవిదానాన్ని సమర్ధించారు కూడా. భారత రచనలో నన్నయ నారాయణ భట్టు సాయం తీసుకున్న



సంఘటన అందరికి సుపరిచితమే. పోతన భాగవత రచన కూడా సమిష్టి రచనగానే భావించారు. ఒక రచయిత అనేక రచనలు చేయడం సాధారణం. అనేకమంది రచయితలు కలిసి ఒక రచన చేయడం ఆశ్చర్యం. ఇటువంటి విభిన్న ప్రక్రియ గొలుసుకట్టు నవల, పలువురు రచయితలు అంచెలంచెలుగా ఒక నవలలోని కథలను నిర్వహిస్తే అది గొలుసుకట్టు నవల. పలువురి చేతిలోపడి కథ చమత్కారంగా మెలికలు తిరుగుతూ ఊహించని విధంగా అంచెకంచెకో మలుపు, మజిలీ మజిలీకి కొన్ని కొత్త పాత్రలు, ఖండఖండానికి ఎన్నో సన్నివేశాలు, అధ్యాయానికి అధ్యాయానికి ఆయా రచయితలు అనుభూతులను బట్టి మూలకథలో కొత్త పాత్రలు కొత్త వాతావరణం సృష్టించబడుతుంది. భాగాల్లో కఠినమైన ముగింపు, చిత్ర చిత్రంగా ఆరభం. మెరుపుల్లా మెలికలు మలుపులు తిరుగుతూ సాగుతుంది. రచయితలు ఖండ ఖండాలుగా ఒకరి తర్వాత ఒకరు రచన చేస్తూ కథను గమ్యస్థానం చేరుస్తారు. ఒకరు విడిచిపెట్టిన భాగాన్ని మరొకరు, మరొకరు విడిచిపెట్టిన భాగాన్ని ఇంకొకరు చేపట్టి గొలుసు కట్టుగా రచనను చేసుకుంటూ సమాప్తం చేస్తారు.

గొలుసు కట్టు నవల తెలుగులో ప్రచురణ రూపంగా కాక ప్రసార రూపంలో రేడియోలో ఆరంభమైంది. ఆదర్శ జీవులు మొదటి గొలుసుకట్టు నవల చాలామంది కవులు కవయిత్రుల రచయితల రచయిత్రుల అభిప్రాయాలను సేకరించి అవి తమ పరిశోధనలో వినియోగించుకున్నారు. తాము చెప్పదలుచుకున్న విషయాలను రాజీ పడకుండా సూటిగా సున్నితంగా చెప్పారు. ఇరివెంటి కృష్ణమూర్తి పర్యవేక్షణలో **'తెలుగులో గొలుసు కట్టు నవలలు – పరిశీలన'** అనే నూతన ప్రక్రియను చేపట్టి కృత కృత్యులైనారు.

**తెలుగు నవలలు – స్వాతంత్రోద్యమం** అనే అంశం ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డా॥ ముదిగొండ శివ ప్రసాద్ గారి పర్యవేక్షణలో పి. హెచ్.డి. పూర్తి చేశారు. ప్రగాఢ జాతీయ భావాలు గల తల్లా ప్రగడ సూర్యనారాయణ, వెంకట పార్వతీశ్వర కవులు, వేలూరి శివరామశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ మొదలైన ప్రముఖ రచయితల నవలలు సమగ్రంగా పరిశీలించి పొందుపరిచారు. స్వాతంత్రోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిని కొందరిని ఇంటర్వ్యూ చేసి, స్వాతంత్ర సమర యోధులకు లేఖలు వ్రాసి వాటికి ప్రత్యుత్తరంగా వారు తనకు వ్రాసిన సమాధాన లేఖలు పరిశోధన గ్రంథంలో పొందుపరిచారు. పరిశోధన దక్షతకు నిదర్శనంగా నిలుస్తాయి. ఒక ప్రామాణిక శాస్త్రీయ పరిశోధన గావించి తన సొంత నిర్ణయాలు ప్రకటించిన శాస్త్రీయ పరిశోధకుడు కూరెళ్ల.

దేశభక్తిని స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని హృదయమందు నిలుపుకొని చేసిన రచన స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్‌లో దాని స్వరూపం అన్న గ్రంథం వెలువరించారు. మొదటి భాగంలో స్వాతంత్ర్యోద్యమాన్ని చరిత్రను, రెండవ భాగంలో ఆంధ్రుల జాతీయ పోరాటాన్ని, మూడవ భాగంలో హైదరాబాద్ సంస్థానం 1724 మొగలు చక్రవర్తి నిజామ్ ఉల్‌ముల్క్‌ని నియమించటం సాయుధ పోరాటం నిజాం భారత సైన్యాలకు లొంగిపోయాడు. భారతదేశానికి అంగ్లేయ పాలన విముక్తి ఆంధ్రదేశానికి నిజాం పాలన నుండి విముక్తి పొందిన స్వాతంత్ర్య సమరాలను సంక్షిప్తంగా కొండను అద్దంలో చూసినట్లు రచించారు. అందరికీ సుపరిచితమైన స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను, ప్రత్యక్షంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వారి అభిప్రాయాలు సేకరించారు. నెహ్రూ గారి ట్రస్ట్ విత్ డెస్టినీలో ప్రసంగ వాక్యాలతో ముగించటం, స్వాతంత్ర్య సమరం పరిసమాప్తమునకు చిహ్నం.

కూరెళ్ళ హృదినుండి జాలువారిన రచన, విఠలేశ్వర శతకం, తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియ వాడిపోని కుసుమం. పాల్కురికి సోమనాథుని నుండి ఆధునిక రచయితల వరకు ఆధునిక భావ జాలంతో దేదీప్యమానంగా వెలుగుతుంది. విఠలాచార్య తండ్రి గారు మహారాష్ట్రలోని పండరీ పురంలో వెలసిన విఠ్ఠలుని భక్తుడు. దేవుని పేరునే తన కుమారునికి విఠల్‌గా నామకరణం చేశారు. విఠలాచార్యుల వారు పాండురంగ విఠ్ఠలేశ్వరుని భక్తులు. ఒకనాడు ఇంటి గేదెకు వైద్యం చేయిస్తుండగా అది ఎగిరి మీద పడటం వల్ల ఎడమకాలు విరిగింది. వైద్యం చేయించకుంటూ మంచంపై పరుండి తన స్థితికి, లోకం పోకడలకు కలత చెందాడు. ఆ సంవేదనా ఫలితమే విఠ్ఠలేశ్వర శతకం. తన బాధలను, సమాజపు విపరీత చేష్టలన్నింటిని విఠలేశ్వరునికి విన్నవించుకున్నారు. ఈ విఠలేశ్వర శతకంలో భక్తి, వైరాగ్యాలు ప్రధానంగా కనిపిస్తాయి. సమకాలీన అంశాలను వస్తువుగా స్వీకరించారు. నల్లధనం, రాజ్యమేలడం, దొంగలు దొరలుగా చెలామణి అవ్వడం, కుటిల మనస్తత్వాలు, దోపిడీలను నిరసించడం మొదలైనవి చూస్తే కవికి సామాజిక స్పృహ ఎక్కువనిస్తుంది. ఈ విఠలేశ్వర శతకం, వేమన శతకం సుమతీ శతకం సరసన చేర్చదగినది. విఠలేశ్వర శతకంపై రెబ్బ మల్లికార్జున్ ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం సమర్పించారు.

ఉదాహరణకు విఠలేశ్వర శతకంలోని ఒక పద్యము.....

**"తప్పనరాదు చౌర్యమును తప్పనరాదు దవినీతి కార్యమున్**
**తప్పనరాదు మోసము తప్పనరాదు వికాకవేషమున్ తప్పనరాదు"**

అనే పద్యంలో మోసము, అనైతిక ప్రవర్తనే ఆదర్శనీయమవు తుందనీ, నైతిక విలువలు పతనమవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

**"కనకము కల్గియన్ ఒకడు కావరమెక్కెడు వాడు నొక్కడున్**
**శునకము బుద్ధి వాడొకడు సోకులమారి మరొక్కడిమ్ముగా"**

ఒక్కొక్క మనిషిది ఒక్కో ప్రవర్తన. భిన్న రకాల మనస్తత్వాలను చక్కగా విశ్లేషించాడు. ఇలాంటి అమృతపు గుళికల్లా పద్యాలు అద్భుతమైనవి ఎన్నో మరెన్నో ఉన్నాయి.

'శిల్పాచార్యులు' పద్యకృతి కూరెళ్ల వారి ఇరవై అయిదు పద్య ఖండికలతో సరళ సుందరంగా తీర్చిదిద్దబడింది. విఠలాచార్య వారి పద్యగద్య రచనల్లో ప్రజల భాష, మాండలిక భాష కన్పిస్తుంది. కఠిన పదాలు చాలా స్వల్పం. పదాలకు అర్థాలను వెతుక్కొనవలసిన అవసరం పాఠకుడికి ఉండదు. పాఠకుడు ఏకబిగిన పఠనం చేస్తూ అర్థాన్ని సులభంగా గ్రహించవచ్చు. పద్యమంటే కాఠిన్యమే కాదు, సరళంగా కూడా రాయవచ్చని నిరూపించారు. కూరెళ్ళ గారికి భువనగిరి పట్టణానికి అవినాభావ సంబంధం ఉంది. విద్యాభ్యాసం భువనగిరి పట్టణంతో ముడిపడి ఉంది. భావి జీవితానికి బాట చూపిన భువనగిరిని, ఆప్యాయతతో అక్కున చేర్చుకున్న ప్రముఖులను, అమ్మలా లాలించిన విశ్వకర్మ వసతి గృహాన్ని, చేయూతనిచ్చిన మాన్యులను, చదువు చెప్పిన గురువర్యులను కృతజ్ఞతలతో స్మరించిన కవితా శిల్పి కూరెళ్ళ. బి.ఎన్. శాస్త్రి, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఎలిమినేటి వంటి మహనీయుల్ని స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. తన అక్షరశిల్పంతో శిల్పాచార్యుల కావ్యాన్ని మలచిన తీరు అద్వితీయమైనది.

శిల్పాచార్యులు పద్య కవితల్లో బి.ఎన్. శాస్త్రి, ఎలిమినేటి మాధవరెడ్డి గార్లు మరణించిన సందర్భాన్ని పురస్కరించుకొని వ్రాసిన పద్యాలు స్మృతి ప్రధానమైనవి. శాస్త్రిగారిని గురించి వ్రాసిన పద్యాలలో ఆయన చేసిన కృషి, శాసనాలను పరిశోధించి చరిత్ర వ్రాయటం, నవలలు రాయటం మూసీ పత్రిక స్థాపించడం వరకు స్మరించారు.

**ఊళ్ళన్ని వడబోసి రాళ్ళరాత చదివి**
**వేలయేండ్ల చరిత వెలికి తీసె...**
**మూసి పత్రిక స్థాపించి ముందు ముందు**

మొదలైన పద్య కవితలు గ్రంథం నిండా పరచుకున్నాయి.

కూరెళ్ళ 1968-1989 మధ్యకాలంలో రచించి వివిధ పత్రికలలో అచ్చయిన కవితల సమాహారమే ఈ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు. సమాజంలోని కుళ్ళు కుతంత్రాలను ఎత్తి చూపాడు. అసమానతలు, పక్షపాత వైఖరులు, గర్భస్థ శిశువునే అంతమొందించే విషపు జలపాతాలు తొలగిపోవాలంటారు. 'జన్మద్వారాల మూసివేత' భ్రూణ హత్యల్ని, చంపే సంస్కృతిని ఎండగట్టారు. ఏసు, సోక్రటీసు,




మహాత్ముడు వంటి వారికి పునర్జన్మ లేకుండా చేస్తున్నారని వాపోయారు. హైదరాబాదు మెహందీ, వ్యభిచార కేంద్రాన్ని పోషించడం, స్త్రీని గౌరవించకుండా వ్యభిచారాన్ని కానుకగా ఇచ్చిందని వ్యంగ్యంగా తెలిపారు. దేవుణ్ణి కూడా అపవిత్రం చేస్తున్నారని గుండు కొట్టించు గుండంలో మునిగితే పాపాలు తొలగి పోతాయని పాపభీతి లేని దైవభక్తిని నిరసించాడు. 1976 నాటి కోస్తా జిల్లా తుఫాను పూర్తిగా మానవ తప్పిదమే అన్నారు. కవియంటే కవిత్వమంటే వట్టి మాటలు కావు. కవిత్వమంటే కాలమును చూపిస్తూ లెమ్ము లెమ్మని లేపే నినాదాలని కవిత్వానికి కొత్త నిర్వచనమిచ్చాడు. కవి ప్రజల హృదయాల్ని కదలిస్తాడు. దిక్సూచిలా ముమ్ముందుకు నడిపిస్తూ ప్రజల్ని మేల్కొలుపుతూ కార్యసాధకులను చేస్తాడు. కవిత్వానికి అనిర్వచనీయమైన శక్తి ఉందంటాడు. తిరోగమనం కవితలో కవి అభ్యుదయ భావాలని చూడవచ్చు. పూజారికే దేవుడిపై అనుమానమున్నదంటూ హేతువాద దృష్టిని చాటాడు. దేశము పేర ప్రతిజ్ఞ చేయండి... కవిలోని దేశభక్తి, చైతన్యానికి పరాకాష్ఠ. కాన్ఫిడెన్షియల్ రిపోర్టులోని కవితలన్ని కలికితురాయి వంటివి. సమాజంలోని మింగుడుపడని చేదు నిజాలను తనదైన శైలిలో వ్యంగ్యంగా చెప్పారు. భావాలు అలవోకగా, సుస్పష్టమై కవి అంతరంగంతో తాదాత్మ్యం చెంది అనుభూతిని పొందేలా చేస్తాయి. సానబట్టిన కొద్దీ వజ్రం ఎలా కాంతినిస్తుందో ఈ కవితలు లోతుగా పరిశీలించినా కొద్దీ భావుకత వెల్లివిరుస్తుంది.

కూరెళ్ళ మరో అక్షర కృతి **"దొందూ దొందే"**. ఇందులోని కవితలు 'మినీ కవిత' ప్రక్రియకు చెందినటువంటివి. మినీ కవితలు అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనగా చెప్పవచ్చు. కొద్ది మాటల్లోనే గొప్ప భావాన్ని ఆవిష్కరించే శక్తి రచయితకుండాలి. దొందు దొందే కవితా సంపుటి బాలసాహిత్యం కోవలోకి చేరుతుంది. బాలల మేధస్సు వికసించడానికి, బాలలకు చక్కని సంస్కారం అలవర్చుకోవడానికి సహాయపడుతుంది. బాలల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తుంది. సామాజికపరమైన అనేక విషయాలు తెలుసుకొని, భావి భారత

పొరులుగా, మెలగడానికి ఈ కవితలు దోహదం చేస్తాయి. మినీ కవితా ఖండికలు సరళ సుందరంగా ఉన్నాయి. వేమన పద్యాలవలె అత్యంత సహజ సుందరంగా ఉన్నాయి. ఇందులోని 108 కవితా ఖండికలు పెద్దలను చిన్నలను ఆకట్టుకుంటాయి. పండితులను, పామరులను అలరించె కవితా శిల్పం కూరెళ్ళ వారిది. జన వ్యవహారంలోని "దొందు దొందే" అనే పదబంధమను మకుటంగా చేర్చి కవితా ప్రయోజనాన్ని సాధించారు. ఈ రెండు పంక్తులతో విషయాలను సాధారణీకరించి సమర్థించడం ప్రశంసనీయం. చిన్న చిన్న కవితా పంక్తుల్లో గొప్ప సందేశాన్ని కవి పాఠకులకందించారు. **'కష్టమెరుగని పదవి – నష్టమెరుగని పెదవి దొందు దొందే' 'కడుపు నిండని జీతం – కడుపు పండని జీవితం' 'కంచె లేని చేను – కండ లేని మేను' 'రాళ్లమీది నడక – ముళ్ళమీది పడక' 'ఆదరించని పుత్రుడు – ఆదుకోని మిత్రుడు'...** ఇలా ప్రతి ఖండిక దేనికది ప్రత్యేకమైనవి, సందేశాత్మక మనవి. ఇలా కూరెళ్ళ వారి చేతిలో అతి సామాన్య పదము కూడా కవిత్వ ప్రయోజనాన్ని పొందుతుంది.

కూరెళ్ళ వారి విద్వత్‌లేఖిని నుంచి వచ్చిన మరో రచన నానీ నేత్రాలు. కూరెళ్ళ వారు అన్ని ప్రక్రియల్లోను తనదైన ముద్ర వేశారు. పద్య, గద్యం, గద్య కవిత, నాటిక, బుర్రకథ, త్రిపదలు, ఆధునిక కవితా ప్రక్రియ నానీలు. నానీలను అలవోకగా అల్లారు. ఈ నానీల్లో కూరెళ్ళ వారి సాహిత్యానుభవం, వయస్సుతో పండిన భావ పరిణత, సామాజిక ఆలోచనాత్మకత, అవసరమైనప్పుడు ఓ వ్యంగ్యం, ఓ అధిక్షేపణ ఈ నానీల నిండా పరుచుకున్నాయి. ఎనభైయేండ్ల వయస్సులో కూడా ఆధునిక ప్రక్రియని అందిపుచ్చుకున్నారు. ఆలోచనలు అనుభూతులు, భావాలు జ్ఞాపకాలు ఇప్పటికి తాజాదనాన్ని వెదజల్లుతున్నాయి. భౌతికంగా అలుముకున్న చీకటిని చిల్చుకుని భావ ప్రకాశంతో కాంతిని ప్రసరిస్తున్నాయి. సమాజపు వికృత పరిణామాలను ఎప్పటికప్పుడు ఘాటుగానే విమర్శిస్తున్నారు. రాజకీయాలపై వ్యంగ్య బాణాలను సూటిగా సంధిస్తున్నారు. "ఓట్లకాలమొచ్చింది మా ఊళ్ళో అసలు బిచ్చగాళ్ళు కనబడతనే లేరు" ఓట్ల కోసం రాజకీయ బిక్షమెత్తారని సుతిమెత్తగా ఖండిస్తున్నారు. "నా ఈ దేహం నేను పుట్టిన పల్లెమట్టిలోనే కలిసిపోవాలి" అన్నట్లుగానే తన జీవితమంతా స్వచ్ఛమైన పల్లెకే అంకితం చేశాడు. ఈ విధంగా ప్రతి నానీ పఠనీయమై పాఠకుల హృదయాలను స్పందించేలా చేస్తుంది. ఎన్ని నానీలు వచ్చినా కూరెళ్ళ వారి నానీ నేత్రాలు ప్రత్యేకంగా నిలుస్తుంది. సాహితీ పరిమళాలను వెదజల్లుతూనే ఉంటుంది. కూరెళ్ల వారి అమృత లేఖిని నుంచి ఇంకా అనేక గ్రంథాలు రావాలని ఆశిస్తున్నాను.

## ఇక శూన్యంలో.....

నీ పయనం ఎక్కడ మొదలైందో
అది మాత్రమే నీకు తెలుసేమో బహుశా
మనసు లోతుల్లోకి, మనిషితనంలోకి
ఎంతగా చేరువైందో అది మాకే తెలుసు...
ఊహలకు ఊపిరై...
కన్నీటి కడగండ్లను తుడిచి
ఉద్యమాలకు ఊతమిచ్చి
నిరాసక్తతకు చైతన్యమద్ది
గెలుపుదారుల్లో నడిపించి
జయకేతన గీతాలాలపించి
తెలుగు సాహితీ సేద్యంలో....
భావాల అమ్ముల పొదినుండి
అక్షర శరాలను నాటిన హాలికుడవు నీవు
మండుటెండల్లో కురిసిన మంచుబిందువువై
ఉదయించిన సూర్యుని చైతన్యపు రాశివై
రాలిన చెమట చుక్కలకు విరిసిన వింజామరవై
ఓటమి నీడను కూడా దరిచేర్చని ధీరుడవై
విధాత తలపు నుండి ప్రభవించిన
కవన వాక్ప్రవాహం నీవు
నుదుటి రాతలు రాసే విరించి కలానికి తోడుగా
ఆదిభిక్షువును ఏమీ కోరకుండానే...
తరలిరాని వసంతాన్ని మాలో పూయించి
శిశిరాన్ని మాకు మిగిల్చి
దరికి రాలేని దారులు వెతుక్కుంటూ...
సాగుతున్న నీ గమనం
నీ కవితా పూదోటలో వెదజల్లిన
పరిమళాలతో శ్వాసిస్తూ శూన్యంలో మేము...

**అరుణ ధూళిపాళ**
ఫోన్ : 8712342323

నివాళి

# ప్రౌఢ పద్య కళానిధి ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరం

**డా. బి. నీలిమా కృష్ణమూర్తి,** సహాయ కార్మిక అధికారి, ఫోన్ : 97000 80030



ఒక వైజ్ఞానికవేత్త, ఒక శాస్త్రజ్ఞుడు,ఒక ఆధ్యాత్మికవేత్త, ఒక కవీశ్వరుడు, ఒక నిరంతర పరిశోధనాసక్తుడు కలిసి మూర్తీభవించిన రూపమే మన ఆచార్య వి.ఎల్.ఎస్ భీమశంకరం గారు. ఆంధ్ర సాహిత్యలోకం గర్వించదగిన కవివర్యులు. తెలుగు పద్యంలోని మాధుర్యాన్ని చవిచూపి మరొక్కమారు పద్యకవిత ఘనతను చాటిన ఘనులు వీరు. ఆచార్య భీమశంకరంగారు ఖండఖండాంతరాల్లో ఖ్యాతిగాంచిన భూభౌతిక శాస్త్రజ్ఞులు. దేశవిదేశాల్లో అపూర్వమైన గౌరవాలు పొందిన వైజ్ఞానికులు. వారి జ్ఞానతృష్ణ అంతటితో తీరలేదు. నిరంతర పరిశోధనాభిలాషులై ఆంధ్రసాహితీజగత్తును ఆనంద మొందించు ప్రౌఢకావ్యాలను నిర్మించారు. పద్యం తన ప్రభావాన్ని కోల్పోలేదని ఋజువు చేశారు. పద్యాలతో ప్రయోగాలు చేశారు.


ప్రౌఢ పద్యకళానిధిగా సుపరిచితులైన ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరం గారు 19వ తేదీన కార్తీక పౌర్ణమి నాడు శివ సాయుజ్యం పొందారు. వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారిని స్మరించుకుంటూ అక్షర నీరాజనాలు.


ఆచార్య వెల్దండ నిత్యానందరావు గారి పర్యవేక్షణలో నేను ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరం గారి కావ్యాలపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టా పొందడం జరిగింది. ఆ సాహిత్యానుబంధాన్ని పురస్కరించుకొని వారిని గురించి నాలుగు మాటలు...

ఆచార్య వేము లక్ష్మీనారాయణ సుబ్రహ్మణ్య భీమశంకరం గారు 1931 నవంబరు 16వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి పోలవరంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. వీరు తమ తల్లిగారైన శ్రీమతి లక్ష్మీకాంతమ్మ వైదుష్యాన్ని, తండ్రిగారైన శ్రీ వ్యాసమూర్తి భాషాభినివేశాన్ని పుణికిపుచ్చుకున్నారు. దక్షారామ భీమేశ్వర వరప్రసాదంగా విద్వత్కుటుంబంలో జన్మించిన వీరు రస హృదయులైన శాస్త్రవేత్తగా పరిఢవిల్లారు.


భీమశంకరంగారు తమ విద్యా ప్రస్థానంలో అన్నింటా తామే ప్రథములై దూసుకెళ్ళారు. 13 ఏళ్ళ ప్రాయంలోనే ఎస్ఎస్ఎల్‌సిలో జిల్లా ప్రథములుగా నెగ్గారు. 19 ఏళ్ళకే ఎమ్.ఎస్‌సి., పట్టాను పొందారు. భూభౌతిక శాస్త్రంలో అకుంఠిత దీక్షతో అధ్యయనం సాగించి ఒక ఆచార్యులుగా, ఒక శాస్త్రవేత్తగా ఎందరో ప్రతిభావంతులను ఉత్తమ పరిశోధకులుగా తీర్చిదిద్దారు. 35 ఏళ్ల ప్రాయంలోనే భూభౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులయ్యారు. బోధనా రంగంలో పెక్కు పదవులను అధిరోహించారు. అనేక వైజ్ఞానిక, సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. 60 ఏళ్ళ ప్రాయంలో పదవీ విరమణ అనంతరం మాతృభాషాభిమానియై, మాతృదత్తమైన పద్యాల రుచిని మరవక తనలో నిగూఢంగా వున్న కవితాశక్తిని వెలికితీసి మెరుగులు దిద్దుకున్నారు. రసవత్తరమైన పద్య కావ్యాలు రచించి సాహితీ శాస్త్రజ్ఞులైనారు.


భీమశంకరంగారు ఆధునిక సాహిత్యలోకంలో ఆణిముత్యాలవలె ప్రకాశించే కావ్యాలను రచించారు. **రసస్రువు, శివానంద మందహాసం** మొదలైన ప్రౌఢ కావ్యాలను, **శ్రీరామ! నీనామ మేమి రుచిర!** యను పద్య నవలను **దక్షారామ భీమేశ్వర శతకము, భీమ శతకం** అను రెండు శతకాలను, **శ్రీ దక్షారామ భీమేశ్వరోదాహరణ కావ్యము**ను














రచించారు. అప్పుడప్పుడూ వీరు వ్రాసిన పద్యాల సంకలన గ్రంథంగా ఆత్మీయ కవితా కదంబాన్ని కూడా కూర్చారు. 2016లో శ్రీమదాంధ్ర శివానంద రామాయణము (బాలకాండ) రచించారు. పద్య వైభవాన్ని ప్రకటించే వారి కావ్యాలను గురించి సంక్షిప్తంగా తెలిపే ప్రయత్నం చేస్తాను.

**రసస్రువు :** 1998లో వెలువడిన ప్రౌఢ ప్రబంధం రసస్రువు. ఈ కావ్యం భీమశంకరంగారి తొలి రచన. వారి వంశ చరిత్ర. కవి గారి ఇంటి పేరు వేము. ఈ కావ్య వస్తువు వేము వంశ గాథావళి. భీమశంకరంగారు చిన్నతనంలో వారి పెద్దల నుండి విన్న కథలను క్రోడీకరించి, వాటిలో రెండు ప్రధాన కథలను గ్రహించి, వాటికి కొన్ని నూతన కల్పనలు చేసి743 పద్యాలతో **"రసస్రువు"** గా మలిచారు. కావ్యమంతా కూడా పేరులేని పాత్రలతోనే నడవడం మరొక విశేషం. కవి ఈ కావ్యంలో అపూర్వ ఛందస్సుల నెన్నింటినో ప్రయోగించారు. పలువురు సాహితీ వేత్తలు ఈ కావ్యాన్ని "ఛందస్సుల ప్రయోగశాల" యని, "ఛందో విశ్వ ప్రదర్శనమని" కొనియాడారు. ఈ కావ్యం అనేకానేక ఛందస్సులకు లక్ష్యలక్షణ సమన్వితమని, ఛందో విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చు. ఈ కావ్యాన్ని గూర్చి నండూరి రామకృష్ణమాచార్యుల వారి మాటల్లో...........

**"స్థూల దృష్టితో అనుశీలించినచో ఈ కావ్యం వేమువంశగాథ. సూక్ష్మ దృష్టితో చూచినచో ఈ ప్రబంధం వేయి సంవత్సరాల తెలుగు పద్య శిల్ప సర్వస్వం."** ఇది సార్థకమైన ప్రశంస.

**శివానందమందహాసము :** రసస్రువు పద్యాల ప్రయోగశాలయైతే "శివానందమందహాసము" ద్విపద ఛందస్సుకు పట్టిన నీరాజనం. 2004లో వెలువడిన ఆధునిక ద్విపద శివపురాణం. గానానుకూలమైన ద్విపద ఛందస్సులో పార్వతీ పరమేశ్వరుల లీలావిలాసాలను ఈ కావ్యంలో కవి ఎంతో రమ్యంగా గానం చేశారు.

ప్రయోగాలకు అలవాటుపడిన ఈ శాస్త్రజ్ఞ కవి తమ తొలి రచనలలో అపూర్వ ఛందస్సులను ప్రయోగించడంతోపాటు గర్భిత వృత్త పద్యాలను కూర్చగా, ద్వితీయ రచనయైన ఈ కావ్యంలో భీషణమైన నియమాలను పెట్టుకొని ద్విపద కావ్య రచనలోనూ తనదైన ముద్రను ప్రదర్శించారు. సర్వ'ల'కార ప్రాసతో కావ్యాన్ని చివరివరకూ నడపడమే గాక ద్విపదపాదాలను అంత్యప్రాసాలంకారశోభితంగా అలంకరించారు. అంతటితో ఆగక సీసపద్యపాదాలను గర్భితం చేశారు. ఈ విధంగా కఠినమైన నియమాలతో "భీముని" పట్టువలె భీమేశ్వరుని రసరమ్యంగా స్తుతించి ధన్యులైనారీ భీమశంకరులు. తన అద్భుత కల్పనా చాతుర్యంతో వైజ్ఞానికాంశాల సమన్వయంతో తీర్చిదిద్దారు.

ఈ కావ్యాన్ని కవి ''జానుతెనుగు'' లోనే నడిపించారు. జనవ్యవహారంలో లేని, కేవలం నిఘంటువులలో మాత్రమే కనిపించే అనేక మారుమూల పదాలకు కావ్యంలో స్థానం కల్పించి తిరిగి వాటికి ప్రాణదానం చేశారు. 'ల'కార ప్రాసాక్షరాలు సంస్కృతాంధ్రలలో ఎన్నివున్నాయో అన్నింటినీ ఈ కావ్యంలో చేర్చి తరింపచేశారు. సర్వ'ల'కార ప్రాస, అంత్యప్రాసాలంకార సీసమాలికా బంధ ద్విపదగా శివానంద మందహాసాన్ని సృజించారు. కావ్యరచన పట్ల కవికి గల ఆసక్తికి, భాషా పరిరక్షణపట్లవారికి గల గురుతర బాధ్యతకు ప్రబల తార్కాణమీ కావ్యం.

**"వస్తువులో ఛందస్సులో, ప్రక్రియలో వినూత్న ప్రయోగాలను సంతరించుకున్న విశిష్ట కావ్యమని"** ఆచార్య యస్.వి.రామారావుగారు, **"ఇది తెలుగుల అదృష్టము. ఇదిశివ సంకల్పము. భీమశంకరుడు సంప్రదాయ కావ్యభిక్ష పెట్టినాడు"** అని ఆచార్య ముదిగొండ శివప్రసాద్ వంటి విద్వన్మణులు ప్రశంసించిన ఆధునిక ద్విపద కావ్యమిది

**<u>శ్రీరామ! నీనామ మేమి రుచిర! :</u>** భీమశంకరంగారి నాల్గవ పద్య కావ్యం శ్రీరామ! నీనామ మేమి రుచిర! భీమశంకరంగారు 2006వ సంవత్సరంలో "దక్షారామభీమేశ్వర శతకము"ను మరియు శ్రీరామ! నీనామమేమి రుచిర! అను లఘుకృతిని కూడా వెలువరించారు. వీరి తొలి మూడు రచనలకు భిన్నమైనది ఈ నాల్గవ రచన. సాంఘిక ఇతివృత్తంతో కూడిన ఈ కావ్యాన్ని పద్య నవలగా చెప్పవచ్చు. పుస్తక నామాన్ని బట్టి ఇది భక్తిగ్రంథంగా అనిపిస్తుంది. ఇందులో రామభక్తి పుష్కలంగా వర్ణింత మయ్యింది కూడా. అయితే ఈ కావ్యం కరుణరసాత్మకమై విషాదంగా ముగుస్తుంది. అపరాధ పరిశోధనే ప్రధానాంశమై నడిచే కావ్యమిది. ఎలాంటి ఇతివృత్తాన్నైనా రసస్ఫోరకంగా, అలంకారాత్మకంగా ఛందస్సులో ఇమడ్చవచ్చని కవి ఈ కావ్యం ద్వారా ఋజువు చేశారు. తాను చిన్నతనంలో విన్న కథకు స్వకపోల కల్పనలు చేసి, అత్యంత ఆసక్తికరంగా ఈ కావ్యాన్ని నడిపారు. ఈ కావ్యంలో ఆంజనేయ దండకం కూడా ఉంది. అలాగే త్రోటకం, భుజంగ ప్రయాత మాలిక, పంచచామరం వంటి అత్యుత్తమవృత్తాలతో కవి శ్రీరాముని స్తుతించారు. కవి తన కవితాధారలతో మనోజ్ఞ దృశ్యాలను ఆవిష్కరించారు. ప్రకృతి ఆరాధనలో, ప్రకృతి పరిశీలనలో కవిది అందెవేసిన చేయని నిరూపించే పద్యాలు మచ్చుకకు రెండు..

**ఉ॥ వేసవికాలమందు వరివిత్తెడు రేగడినేల నల్లగా**
**మాసియు, నాట్ల పిమ్మటను మానుగ పచ్చని అంతరీయమున్**
**వేసిన రీతిగా, ముదిరి పెంపుగ పండ సువర్ణ వర్ణమై**
**భాసుర లీల కన్పడును పండువుగా గన నేర్పు గల్గినన్.**

పచ్చని పంట పొలాలను కళ్ళముందు నిలిపి ఆనందిపచేసే అద్భుత భావన. భూభౌతిక శాస్త్రజ్ఞుడు కవిత్వం వ్రాస్తే ఇలాకాక ఎలా ఉంటుంది!


**ఉ॥ పండిన చేలలో పసిడి వన్నెల ధాన్యపు వెన్నుగుత్తు లు**
**ద్దండములయ్యు తల్లి వసుధామణికిన్ తలవంచి మ్రొక్కిన**
**ట్లుండి ముదంబు కూర్చు సభలో గురుదేవులకున్ వినమ్ర ప్ర**
**ణ్మండిత పండితోత్తములు మానుగ మ్రొక్కెడు భంగి చూడగన్.**


ఒక భూభౌతిక శాస్త్రజ్ఞుడు. అందునా అధ్యాపకుడు, ప్రకృతి ఆరాధకుడు కూడా అయితే, కవిగా మారి కవిత్వం వ్రాస్తే, ఆ కవిత్వంలో వెన్నుగుత్తులు, ఉద్దండములు వంటి పద ప్రయోగాలు, చక్కని ఉపమలతో స్పష్టీకరించే విషయ బోధనలు ఉండకుండా ఉంటాయా?

ఇలాంటి పలు అంశాలకు నిలయమీ కావ్యం. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ రచింపబడిన ఉత్తమ కావ్యం శ్రీరామ! నీనామమేమి రుచిర!

**<u>ఆత్మీయ కవితా కదంబం:</u>** 2010లో వెలువడిన లఘుగ్రంథమిది. భీమశంకర కవి ప్రౌఢకావ్యాలు వెలువరిస్తూనే అప్పుడప్పుడూ సమయానుకూలంగా, వివిధ సందర్భాలలో వ్రాసిన పద్యాలను ఒకచోట చేర్చి కూర్చిన కవితా కదంబం ఈ గ్రంథం. 27 కవితా ఖండికలతో ఈ గ్రంథం కూర్చబడింది. డా॥ ఆచార్య ఫణీంద్ర గారు ఈ గ్రంథానికి సంపాదకత్వం వహించారు. అశేష సాహితీ ప్రియులను విశేషంగా ఆకట్టుకోవడం వలన ఈ గ్రంథం "విస్తృతీకృత సంపుటి"గా మరల 2013లో ద్వితీయ ముద్రణను పొందింది. ఇందులో మరిన్ని కవితలు చేరి 36 ఖండికలతో ఈ చిరు పుస్తకం రూపొందింది. రెండవ ప్రచురణలో గ్రంథాదిన గల 'డెందాలకి విందు' అను శీర్షికతో వ్రాసిన పరిచయంలో ఆచార్య పొన్నపల్లి వెంకట కృష్ణయ్య గారి మాటల ద్వారా ఈ పుస్తక విశిష్టత అవగతమవుతుంది. "నలభీమపాకం" షడ్రసోపేతమైతే, "కవి భీమపాకం" నవరసభరితం. మొదటిది ఘ్రాణ రసనేంద్రియ మార్గంలో తనువులను తనియింపచేస్తే, రెండవది దృక్ శ్రవణేంద్రియ మార్గంలో డెందాలకు విందు చేస్తుంది. నవరస భరితమైన 'కవితా వంటకా'లను కవి భీములు అందించిన గొప్ప సంకలనమిది.

**<u>దక్షారామ భీమేశ్వర శతకము :</u>** భీమశంకరం గారు రెండు శతకాలను వ్రాశారు. 1. శ్రీ దక్షారామ భీమేశ్వర శతకము 2. భీమశతకం. 2006లో శ్రీ దక్షారామ భీమేశ్వర శతకము వెలువడగా 2010లో భీమశతకం వెలువడింది. మొదటిది భక్తి శతకం కాగా రెండవది నీతిశతకం. 11వ శతాబ్దానికి చెందిన వేములవాడ భీమకవి తాను దక్షారామ భీమేశ్వరస్వామి పుత్రుడనని చెప్పుకొనగా, శ్రీనాథుడు "ప్రౌఢ నిర్భరవయ: పరిపాకమున" భీమేశ్వర పురాణాన్ని రచించిన విషయం అందరికీ తెలిసిందే. దక్షారామ క్షేత్ర స్థితుడైన శ్రీ భీమేశ్వర స్వామి, దేవేరి శ్రీమాణిక్యాంబల అనుగ్రహంచే జన్మించిన ఈ భీమశంకర కవి భక్తి భావ నిర్భరంగా 138 మత్తేభశార్దూల వృత్తాలతోకూర్చిన శతాధిక స్తవం శ్రీదాక్షారామ భీమేశ్వర శతకం. ప్రకాశం జిల్లా వాడరేవు నుండి వెలువడే ఆధ్యాత్మిక మాసపత్రిక "ఆంధ్రజ్యోతి" ధారావాహికంగా ఈ శతకాన్ని కొన్ని నెలలపాటు ప్రచురించింది. ఈ శతకంలోని పద్యాలు వీనుల విందుగా, సహృదయ హృదయ మనోరంజకంగా సాగాయి. ప్రతిపద్యం కంఠస్థం చేయదగిందే. భీమ శంకర కవికి భీమేశ్వర స్వామికి మధ్య జరిగిన సంభాషణమే ఈ శతకం. ఈ భక్తి శతకంలో కూడా కవి తనదైన




ముద్రను ప్రదర్శించారు. సందర్భానుగుణంగా పౌరాణిక వైజ్ఞానికాంశాలను ప్రస్తావించారు.

**<u>భీమ శతకం :</u>** కవి **"విమల సుగుణ ధామ వేము భీమ"** అను మకుటంతో వ్రాసిన శతకం భీమశతకం. ఈ శతకంలో కూడా 150 పద్యాలున్నాయి. కవి తమ ఇంటిపేరు, తన పేరు, తమ ఇలవేల్పు భీమేశ్వరుని పేరు వచ్చునట్లుగా చక్కని నామౌచిత్యంతో కూర్చిన శతకమిది. వృత్తం ఆటవెలది. విషయం ఆధ్యాత్మికం, సామాజికం, దేశభక్తి, రాజకీయాలు, నీతి, అవినీతి.... ఇలా కవి తమ జీవితానుభవాన్ని రంగరించి రచించిన జాతి రతనాల వంటి పద్యాల ముక్తకం ఈ శతకం. మిగతా రచనల్లో వలె క్లిష్టమైన పదాలతో గాకుండా ఈ శతకంలో కవి అతిసరళమైన పదాలతో, అన్యభాషా పదాలను కూడా విరివిగా వినియోగిస్తూ సులభమైన శైలిలో పద్యాలను రచించారు. సుందరమైన భావాలతో మనసుకు హత్తుకునే ఉపమానాలతో, మస్తిష్కంలోకి చొప్పించే నుడికారాలు, జాతీయాలతో, మితహిత వాక్కులతో ఈ శతకాన్ని అందించారు. ఆత్మాశ్రయ కవితా ధోరణిలో సాగిన పద్యరచనతో సమాజానికి దర్పణంగా భాసిస్తున్న ఈ శతకం చదువరుల్ని ఒకింత ఆలోచింపచేసి, కర్తవ్యోన్ముఖుల్ని చేస్తుందనడంలో లేశమైనా సందేహం లేదు.

**శ్రీ దక్షారామ భీమేశ్వరోదాహరణ కావ్యము :** ఈ కావ్యం 2009లో వెలువడింది. పద్యవశంకరుడు భీమశంకరుడు వినూతనంగా రచించిన కావ్యం శ్రీ దక్షారామభీమేశ్వరోదాహరణ కావ్యం. ఆధునిక కాలంలో ఉదాహరణ కావ్యాల సంఖ్య చాలా తక్కువ. ఈ అరుదైన ప్రక్రియలో కూడా కవి దక్షారామ వాసుని స్తుతించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఉదాహరణ ప్రక్రియ స్తుతి ప్రధానమైనది. గానానుకూలమైనది. పరిమాణంలో కూడా చిన్నది కావటంచేత నిత్య పారాయణకు అనుకూలంగా ఉంటుంది. భీషణమైన నియమాలతో కావ్యరచన చేయుటకు అలవాటు పడిన ఈ భీమశంకరులు సర్వలక్షణ సమన్వితంగా, విభక్తి పూర్వకంగా, వైవిధ్య ఛందోభరితంగా, భక్తి పురస్సరంగా ఈ కావ్యాన్ని రచించి **"దైవ భక్తులకు భక్తి కావ్యంగాను,**

# సీతారామ స్వామీ..!

నింగి పైకెగసిన 'బాలు'ని మరణవార్త ఒక
మహోగ్ర అశనిపాత ధ్వనియై మా చెవులనే
కాదు మా మనసునూ మూగ చేసిందే...

ఇంతలోనే ఇవాళ 'అగ్గిపెట్టి కడిగెయ్ సిగ్గులేని
లోక దౌష్ట్యాన్ని' అన్న కలం బుగ్గిపాలైందా...

చరిత్ర ఎరుగని మహాపాతకం
తెలుగు సినిమాపాటకు ఎందుకు పట్టిందో...

వేటూరితో మాట్లాడి ఆపాదమస్తకం
ఒళ్ళు నిమిరి పాద నమస్కారం
చేసుకుందామనుకుంటే చెప్పా పెట్టక
గాలియై గగనానికి వెళ్లిపోయాడే.....

రోజూ పాడుతా తీయగాలో ముసిముసిగా
నవ్వుతూ కనిపిస్తూనే ఉన్నాడు కదా అంటూ
పరోక్ష నమస్కారాలు ఎన్నో పెట్టుకుంటూనే
ఉన్నప్పటికీ విశ్వక్రిమి విషంతో చూస్తూ
ఉండగానే బాలూ వాలిపోయాడు
వెళ్ళిపోయాడు....

సిరివెన్నెలనైనా పలకరించి ఆయన
పుక్కిటి నవ్వు సిరికి తనిసిపోదామనుకుంటే
క్షణంలో కనుమరుగైనాడే....

సీతారామస్వామీ....
మేం జేసిన నేరంబేమి......

సినీ మహాకవులలో ఒక దిగ్గజం సిరివెన్నెల
ఆ ఫీంకారధ్వనికి క్షతి ఉండదు.
ప్రతి ఇంటి టివి తెరలపై మార్మోగుతూనే ఉంటుంది
పూర్వీకుల వలెనే....

నా స్మార్ట్‌ఫోన్ తెర తడుస్తున్నది
తుడుచుకుంటూ నా రెండు కళ్ళూ
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను

ఒక మంచి కవి జననాన్ని ఊహించలేం
మరణం గురించి తెలిసి భరించలేం
ఇది భాషనేర్పే ఏడ్పు
ఎటకో పయనాలు....

**గురిజాల రామశేషయ్య**
**ఫోన్ : 703 267 9471**

**కవి తల్లజులకుఉదాహరణ కావ్యంగాను "** అందించారు. కవి ఉదాహరణ వాఙ్మయ లక్షణాలను "భూమిక" లో విపులంగా వివరించారు. సాహిత్య విద్యార్థులకు ఉపకరించే విలువైన పీఠిక ఇది.

భీమశంకర కవి ఆశు, మధుర, విస్తర, చిత్ర కవిత్వాలను నాలుగు శాఖల లోను తమ పాండిత్యాన్ని ప్రదర్శించారు. వ్యుత్పత్త్యభ్యాసములను మించిన ప్రతిభ వీరిసొంతం.తమ కావ్యాలందు వివిధ ఛందస్సులను సందర్భోచితంగా ప్రయోగించడంలో కడు నిష్ణాతులు వీరు. కొన్ని వృత్తాలను మాలికలుగా కూర్చడంలో వీరికి గల ఆసక్తి ప్రశంసింప తగింది. అనర్గళమైన ధారాశుద్ధితో, శబ్ద సౌష్టవంతో, శయ్యా సౌభాగ్యంతో పరిపుష్టమైంది వీరి కవితారచన.

వర్ధమాన కాలంలో బహుముఖీనమైన ప్రజ్ఞ గలవారు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో భీమశంకరం గారు ఒకరు. వీరు ఆధునికులలో ఆధునికులు. సనాతన ధర్మాచార పరాయణతను సంతరించుకున్న ఆధునికులు. ఏ విషయం చెప్పినా, ఏ పని చేసినా నిర్దిష్టంగా నిక్కచ్చిగా, ఎలాంటి సందేహాలకు తావు లేకుండా చెప్పడం చేయడం వారి గుణం. పౌరాణికాంశాలను వైజ్ఞానికాంశాలతో సమన్వయం చేస్తూచెప్పడం వీరి విశిష్టత.

భీమశంకర కవీంద్రుడు ఆంధ్రభాషామతల్లిక అల్లారు బిడ్డడు. స్ఫురద్రూపి. ఆంధ్రాంగ్ల సంస్కృత భాషల్లో పండితుడు. వృత్తిరీత్యా దేశవిదేశాల్లో పర్యటించి గడించిన అపారమైన లౌకిక జ్ఞానాన్ని, వయస్సు రీత్యా పొందిన అనుభవాన్ని మేళవించి, రంగరించి రచించిన వీరి కావ్యాలు తెలుగు సాహిత్య లోకంలో విశిష్ట స్థానాన్ని అలంకరించాయి. సాహితీ ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి. ఇది వారి ఉపజ్ఞ.

ఆధ్యాత్మిక రచనా వ్యాసంగాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా మలచుకొని కన్నుమూసేవరకు కలం కదిలించి, నిండు పున్నమి నాడు ఊర్ధ్వ లోకాలకు చేరిన పరమ భక్తకవి మన ప్రౌఢపద్యకళానిధి ఆచార్య వేము లక్ష్మీనారాయణ సుబ్రహ్మణ్య భీమశంకరం గారు. వారికి అశ్రు నివాళులర్పిస్తూ...

తే.గీ. కావ్య కుసుమాల మాలలు ఘనముగాను
కోరి తీర్చగ భవునికి కోర్కెదీర
శివుని మాసమందున చేరి శివుని కొలువ
ఇచ్చ కలిగెనేమొ? పిలుపు వచ్చెనేమొ?
తరలి వెడలె నాచార్యుడు తన్మయముగ
ప్రౌఢకవి వేము భీముడు వైభవముగ
నిండు పున్నమి నాడున నింగిలోన
మెరిసి నిలిచెను కార్తీక మెరుపు యగుచు.

నివాళి

# విధాత తలపున వెలిగిన "సిరివెన్నెల"

**డా. డి. కామేశ్వర రావు,** సినీ గేయ రచయిత, విమర్శకుడు, హైదరాబాద్. ఫోన్ : 98487 99648

**నిజమైన కవిత్వం ఆస్వాదించాలంటే నిశ్శబ్దాన్ని చదవడం నేర్చుకోవాలి. నిశ్శబ్దాన్ని మించిన కవిత్వం వేరొకటి లేదు. అక్షరాల కలయికతో ఏర్పడే పదానికి అర్థం ఉంటుంది. అర్థవంతమైన పదాల కలయికతో ఏర్పడే వాక్యాలకు తాత్పర్యం లేదా భావం ఉంటుంది. అక్షరాల మేళవింపు, పదాల పోహళింపు కవిత్వం కాజాలదు. ఆ అక్షరాలు లేదా పదాల మధ్య ఒక గాఢమైన నిశ్శబ్దం ఉంటుంది. ఆ నిశ్శబ్దాన్ని మథించాలి. ఆ నిశ్శబ్దంగా మనం మారిపోవాలి. అప్పుడు మనలో కలిగే సంఘర్షణ కవిత్వమార్గం అవుతుంది. ఆ సంఘర్షణా నంతరం కలిగే ప్రశాంతత నుండి ఉద్భవించే అనిర్వచనీయమైన ఆనందమే కవిత్వ లక్ష్యం, ప్రయోజనం అవుతుంది. అటువంటి కవిత్వాన్ని సృజించడమే కవి జీవితం కావాలి. అటువంటి కవుల కవిత్వంలో ఒక తాత్త్వికత నిరంతరం ప్రసరిస్తూ ఉంటుంది. అది సామాజికునిలో నిత్య చైతన్యస్రవంతిలా ప్రవహిస్తూ ఉంటుంది. అలాంటి కవిత్వాన్ని ప్రకటించడం మామూలు కవుల కన్నా సినీకవులకు మరింత కత్తిమీద సాములా ఉంటుంది. వారిలో సిరివెన్నెల సీతారామశాస్త్రి పేరు ఎప్పుడూ ముందువరసలోనే ఉంటుంది.**

శబ్దరూపమైన అక్షరం పుట్టుకకు ముందు నిశ్శబ్దం ... ఆగిపోయాక నిశ్శబ్దం... ఈ రెండు నిశ్శబ్ద బిందువుల మధ్య సాగే అక్షర విన్యాసం కవిత్వానికి రూపం అవుతుంది. రూపమాత్రమైన కవిత్వం నిశ్శబ్దంలోకి జారిపోయాక అంతర్మథనంగా సాగే చింతన కవిత్వ తత్త్వం అవుతుంది. మనిషి జననం ముందు ఒక నిశ్శబ్దం... మరణానంతరం ఒక నిశ్శబ్దం. ఈ రెంటి మధ్య సాగే ప్రయాణం జీవితానికి రూపం అవుతుంది. ఆ జీవితం గురించిన అనంత చింతన జీవన సార్థక్యానికి బాట అవుతుంది. జీవితాన్ని పాటల రూపంలో కవిత్వీకరించిన కవులలో సిరివెన్నెల సీతారామశాస్త్రి కలం ఎప్పుడూ పదునుగానే ఉంటుంది.

ప్రతి మనిషి జీవితం సామాజికం, మానసికం, ఆత్మీయం అనే మూడు రకాల బంధాలను కలిగి ఉంటుంది. వీటి స్వరూప నిరూపణలో కవి సాగించే పోరాటం సత్యాన్వేషణకు దారి తీస్తుంది. ఆ సత్యాన్వేషణమే కవికి ఋషిత్వాన్ని, కవిత్వానికి పటుత్వాన్ని, సమాజానికి దిశానిర్దేశాన్ని కలిగిస్తుంది. అటువంటి సత్యాన్వేషి సిరివెన్నెల సీతారామశాస్త్రి.

"కవిత్వం ఒక అల్కెమీ... దాని రహస్యం కవికే తెలుసును.." అంటాడు తిలక్. అటువంటి రహస్యం కోసం రాత్రంతా మేలుకొని, అంతర్మథించుకొని, తననితాను పిండుకొని, తెల్లారే తూరుపు ప్రపంచంపైకి వెదజల్లే కిరణాల్లా తన కవితామృతాన్ని అందరికీ



పంచాలనే తపనతో తపసిలా జీవించిన కవి మహర్షి సిరివెన్నెల సీతారామశాస్త్రి. **ఆనందం, ఆవేశం, ఆవేదన, ఆశావాదం అనే నాలుగు 'ఆ'కారాలతో జీవితాన్ని విశ్లేషించిన అక్షరశిల్పి సిరివెన్నెల సీతారామశాస్త్రి.** "కదిలేది కదిలించేది, మారేది మార్పించేది, పెను నిద్దుర వదలించేది" అని శ్రీశ్రీ ఆశించిన కవిత్వానికి తనదైన శైలిలో స్పష్టరూపంగా కవిత్వాన్ని వెలార్చిన మహా వైతాళికుడు సిరివెన్నెల సీతారామశాస్త్రి.

సిరివెన్నెల సీతారామశాస్త్రిగా ప్రసిద్ధిచెందిన ఆయన అసలు పేరు చేంబ్రోలు సీతారామశాస్త్రి. 1955 మే 20న అనకాపల్లిలో జన్మించిన వీరు 1986లో "సిరివెన్నెల" చిత్రం ద్వారా సినీరంగంలో అడుగు పెట్టారు. ఆయన తొలి అడుగే ఒక ప్రభంజనాన్ని సృష్టించింది. ఆయన తొలిపాటే ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించింది. ఆ సినిమాపేరే ఆయన ఇంటిపేరుగా మారిపోయింది. అక్కడనుండి 2021 నవంబరు 30 వరకు అప్రతిహతంగా సాగిన ఆయన రచనాపటిమ తెలుగు చలనచిత్రం కాన్వాసుమీద చిత్రించిన దృశ్యకావ్యాలెన్నో! ఎన్నో ప్రబోధాలు.... ఎన్నో ప్రయోగాలు... ఎన్నో అనుభవాలు... ఎన్నో అనుభూతులు... మనిషి జీవితంలో ఉండే దృశ్యాదృశ్య కోణాలన్నిటినీ స్పృశించి సినిమా పాటల ప్రపంచానికి కొత్త మెరుగుల్ని, మెరుపుల్ని చూపించారాయన. **సుమారు 800 చిత్రాలకు మూడువేలకు పైగా పాటలు రచించి చరిత్ర చూపును తనవైపు తిప్పుకున్నారు. ఈ మూడున్నర దశాబ్దాల ప్రస్థానంలో 11 నంది పురస్కారాలు, 4 దక్షిణాది ఫిలింఫేర్ పురస్కారాలు, 4 కళాసాగర్ పురస్కారాలు, 4 మనస్వినీ పురస్కారాలతో పాటు కిన్నెర, భరతముని,**

**రసమయి, సైమా, సంతోషం, వంశీ బర్కిలీ వంటి ఎన్నో అవార్డులను అందుకున్న ఆయన 2019లో భారతప్రభుత్వం నుండి "పద్మశ్రీ" పురస్కారాన్ని తన చరిత్రకు కిరీటంగా అలంకరించారు.**

సీతారామశాస్త్రిగారు సినీరంగ ప్రవేశం చేసే సమయానికి కొత్త గేయ రచయితలకు ప్లేస్ ఖాళీ లేదు. వేటూరిలాంటి కవులు టాప్ పొజీషన్‌లో దూసుకెళ్తున్నారు. అప్పుడు ప్రవేశించిన సీతారామశాస్త్రి తన స్థానాన్ని తానే సృష్టించుకొని దాన్ని సింహాసనంలాగా మలచుకొని తలెత్తి నిలబడ్డారు. ప్రముఖ దర్శకులు, రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సభలో సీతారామశాస్త్రి గురించి మాట్లాడుతూ... ఒక పాట విశ్లేషణలో **"...అక్కడ స్పేస్ లేదు కానీ స్పేస్ క్రియేట్ చేసి తీసుకున్నారు"** అన్నారు. అలాగే చిత్రరంగంలో కూడా తన ప్లేస్‌ను ఆయనే క్రియేట్ చేసుకొని దానిని బహుముఖీనంగా విస్తరింపచేసి విశ్వరూప ప్రదర్శన చేసారు సీతారామశాస్త్రి.

సీతారామశాస్త్రి గారి సినీగేయ ప్రస్థానాన్ని ఒక వ్యాసంలోనో, ఉపన్యాసంలోనో వివరించాలనుకోవడం అగ్గిపెట్టెలో ఆకాశాన్ని ఇమిడ్చి ఉంచాలనుకోవడమే... కాకపోతే కొన్ని విషయాలనైనా నెమరువేసుకోవటం ద్వారా ఆ మహాకవి తత్వాన్ని, కవిత్వాన్ని ఆస్వాదించడానికి ఒక మార్గం అవుతుంది కాబట్టి అద్దంలో ఆకాశాన్ని దర్శించే ప్రయత్నం చేసుకుందాం.

సీతారామశాస్త్రి సినిమా పాటల్లో జీవితమంత వైశాల్యం ఉంది. ఆధ్యాత్మికత, జాతీయత, తాత్త్వికత, భావుకత - అనే నాలుగు కాళ్ళమీద ఆయన కవితా ధర్మం చాలా పటిష్టంగా సాగింది. ఈ సంస్కారం ఆయనలో కలగడానికి ఆయన కుటుంబ నేపథ్యం ప్రధాన కారణం కాగా, ఆయన కలిసిన వ్యక్తుల ప్రభావం, కవిగా ఆయన నిలదొక్కుకోవలసిన అవసరం ఇతర హేతువులుగా కనిపిస్తున్నాయి. సీతారామశాస్త్రి తండ్రిగారు విద్వన్మణులు. పలు భాషల్లో నిష్ణాతులు కావడమే కాదు, వేద వేదాంగోపనిషత్తులలో అపార జ్ఞానం కలిగినవారు. హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తూనే సంస్కృతాంధ్ర భాషలలో ఎంతో పట్టు సాధించిన వారి సాహిత్య సంస్కారం సీతారామశాస్త్రిగారి మీద చాలా ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా తండ్రిగారి వద్దనుండి జీవిత విలువలు, కుటుంబ వ్యవస్థలోని ఔన్నత్యం, స్త్రీ సమారాధన, సమాజం పట్ల వ్యక్తికి ఉండవలసిన బాధ్యత వంటివెన్నో సీతారామశాస్త్రిగారు ఇంట్లో జరిగే చర్చల ద్వారా పొందినట్లు తెలుస్తుంది. ఈ సంస్కారమే ఆయన పాటల్లో చాలావరకు పదును తేలి, బహిర్గతమయింది.

ఇక ఆధ్యాత్మికంగా తండ్రిగారివద్ద బీజావాపం జరిగినా అది ఫలవంతమైన వృక్షంగా విస్తరించడానికి ప్రధాన కారణం సద్గురు శివానందమూర్తిగారి వద్ద సాగించిన అంతేవాసిత్వం... శివానందమూర్తిగారి బోధలు, భావాలు, చూపించిన మార్గం - అన్నీ కూడా సీతారామశాస్త్రిగారి జీవనపు అంచులను తడిమి వారి తాత్త్విక దృష్టికి పవిత్రమైన భావాలంబన మేళవించేలా చేసింది. ఈ లక్షణమే సీతారామశాస్త్రి పాటలన్నిటిలోనూ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, ప్రబోధకంగానూ కనిపిస్తుంది. తాను రాసే పాటల్లో ఎక్కడా అశ్లీలతకు తావు ఇవ్వనని శపథం చేసి, చివరి వరకు ఆ మాటకు కట్టుబడి రచనలు చేయడం వెనుక తండ్రి, గురువుల నుండి సంక్రమించిన స్వచ్ఛమైన సంస్కారమే ప్రబల ప్రభావంగా నిలిచింది.

సీతారామశాస్త్రిగారిలో జాతీయభావాలు చాలా ఎక్కువ. దానికి మరో ప్రబల కారణం వారిలో ఉన్న ఆర్.ఎస్.ఎస్. భావజాలం. సంఘ కార్యకలాపాలలోనూ, సంఘ కార్యకర్తగానూ శాస్త్రిగారు తమను ఒక క్రమశిక్షణను, జాతీయవాదిగాను తీర్చిదిద్దుకున్నారు. అయితే సినిమాపాటల విషయానికి వస్తే ఈ జాతీయభావాలకు దేశభక్తి ప్రధానంగా కాక సమాజ సంస్కరణ మూలంగా వీరి రచన సాగింది. సమాజోద్ధరణే జాతి ఔన్నత్యానికి మూలం అన్నట్లుగా వీరు రచనలు చేసినట్లు కనిపిస్తుంది. అలాగని సీతారామశాస్త్రిగారు దేశభక్తి గేయాలు రాయలేదని కాదు.

**"మేరా భారత్ కో సలామ్ - ప్యారా భారత్ కో ప్రణామ్**
**పుట్టిన భూమిని ఆరాధించగ పుట్టిన నెత్తుటి పువ్వులం"**
**(భారతరత్న)**

వంటి పాటల్లో దేశభక్తిభావం చాలా స్పష్టంగానే ప్రకటితమైనది.

**"శాంతికి వస్తే స్వాగతమిస్తాం - సవాలు చేస్తే శవాలు చేస్తాం**
**స్నేహానికి మా చెయ్యందిస్తాం - ద్రోహం చేస్తే దహించివేస్తాం**

..............................................................

**పచ్చని స్వేచ్ఛను రక్షించేందుకు - మా పంచప్రాణాల కంచెలు వేస్తాం"** అనడంలో భారతజాతిని నిరంతరం ఎల్లలు కాసే 'శిరస్సు వంచని సంకల్పంలో హిమాలయం' వంటి మన భారత సైన్యం ఘనతను వివరించడంలో శాస్త్రిగారి దేశభక్తి స్పష్టమే. అయితే ఈ రూపకంగా కాక సమాజోద్ధరణవైపే ఆయన కలం ఎక్కువగా మొగ్గు చూపిందనడం తప్పు కాదు. ఉత్తమమైన సమాజమే జాతి ఉన్నతికి కేంద్రమనే నమ్మకం వీరి రచనల్లో కనిపించే సూత్రం.

భావుకత విషయంలో తనదంటూ ఒక ప్రత్యేక పంథాను, స్పందనను ఆలంబనగా చేసుకొని చిత్రగీతాలకు కొత్త ఒరవడిని, సరికొత్త రుచిని చూపించి తన స్థానాన్ని పదిలంగా చేసుకొని పదికాలాలకు పది తరాలవారికి ఫలితాన్ని అందించిన భావుకుడు ఆయన. భావ ప్రకటనలో ఆయన ఎన్నుకునే మార్గం అనితర సాధ్యమేమో అన్నట్టుంటుంది. అటువంటి మార్గంలో సాగడానికి ఆయన కాలంతో అడుగులు వేస్తూ, కాలానికి అనుగుణంగా తనను మలచుకొంటూ తనదైన మూల ప్రవృత్తికి, ఆశయాలకు, నిబద్ధతకు


ఎటువంటి విఘాతం కలగకుండా ముందుకు సాగారు. శబ్దంతో మనిషిని, భావంతో మనసు తట్టి లేపి ముందుకు నడిపే వైతాళికత్వం శాస్త్రిగారి పాటల్లో అడుగడుగున కనిపిస్తుంది. వాటిల్లో కొన్ని అంశాలను రేఖామాత్రంగా స్పృశించుకొందాం.

సీతారామశాస్త్రిగారి కవిత్వానికి మనిషి కేంద్ర బిందువు. మానవత్వం హృదయం, ఆశావాదం ఆయువు. అటువంటి మనిషి కోసం నిత్యచైతన్యశీలిగా ఆయన కలం కదనుతొక్కింది. మనిషి స్వేచ్ఛగా, సంతోషంగా ఉండాలంటే సమాజం విలువలతో నడవాలి. అలాంటి విలువలు కొరవడినప్పుడు కళాకారులు తమదైన మార్గంలో పరిరక్షకులుగా మారాలి. ఆ బాధ్యతను స్పష్టంగా గుర్తెరిగి తన బాధ్యతగా ముందుకు నడిచారు సీతారామశాస్త్రి. సినిమా పాటల ద్వారా ఆ క్రమంలో వారు రాసిన పాటల్లో సమాజంలోని కుళ్ళును కడిగేయాలన్న తపన చాలా ఎక్కువగా కనిపిస్తుంది.

**"నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని**
**అగ్గితోటి కడుగు సమాజ జీవచ్ఛవాన్ని**
**మారదు లోకం... మారదు కాలం**
**దేవుడె దిగిరానీ ఎవ్వరు ఏమైపోనీ.... " (గాయం)**

అన్న పాట వెనక ఈ తపనే కనిపిస్తుంది. మొదటి రెండుపంక్తుల్లో ఒక ఆవేశం, కోపం స్పష్టం కాగా, తర్వాత పంక్తుల్లో ఆవేదన ప్రకటితమైంది. 'ఎవ్వరొచ్చినా ఈ లోకం మారదు' అన్నదాన్ని కొందరు నిరాశావాదంగా భావించవచ్చు. కాని అది సరికాదు. శాస్త్రిగారు నిరాశను దగ్గరికి రానీయరు. ఈ వాక్యాలు ఒక అంతర్మథనాన్ని వివరించడమే కాక సమాజాన్ని మార్చడానికి ఎన్నుకొన్న మార్గంగా చెప్పుకోవచ్చు. మనిషిని దెప్పి పొడిస్తే ఉక్రోషం కలిగి మారే అవకాశం ఉంటుంది. ఆ సూత్రాన్నే ఇక్కడ కవి వినియోగించుకొన్నాడు.

మనిషిలో మహనీయత్వాన్ని అన్వేషించే సత్యాన్వేషి, నిత్యాన్వేషి అయిన శాస్త్రిగారు ఆ నిరూపణ కోసం ఎన్నో మార్గాల్లో రచనలు సాగించారు. **'నేను ఒక అన్వేషిని. కాని ప్రపంచానికి దూరంగా ఉండను. ప్రపంచంతో ఉంటూనే అన్వేషణ సాగిస్తా'** అని వారు చెప్పిన మాటలను అర్థం చేసుకొంటే సమాజం పట్ల వారు చేసిన రచనల అంతరార్థం పరమార్థం స్పష్టమవుతాయి. సమాజాన్ని సక్రమమార్గం లోకి మార్చడానికి వ్యక్తి చేసే ప్రయత్నంలో ఒక్కొక్కప్పుడు కొంత కాఠిన్యాన్ని అవలంబించాల్సి వస్తుంది. అంతమాత్రాన అది అమానవీయం కాదు. శస్త్రచికిత్స చేసి రోగాన్ని నయం చేయాలను కొన్నప్పుడు రక్తం చిందించడం తప్పుకాదు. అటువంటి శస్త్రచికిత్సకుడుగా పలుచోట్ల తన అక్షరాలు, భావాల శస్త్రాలతో విరుచుకుపడి నిలదీశారు శాస్త్రిగారు.




**"అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్నే స్వతంత్రమందామా...!?**
**స్వర్ణోత్సవాలు చేద్దామా**
**ఆత్మవినాశపు అరాచకాన్నే స్వరాజ్యమందామా**
**దానికే సలాము చేద్దామా? (సింధూరం)**

అంటూ సాగిన పాటలు శాస్త్రిగారి అంతర్మథనంతో పాటు 'లావా'లా ఉప్పొంగిన ఆవేశం స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులోని ప్రశ్నలన్నిటికీ ప్రతి ఒక్కరు సమాధానం చెప్పాల్సిన బాధ్యతను గుర్తు చేయడమే కాదు. ప్రజలందరూ కూడా జవాబుదారీ కావాల్సిన అవసరాన్ని వేలెత్తి చూపించారు శాస్త్రిగారు.

**"శాంతి కపోతపు కుత్తుక తెంచి తెచ్చిన బహుమానం**
**ఈ రక్తపు సిందూరం**
**ఎవరికోసం ఎవరు ఎవరితో సాగించే సమరం**
**ఈ చిచ్చుల సిందూరం**
**జవాబు చెప్పే బాధ్యత మరిచిన జనాల భారతమా!**
**ఓ అనాథ భారతమా..."**

అనే పంక్తుల్లో ప్రతి పౌరుడి నిర్ణిద్ర స్థితిని, నిరాసక్తతను, నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని ఛేదించే బాణాలు సంధించడమే కాక

**"కృష్ణుడు లేని కురుక్షేత్రమున జరిగే ఈ ఘోరం**
**చితిమంటల సిందూరం**
**చూస్తూ ఇంకా నిదురిస్తావా విశాల భారతమా!**
**ఓ విషాద భారతమా!"**

అని కర్తవ్యాన్ని ఉద్బోధించాడు కవి. ఈ ప్రశ్నలకు సమాధానాలను తన మార్గంలో అన్వేషిస్తూనే అందరినీ జాగృతం చేయడం కవిలో కనిపించే తపనకు నిదర్శనం.

ప్రస్తుత భారతం ఒక వంచన మార్గంలో వక్రమార్గంలో నడుస్తూ, జాతి ధర్మానికి, దేశ ఔన్నత్యానికి మచ్చ తెచ్చేవిధంగా కనిపిస్తోంది చట్టం, ధర్మం, న్యాయం అనేవాటికి కొన్ని లొసుగుల ఆధారంగా తమదైన భాష్యాలను చెప్పుకోని, అధికారంతో, అవినీతి అక్రమాలతో

సాగుతున్న నేటి వ్యవస్థను చూసి సీతారామశాస్త్రిగారు చలించి పోయారు. ఆ స్పందనకు తగిన సన్నివేశం దొరికిన క్షణమే ఆలస్యం చెయ్యకుండా వెరపు లేకుండా తమ భావాలతో ప్రబోధించారు.

**"కొంతమంది సొంతపేరు కాదుర గాంధీ**
**ఊరికొక్క వీధి పేరు కాదుర గాంధీ**
**కరెన్సీ నోటు మీద ఇలా నడిరోడ్డు మీద**
**మనం చూస్తున్న బొమ్మ కాదుర గాంధీ...." (మహాత్మా)**

అంటూ సాగిన పాట దీనికి ఉదాహరణ. చాలామంది ఇందులో గాంధీ గొప్పదనాన్ని కవి ప్రటించినట్లుగా భావించడం కనిపిస్తోంది. అది సరి కాదు. గాంధీ గొప్పవాడు అని చెప్పడానికి సీతారామ శాస్త్రిగారు అవసరం లేదు. అలా చేస్తే ఆయన సీతారామశాస్త్రిగారు కాదు. గాంధీ గురించి చెప్పినట్లుగా కనిపించినా, ధ్వనిపూర్వకంగా ఈ సమాజంలో తలెత్తుతున్న అవినీతి వికృతపు పోకడలు. జాతి విలువలకు 'అహింసా పరమో ధర్మ:' అనే సూక్తికి తూట్లు పొడిచేవారిపై ప్రకటించిన ధర్మాగ్రహం ఇందులోని సారాంశం. 'కావ్యస్యాత్మా ధ్వని:' అన్న మాటకు ఈ పాట అద్భుత సాక్ష్యం.

అదేమార్గంలో –

**"సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని**
**సుఖాన మనలేని వికాసమెందుకని**
**సుమాల బలికోరే సమాజమెందుకని**
**అడుగుతోంది అదిగో ఎగిరే భరత పతాకం**
**తెలుసుకోండి ఆ తల్లి తపనలో నేటి కన్నీటి కథనం"(గాయం)**

అంటూ రాసిన పాటలో శాస్త్రిగారు మన సమాజంపైకి పేల్చిన ప్రశ్నలకు స్వతంత్ర భారతం ఒక రూపంగా నిలిచింది. ఏ ఉద్దేశంతో, ఆశయంతో ఎందరో త్యాగధనుల ప్రాణాల బలిదానం నుండి సాధించుకొన్న స్వాతంత్ర్యానికి అర్థం మారిపోయిన పరిస్థితిని ఈ పాట నిలదీస్తోంది.

**"త్రిశంకు స్వర్గంలో తను త్రివర్ణ స్వప్నమని**
**విషాద వర్షంలో తను వివర్ణచిత్రమని**
**.......................................**
**వెలవెలబోయిన మువ్వన్నెల జెండా**
**తెగి పడిపోయిన ఆశల పువ్వుల దండ"** వంటి వాక్యాలు మన వర్తమాన సమాజస్థితిని అవాంఛనీయ విధానాలను వివరిస్తుంటే–

**"దేశమంటే మట్టి కాదన మాట మరిచెను నేటి విలయం**
**అమ్మ భారతి బలిని కోరిన రాచకురుపీ రాజకీయం"** అన్న వాక్యాలు నేటి సమాజస్థితికి రాజకీయవ్యవస్థ ఎలా కారణం అవుతుందో కవి ప్రకటించి పరోక్షంగా మన కర్తవ్యం ఏంటో గుర్తు చేశారీ పాటలో.

సీతారామశాస్త్రి పాటలు ఒక మంచి టానిక్కు లాంటివి. నిరాశలో ఉన్నవాడికి 'ఆశ'ను, నిర్లిప్తతో ఊపిరి తీసుకొనేవారికి జీవన మాధుర్యాన్ని, ఉత్సాహాన్ని అందించే 'ఆక్సిజన్'లాంటి భావాలను ప్రకటించడంలో సీతారామశాస్త్రి అందెవేసిన కలం.

**ఎప్పుడూ ఒప్పుకోద్దురా ఓటమి**
**ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి**
**విశ్రమించవద్దు ఏ క్షణం – విస్మరించవద్దు నిర్ణయం**
**అప్పుడే నీ జయం నిశ్చయం" (పట్టుదల)** అన్న ఒక్క పాట చాలు... జీవితానికి స్ఫూర్తి. జీవించడానికే ప్రేరణ ఈ పాట ద్వారా సమాజానికి అందించారు శాస్త్రిగారు.

**నొప్పిలేని నిమిషమేది జననమైన మరణమైన**
**జీవితాన అడుగు అడగునా**
**నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీది కాదు**
**బ్రతుకు అంటే నిత్యఘర్షణ**
**దేహముంది ప్రాణముంది నెత్తురుంది సత్తువుంది**
**ఇంతకన్న సైన్యముందునా**
**ఆశ నీకు అస్త్రమౌను శ్వాస నీకు శస్త్రమౌను**
**దీక్ష కన్న సారధెవరురా**
**నిరంతరం ప్రయత్నమున్నదా నిరాశకే నిరాశ పుట్టదా**
**నిన్ను మించి శక్తి ఏది నీకు నువ్వు బాసటైతే"**

అంటూ రాసిన చరణాలలో ప్రబోధం, ఆత్మస్థైర్యాన్ని నింపి వెన్నుతట్టి నడిపించే గుణం అనన్యసామాన్యమైనది. ఈ పదాల కూర్పులో ఉన్న తూగు మనిషిని, భావప్రకటనలోని తీవ్రత మనసుని తట్టిలేపి జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేట్లుగా చేస్తుంది. ఇందులోని 'బ్రతుకు కంటే నిత్యఘర్షణ' అన్న ఒక్క వాక్యం పాటంతటికీ జీవంలాగా నిలిచింది. జీవితంలో అడుగడుగునా బాధ ఉంటుంది. దాన్ని జయించడమే జీవన పరమార్థమని చెప్పడానికి ఎన్నుకొన్న మార్గం పాటనంతటినీ ఒక కవాతు చేసే సైనికుడిలా తీర్చిదిద్దింది. అది శ్రోతను తనవైపుకు తిప్పుకొనే లక్షణం. ఇక ఇందలి భావప్రకటనలోని తాత్త్వికత 'నిరాశకే నిరాశ పుట్టదా' వంటి భావుకత మనిషి మనసును కదిలించి, మెదడులో ఆలోచనలను రగిలించి ముందుకు నడిపిస్తుంది.

**"నింగి ఎంత గొప్పదైన రివ్వుమన్న గువ్వపిల్ల**
**రెక్కముందు తక్కువేనురా**
**సంద్రమెంత పెద్దదైన ఈదుతున్న చేపపిల్ల**
**మొప్పముందు చిన్నదేనురా...."** అన్న వాక్యాలలోని భావగాఢత అనంతమైన స్ఫూర్తిని, ప్రేరణను కల్గించే అంశాలు. ఇంతటి లోతైన భావాన్ని ప్రకటించడానికి శాస్త్రిగారు ఎన్నుకొన్న పదాలు ఆయన రచనా శైలిలోని పటుత్వానికి నిదర్శనాలు.

సినిమా అంటేనే తొంబైతొమ్మిది శాతం ప్రేమకథాంశాలతో కూడికొని ఉంటుంది. కాబట్టి ప్రేమగీతాలకు సినిమా అన్నది ఒక తరగని భాండాగారమనే చెప్పుకోవాలి. మామూలుగానే ప్రేమ కవిత్వం రాయని కవులు అరుదు. కలం పట్టి తొలినాళ్లలో ప్రతి కవి ప్రేమను కవిత్వీకరించినవాళ్ళే! ఎంతమంది ఎన్నిరకాలుగా ప్రకటించినా, ఎన్ని విధాలుగా వర్ణించినా ప్రేమ ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. కొత్తభావాలను పలికిస్తూనే ఉంటుంది. అయితే ప్రేమలో కలిగే అనుభూతుల్ని ప్రకటించడమే చాలామంది కవులు చేసిన పని. ప్రేమను నిర్వచించడానికి పూనుకున్నవాళ్ళు తక్కువనే చెప్పాలి. ఎందుకంటే నిర్వచనాలకందని అనంతానుభూతి ప్రేమ. దాన్ని నిర్వచించడం సాహసమే! కాని **"సాహసం శ్వాసగా సాగిపో సోదరా..." (ఒక్కడు)** అంటూ సాహసాన్ని నూరిపోసిన సీతారామ శాస్త్రిగారు ప్రేమను నిర్వచించే సాహసం చేశారు.

**"హృదయమనే కోవెల తలుపులు తెరిచే తాళం**
**ప్రేమ... ప్రేమ... ప్రేమ... ప్రేమ...**
**త్యాగమనే దేవత సన్నిధి వెలిగే దీపం**
**ప్రేమ... ప్రేమ... ప్రేమ... ప్రేమ**
**అణువణువును చెలిమికి అంకితమిచ్చును ప్రేమ**
**తను నిలువన కరుగుతు కాంతి పంచునది ప్రేమ**
**గగనానికి నేలకి వంతెన వేసిన వానవిల్లు ఈ ప్రేమ..."**
**(పెళ్ళి సందడి)**

అనే పాటలో ప్రేమతత్వాన్ని చాలా విపులంగా ప్రకటించారు.


**"ఇవ్వడమే నేర్పగల ఈ ప్రేమ**
**తనకొరకు ఏ సిరిని అడగదు కదా**

......................................

**కోరి మురిసేటి గుణమే ప్రేమ"** అంటూ ప్రేమతత్వాన్ని సుస్పష్టం చేశారు. ఇలా ప్రేమను గురించి భావుకంగా చెప్పిన శాస్త్రిగారే మరో పాటలో తాత్విక దృష్టితో ఆవిష్కరించారు.

**"ఆకాశం తాకేలా వడగాలై ఈ నేల అందించే ఆహ్వానం ప్రేమంటే**
**ఆరాటం తీరేలా బదులిచ్చే గగనంలా వినిపించే తడిగానం ప్రేమంటే**
**అణువణువును మీటే మమతల మౌనం పదపదమంటే నిలవదు ప్రాణం**
**ఆ పలుకే ప్రణయానికి శ్రీకారం**
**దాహంలో మునిగిన చిగురుకు చల్లని తనమందించీ**
**స్నేహంతో మొలకెత్తే చినుకే ప్రేమంటే**
**మేఘంలో నిద్దురపోయిన రంగులు అన్నీ రప్పించి**
**మాగాణి ముంగిట పెట్టే ముగ్గే ప్రేమంటే...."**
**(నువ్వొస్తానంటే నేనొద్దంటానా)**

అన్న పాటలో ప్రేమను గురించి అనేక భావాలను ప్రకటిస్తూ ప్రేమతత్వాన్ని ప్రకటించడానికి ప్రయత్నించారు కవి. అయితే



ప్రేమను అనుభవిస్తేనే గాని దాని గొప్పదనం తెలియదు. ప్రేమంటే ఏంటో తెలిసిందని ఎవరైనా వివరిస్తే వారికి ప్రేమ గురించి తెలియలేదనే అర్థం. ప్రేమన్నది మాటల్లో ఒదగని, మనసుల్లో పొదిగిన భావం, అనుభూతి. ఈ విషయాన్నే –

**"ప్రేమంటే ఏమంటే చెప్పేసే మాటంటే**
**ఆ మాటకి తెలిసేనా ప్రేమంటే**
**అది చరితలు సైతం చదవని వైనం**
**కవితలు సైతం పలకని భావం"** అంటూ ఇదే గీతంలో సీతారామశాస్త్రి వివరించారు. ప్రేమ ఒక అనుభూతి. అది అనుభవైకవేద్యమే. జీవితం ఎన్నో అనుభూతులు నదీగమనం. ఎన్నో అలలు, ఎన్నో కలలు, ఎన్నో కలవరింతలు, కల్లోలాలు, వాటిని కవిత్వీకరించాలంటే కవి భావుకతాలక్షణం మేరుసదృశమై ఉండాలి. దానిని ప్రకటించే విధానంలో కవిలో ఒక ప్రత్యేకశైలి ఉండాలి. సినిమా అన్నది జనమాధ్యమానికి చెందినది. ఇక్కడ అక్షరజ్ఞానం లేనివారిని కూడా ఆ భావతరంగం తడిపేయాలి. తడిమేయాలి. అటువంటి లక్ష్యం కోసం సినీకవి ఎన్నుకొనే భాష జనబాహుళ్యానికి దగ్గరగా ఉండాలి. అది వినగానే శ్రోత ఆ పాటను, అందులోని భాష ద్వారా తనదిగా చేసుకోవాలి. అప్పుడే సినిమా అనే ప్రక్రియ ప్రయోజనం సఫలం అవుతుంది. ఈ పరిస్థితుల్లో నిర్వచనాలకు లొంగని ప్రేమను ప్రకటించాలంటే కవికి పెద్ద సవాలే... ఇక సీతారామశాస్త్రి వంటి తనకు తానే కొన్ని నియమ నిబంధనలను కంచెలాగా రాసిన పాటలు వారి భావుకతా సౌందర్యానికి, గాఢతకు, హృదయాలను కదిలించి కట్టి పడేసే గుణానికి నిలువెత్తు దర్పణంగా నిలబడ్డాయి.

**"ఈ వేళలో నీవు ఏం చేస్తూ ఉంటావో**
**అనుకుంటు ఉంటాను ప్రతి నిమిషము నేను**
**నా గుండె ఏనాడో చేజారిపోయింది**
**నీ నీడగా మారి నావైపు రానంది**
**దూరాన ఉంటూనే ఏం మాయ చేశావో" (గులాబి)**

అన్న పాటే దీనికి చక్కని ఉదాహరణ. ప్రేమలో ఉన్నవాళ్ల ధ్యాస నిరంతరం తమ ప్రేమించినవాళ్ళ మీదే ఉంటుంది. ఆ ఒక్క పాయింటుని ప్రతిగుండెకు తగిలేవిధంగా సీతారామశాస్త్రి ప్రకటించిన విధం అద్భుతం. అలాంటి భావాన్నే మరోరకంగా ప్రకటిస్తూ –

**"నువ్వేం మాయ చేశావో గాని**
**ఓ మనసా చెప్పమ్మా నిజాన్ని**
**క్షణం ఆగనంటోంది ఓణీ**
**మరీ చిలిపిదీ వయసుబాణి" (ఒక్కడు)** అంటూ అమ్మాయి మనసులో ఉండే ప్రేమను ఆవిష్కరించిన పద్ధతి ప్రేమలో ఉన్న ప్రతి మనసును తడిమి పులకింపచేస్తుంది. ఈ రెండు పాటల్లోను ఉన్నది ప్రేమ పరవశమే. కాని ప్రకటించిన విధంలో ఎంతో వైవిధ్యాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించడం సీతారామశాస్త్రిగారికే చెల్లింది.

ప్రణయాన్ని ఇంత ఉదాత్తంగా ప్రకటించిన సీతారామశాస్త్రి శృంగారాన్ని రచించిన తావుల్లో ఎంతో చిలిపితనం, గడుసుదనం ప్రదర్శించారు. అయితే ఎక్కడా అసభ్యత, అశ్లీలతలకు తావివ్వకుండా తనదైన స్థాయిని మరింత పదిలం చేసుకొన్నారు.

**"నీతో చెప్పనా నీక్కూడా తెలిసినా**
**నువ్వెంతా రెచ్చిపోతే అంత సరదా తెలుసునా" (అతడు)**

అన్న పాటే దీనికి నిదర్శనం. ఈ పాటలో –

**"ఇంకొంచెం అనుకున్నా ఇక చాల్లే అన్నానా**
**వదలమంటే ఏమిటర్థం వదిలిపొమ్మనా.."** అని నాయిక చేత పలికిస్తారు కవి. ఇందులో రెండోవాక్యంలో కవి ప్రదర్శించిన గడుసుదనం శ్రోతను కట్టిపడేయడమే కాదు పులకింపచేస్తుంది కూడా. అందులోనే –

**"మగువ మనసు తెలిసేనా మగజాతికి...**
**మొగి మొనలు తగిలేనా లేతసోయగానికి కూత దేనికి..."**

అనడంలో శృంగారం పాటు అర్థపరంగా కూడా హద్దు దాకా వెళ్ళి ఆగిపోయింది. ఇలా రాయడం సీతారామశాస్త్రిగారి సంస్కారానికి నిదర్శనం.

ఆధ్యాత్మిక, తాత్త్విక భావాలను ప్రకటించడంలో సీతారామశాస్త్రి గారి కలం ఎంతో నైశిత్యాన్ని ప్రదర్శించింది.

**"ప్రాణం పుట్టుక ప్రాణికి తెలియాలా**
**గానం పుట్టుక గాత్రం చూడాలా" (సిరివెన్నెల)**

అన్న వాక్యాలే దీనికి ఉదాహరణ. అదే సినిమాలోని –

**"విధాత తలపున ప్రభవించినది అనది జీవన వేదం**
**ప్రాణ నాడులకు స్పందన నొసగిన అది ప్రణవనాదం.... ఓం.."**

అన్న పాట సీతారామశాస్త్రిగారి జీవితాన్నేకాదు, సినీ గేయ సాహిత్య జీవితాన్ని కూడా ఒక మలుపు తిప్పిందనడం తప్పుకాదు. త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పినట్లు **"... ఈ పాట ప్రేక్షకుడి స్థాయిని పెంచింది..."** అన్న మాట కాదనలేని వాస్తవం. సినిమా ఒక వ్యాపారాత్మకమైన కళ. వ్యాపారంలో లాభదృష్టి ఉంటుంది. ఆ క్రమంలో కష్టమర్లకు అనుగుణంగా వ్యాపారవేత్తలు మారాల్సి ఉంటుంది. సినిమా పాటల విషయంలో కూడా చాలామంది కవులు, ప్రజలు ప్రేక్షకుల కోసం తమస్థాయిని దిగి జనాల స్థాయిలో నిలబడ్డారు. కాని సీతారామశాస్త్రిగారు తన స్థాయిని ఒక్క అంగుళం కూడా దిగకుండా ప్రేక్షకులను తన దగ్గరికి చేరేట్లుగా చేశారు. అది కూడా ఈ పాటతోనే అనేది గొప్ప విషయం. ఈ పాటలోని అణువణువు ఉదాత్త తాత్త్విక, ఆధ్యాత్మిక విషయాలను ప్రకటించి ప్రేక్షకుడి ఆలోచనలో ఉజ్జ్వలమైన కదలికను తెచ్చిందనడం అతిశయోక్తి కాదు.

**"ప్రాగ్దిశవీణియపైన దినకర మయూఖ తంత్రులపైన**
**జాగృత విహంగ తతులే వినీల గగనపు వేదికపైన**
**పలికిన కిలకిల స్వనముల స్వరగతి జగతికి శ్రీకారము కాగా**
**విశ్వకావ్యమునకిది భాష్యముగా...."** అన్న వాక్యాల్లో ఒక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించిన విధమే సీతారామశాస్త్రిగారిని ఉన్నత శిఖరాలను చేర్చింది. కళ్ళతో చూసే ప్రపంచం ప్రతి వ్యక్తికి వేరు వేరుగానే ఉంటుంది. కాని కళ్ళు మూసుకొని నీలోనే ప్రపంచాన్ని దర్శించే స్థాయికి ఎదిగినప్పుడు విశ్వమంతా ఒకటిగానే భాసిస్తుంది. రాష్ట్రాలు, దేశాలు, ఖండాలు అన్న భేదం ఉండదు. **"అనాదిరాగం ఆది తాళమున అనంత జీవన వాహినిగా... సాగిన సృష్టి విలాసమే..."** ఆత్మ గోచరమౌతుంది. ఉపనిషత్తులలోని సారాన్ని అత్యంత రమ్యమైన పదప్రయోగంతో భావాలతో ప్రకటించిన ఋషితుల్యుడు సీతారామశాస్త్రి.

**"తెలిమంచు తొలిగింది తలుపు తీయనా ప్రభూ!**
**ఇల గొంతు వణికింది పిలుపు నీయనా ప్రభూ!**
**నీ దోవ పొదవునా కువకువల స్వాగతం**
**నీ కాలి అలికిడికి మెలకువల వందనం" (స్వాతి కిరణం)**
అంటూ మేలుకొలుపు గీతం రాసినా

**"జాబిలమ్మ... జాబిలమ్మ... జోల పాడనా ఇలా!**
**జోరు గాలిలో జాజికొమ్మ... జారనీయకే కల...**
**వయారి వాలుకళ్ళలోన వరాల వెండి పూల వాన**
**స్వరాల ఊయలూగువేళ.... " (క్షణ క్షణం)**

అంటూ జోలపాట పాడినా సీతారామశాస్త్రి భావుకత ప్రతి హృదయాన్ని రసప్లావితం చేస్తుంది. రెండింటిలోను అలతి అలతి పదాలే... కాని భావం మాత్రం అనంతమైన సాగర తరగల్లా గుండెల్లో

ఓలలాడుతూనే ఉంటుంది. "ప్రాగ్దిశ వీణియపైన...." వంటి పాటల్లోని శబ్ద గాంభీర్యం ఎంతటి ప్రయోజనాన్ని సాధించిందో, ఇలాంటి అలతి పద ప్రయోగం కూడా అంతే స్థాయిని అందుకొంది. భావుకుడైన కవి భాషా ప్రాధాన్యం కన్న భావ ప్రకటనమే ప్రధానమౌతుంది. భాష ఒక వాహిక మాత్రమే.

**"తెలవారదేమో స్వామి... నీ తలపుల మునకలో**
**అలసిన దేవేరి... అలమేలు మంగకు....." (శ్రుతిలయలు)**

అన్న పాటలో శాస్త్రి శైలి అన్నమయ్యను ఆవాహన చేసిందని విమర్శకుల ప్రశంస. అన్నమయ్య కీర్తనలా తలపించే ఈ పాటలో శాస్త్రిగారు చూపిన రచనా విన్యాసం కలల అలజడికి నిద్దుర కరువై అలసిన దేవేరి.. అంటూ ప్రకటించిన భావ విలాసం కళ్ళు మూసుకొని విన్నవారికి అత్యంత సౌందర్య రసాధిదేవతా సాక్షాత్కారం లభించి ఒళ్ళు పులకరిస్తుందని చెప్పడం అతిశయం కాదు.

**"ఏ శ్వాసలో చేరితే గాలి గాంధర్వమౌతున్నదో**
**ఏ మోవిపై వాలితే మౌనమే మంత్రమౌతున్నదో" (నేనున్నాను)**

అన్న గీతం ఇటు సన్నివేశ పరంగా నాయకా నాయకుల నుద్దేశించినట్లు ఉన్నా, దాని వెనుక ఉన్నతమైన భావం రసాత్మకంగా ఆధ్యాత్మిక భక్తిభావాన్ని విరియజేస్తోంది. ఇలాంటి రచన చేయడంలో శాస్త్రిగారు దిట్ట అన్నది నిర్వివాదాంశం. ఇంతటి ఉదాత్త భావ గీతాలను ప్రకటించిన సీతారామశాస్త్రిగారు చమత్కారాన్ని ప్రదర్శించడంలోను ఏమాత్రం వెనకపడిపోలేదు.

**"బాటనీ పాఠముంది మ్యాటనీ ఆట ఉంది**
**దేనికొ ఓటు చెప్పరా**
**హిస్టరీ లెక్చరుంది మిస్టరీ పిక్చరుంది**
**సోదరా ఏది బెస్టురా..."** అన్న పాటే ఒక మంచి సాక్ష్యం. వర్తమానంలో కాలేజీ స్టూడెంట్సు ప్రవర్తన గురించి చాలా హ్యూమరస్‌గా రాసిన ఈ పాటలోని పదాలు మామూలుగా అందరు మాట్లాడుకొనేవే! అయితే శాస్త్రిగారు ఏ పాట రాసినా ఏదో చమక్కు తళుక్కుమనక మానదు. ఈ పాటలో కూడా **"లెక్కలు ఎక్కాలు తెల్వనోళ్ళు లక్కుతోటి లచ్చలల్ల మున్గిపోతరు, పుస్తకాల్తో కుస్తీలు పట్టెటోళ్ళు సర్కారీ క్లర్కులై మునిగిపోతరు..."** అనటం ఇటువంటిదే. ఇది కేవలం చమత్కారమే కాదు. వర్తమాన పరిస్థితి, మన విద్యావిధానంపై పరోక్షంగా సంధించిన విసురు కూడా. మన విద్యావిధానంలోని లోపాలను ఎత్తి చూపుతూ శాస్త్రిగారు రాసిన మనసిచ్చి చూడు చిత్రంలోని పాట ఎంతో అర్థవంతమైనది.

**"బోడి చదువులు వేస్టు! నీ బుర్రంతా భోంచేస్తూ**
**ఆడిచూడు క్రికెట్టు! టెండూల్కర్ అయ్యేటట్టు"**(మనసిచ్చి చూడు)

అన్న పాటలో –



**"చిరపుంజిలోన చినుకెంతైనా తడుస్తుందా నీ జుట్టు**
**థార్ ఎడారి గోలెందుకురా గోదారి ఒడ్డునుంటూ**
**వీరప్పన్ కొట్టేసుంటాడు అశోకుడెపుడో నాటిన చెట్లు**
**పాత డేట్లు బట్టీ వేస్తూ అసలేంటీ కుస్తీపట్లు"** అంటూ వేలం వెర్రిగా మారిన మన చదువుల వల్ల ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మన్యూనతతో బాధపడే విద్యార్థుల జీవితాల గురించి వ్యంగ్యంగా ప్రకటించారు శాస్త్రి. **"ఆదేపాడే ఈడును దానికి పెట్టకు తాకట్టు"** అన్న మాట ఈ పాట ద్వారా కవి ఇస్తున్న సందేశం. అలాగని చదువులు వేస్టని కవి చెప్పట్లేదు. ఆ విషయాన్నే **"చదువూ సంధ్యా వదిలిపెట్టి సన్యాసివి కమ్మంటూ – సలహా ఇస్తున్నానంటే అది రాంగు రూటు – బతుకు బాటలో ముందుకు నడపని బరువు మోయవద్దు"** అని విద్యయొక్క కర్తవ్యాన్ని మనకు గుర్తుచేయడం కవిగా తన బాధ్యతగా చెప్పకనే చెప్పారు శాస్త్రిగారు.

సాహిత్యానికి అలంకారాలు ఒక అందాన్ని మాత్రమే కాదు, భావానికి పరిమళానికి హృదయానికి పరవశాన్ని కలిగిస్తాయి.

**"ఆది భిక్షువు వాడినేది కోరేది**
**బూడిదిచ్చేవాడినేది అడిగేది..." (సిరివెన్నెల)** అన్న పాటలో వ్యాజస్తుతి అలంకారం మనసును ఆకట్టుకొంటే –

**అనగనగా ఆకాశం ఉంది**
**ఆకాశంలో మేఘం ఉంది**
**మేఘం వెనుక రాగం ఉంది**
**రాగం నింగిని కరిగించింది...." (నువ్వే కావాలి)** అన్న గీతంలో ముక్తపదగ్రస్తం మనిషిని ఆకర్షిస్తుంది. రెండూ కూడా చివరికి

ప్రేక్షకుడి అంతరాంతరాలలో ఆనందామృతాన్ని ఉప్పొంగేట్లు చేస్తాయి. ఇలాంటి రచన చేయడానికి సినిమా పరిశ్రమలో ఒక దమ్ము కావాలి. అందర్నీ ఒప్పించే మెలకువ ఉండాలి. అటువంటి దమ్ము, నేర్పు, సాహసం ఉన్న కవి కనుకనే సీతారామశాస్త్రి ఈ రచనల ద్వారా ఇటు ప్రేక్షకుల్ని సంతోషంలోనూ, అటు నిర్మాతలను సంపదలోనూ ముంచెత్తారు.

సీతారామశాస్త్రిగారి శైలి ఒక విలక్షణమైనది. ఆ విలక్షణతే ఆయనను సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు అత్యంత ఆప్తునిగా నిలిపింది. అందులోను సంవాదాత్మక సన్నివేశాలకు ఆయన రాసిన పాటలు అటుపాత్రల పరంగాను, ఇటు కథాపరంగాను, మరొకవైపు ప్రేక్షకునికి అర్థమయ్యే విషయంలో ఎక్కడా అంగుళమాత్రం కూడా బెణకకుండా, తొణకకుండా రసస్థాయిని చేరుకోడం ఒక అద్భుత విషయమే.

**"శివపూజకు చివురించిన సిరి సిరి మువ్వా**
**మృదుమంజుల పదమంజరి పూచిన పువ్వా..." (స్వర్ణకమలం)**

అంటూ నాయకుడు ప్రకటించిన కళాత్మక భావానికి

**"పరుగాపక పయనించవె వలపుల నావ**
**కెరటాలకు తలవంచితె తొలగదు త్రోవ"** అని నాయిక ఇంచ్చిన కౌంటర్‌లను విశ్లేషిస్తే పాత్ర మనస్తత్వాలను, అభిప్రాయాలను, ఆదర్శాలను పాటద్వారా వివరించిన తీరు ఆశ్చర్యానికి గురి చెయ్యడమే కాదు ఆనందంతో పరవశింపచేస్తుంది. అదే రీతిలో

**"ఘల్లు ఘల్లు ఘల్లుమంటు మెరుపల్లే తుళ్ళు**
**జల్లు జల్లు జల్లున ఉప్పొంగు నింగి ఒళ్ళు" (స్వర్ణకమలం)**

అన్న పాట కూడ సాగింది. వీటిలో 'శివపూజకు' అన్న పాట సీతారామశాస్త్రిగారి కెరీర్‌లోనే ఎక్కువ తపన పడిన పాట. ఎక్కువ మసయం తీసుకొన్న పాటగా వారే చెప్పారు.

సీతారామశాస్త్రి ఒక అక్షర శిల్పి. అక్షరాలకు, పదాలకు ఆయన అద్దే చెమక్కులు, దిద్దే తళుక్కులు భావాన్ని చిక్కబడేట్లు చేయడమే కాదు, కథకు, పాత్రకు కూడా ఒక మెరుపును అందిస్తాయి. ఆ భావాన్ని ఆ పదాల ద్వారా అర్థం చేసుకొన్నప్పుడు పదాలకు అద్దిన తళుకులు ప్రేక్షకుల పెదాలపై ఆనందపు చిరునవ్వుగా విరబూయడమే కాదు, మనసును ఏవో లోకాలకు తీసికెళ్ళి 'ఆహా' అనిపిస్తాయి.

**"తూనీగ తూనీగ ఎందాక పరిగెడతావే రావే నావంక**
**దూరంగా పోనీక ఉంటాగా నీ వెనకాలే రానీ సాయంగా..."**
**(మనసంతా నువ్వే)** అన్న పాటలో ఇటువంటి అక్షర శిల్పాన్ని చూడవచ్చు. పల్లవిలోని రెండో వాక్యంలో 'ఉంటాగా' అన్న పదంలోని 'గా' అన్న అక్షర ప్రయోగం కవి శ్రద్ధను చాలా స్పష్టంగా వివరిస్తోంది. దూరంగా పోనీక 'ఉంటావే' అనుకుండా 'ఉంటాగా' అనడంలో ఒక భరోసా ఉంది. ఒక ధైర్యం చెప్పే గుణం కనిపిస్తోంది. సినిమా లోని కథకు ఈ భరోసా ఎంతో ఆలంబన అవుతుంది. సీతారామశాస్త్రి గారు పాట రాయాలంటే సినిమా కథను ఆసాంతం తెలుసుకొంటారట. కాబట్టే ఇటువంటి పాటల్లోని ఈ ప్రయోగాలు సినిమాకు ఆయువుపట్టుగా మారతాయి. అలాగే 'జల్సా' అనే సినిమాలోని 'కరో కరో జర జల్సా' అన్న పాటలో 'హ్యూమన్ సునామీ' అన్న పదప్రయోగం చేశారు శాస్త్రిగారు. ఈ పదం ద్వారా ఆ పాత్రలోని నాయకుడి పాత్ర మనస్తత్వం మొత్తం ఆవిష్కృతమైంది.

సీతారామశాస్త్రిగారిలో సంస్కృతీ సంప్రదాయల పట్ల ప్రేమ, స్త్రీ సమారాధనలో అఖండమైన గౌరవం ఆయన సంస్కారాన్ని మరింత ఉజ్జ్వలంగా కనిపిస్తాయి.

**"అపురూపమైనదమ్మ ఆడజన్మ**
**ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మ**
**మగవాని బ్రతుకులో సగపాలు తనదిగా**
**జీవితం అంకితం చేయగా...." (పవిత్రబంధం)** అన్న గీతం శాస్త్రిగారి స్త్రీ సమారాధనకు, వారి సంస్కారానికి నిలువెత్తు సంతకం. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచ నాగరికతకే ఒక దిక్సూచి. అది ఒక ఉదాత్తమైన ప్రగతి. అటువంటి కుటుంబానికి మూలబిందువు, ఆ చక్రానికి ఇరుసు ఇల్లాలు. అటువంటి ఇల్లాలి ఔన్నత్యాన్ని ఈ పాట వివరిస్తోంది. **"సహధర్మచారిణి సరిలేని వరమని సత్యాన్ని కనలేనివాడు, మోడుగా మిగలడా పురుషుడు"** అంటూ రాసిన ఈ పాటలోని చివరి రెండు పంక్తులు చాలు, ఇల్లాలి ప్రాశస్త్యాన్ని చెప్పడానికి. ఇంతటి విలువైన భావాలు రావాలంటే ఆ సంస్కారం అంతరాంతరాలలో ఉండాలి. అవి సీతారామశాస్త్రిగారికి జన్మత: కుటుంబం ద్వారా సంక్రమించిన ఆస్తి.

సీతారామశాస్త్రిగారి తాత్త్విక చింతనకు, భావగాధతకు ఆత్మ కదలికకు రూపమా అన్నట్లుగా చెప్పబడే పాట –

**"జగమంత కుటుంం నాది ఏకాకి జీవితం నాది**
**సంసార సాగరం నాది సన్యాసం శూన్యం నాదే..." (చక్రం)**

అన్నది భారతీయ మహత్తర వేదాంతసారం మొత్తాన్ని ఈ రెండు వాక్యాలలోనే జొప్పించి అందించిన మహాఋషి సీతారామశాస్త్రి. భగవద్గీతా తత్త్వం అంతా ఇందులో ఒదిగి ఉంది.

**ఇలా ఎన్నని చెప్పాలి. ఎంతని చెప్పాలి. రాసిన ప్రతి పాట ఒక ఆణిముత్యమే. మల్లెపూల రాశిపోసి, వాటిలోంచి కొన్ని పరిమళ భరితమైన పూలను తీయమంటే వేటిని తీయగలం... మూడువేల పై చిలుకు పాటలు వేటికవే ప్రత్యేకమైనవి. అపూర్వమైనవి. వాటన్నిటి మీద సమగ్రమైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతో ఉంది.**

**గేయ రచయితగా, కథకుడిగా, నటుడిగా, గాయకుడిగా చలనచిత్ర చరిత్రలో స్థిరస్థానాన్ని సంపాదించుకొన్న సీతారామశాస్త్రి సినిమాలున్నంతకాలం సినిమా కవులున్నంతకాలం చిరస్మరణీయులే...!**

# ఆపద్బాంధవుడు (కథ)

డా. తాళ్ళపల్లి యాకమ్మ
9704226681

సెల్‌ఫోన్ మోగుతున్న శబ్దం లీలగా వినిపిస్తుంది. కళ్ళు తెరవడానికి ఎంత ప్రయత్నించినా మళ్ళీ కళ్ళు మూసుకు పోతున్నాయి. ఫోన్ ఆగకుండా మోగుతూనే ఉంది. ఏదో కర్తవ్యం గుర్తుకువచ్చిన వాడిలా వెంటనే లేచి ఫోన్ ఎత్తాడు కుమార్. అవతలి నుండి ఆర్ద్రంగా 'డాక్టర్ గారూ! నా కూతురు జ్వరం తలనొప్పితో విలవిలలాడుతుందండి. ఏ డాక్టర్ చూడటం లేదండీ..!' అంటూ వేడుకుంటున్నాడు వీరన్న. 'సరే వెంటనే అమ్మాయిని తీసుకొని హాస్పటల్‌కు రాండి' అంటున్న మాటకు కుమారు భార్య కళ్ళు తెరిచి గోడ గడియారం వైపు చూసి, "టైమ్ చూశారా..! పొద్దంతా పేషంట్స్‌తో విసిగిపోయి, ఎవరో కరోనా పేషెంటుకు సీరియస్‌గా ఉందని తెల్లవారి జామున రెండు గంటల వరకు హాస్పటల్ లోనే ఉన్నారు అన్నం నీళ్ళు మాని. ఇప్పుడే వచ్చి అలా కునుకు తీశారో లేదో మళ్ళీ..!" ఆమె మాట పూర్తి కాకముందే "అలా అంటే ఎలా చెప్పు మనం ఇద్దరం వైద్యులం ఎనీ టైమ్ అందుబాటులో ఉండి వైద్యం అందించాలి. అది పగలా రాత్రా.. అని కాదు..!" అంటూ ఇంట్లో నుండి కిందికి వచ్చి అతనే తలుపులు తీసి పేషెంట్ వాళ్ళను లోపలికి పిలిచి, నిద్ర పోతున్న సిబ్బందిలో నుండి ఒక కాంపౌండర్ ను లేపి ఎమర్జెన్సీ కిట్ లోనుండి మెడిసన్ తీసి వైద్యం అందించాడు. అర్ధ గంటలో ఆ అమ్మాయి లేచి కూర్చుంది.

ఆ అమ్మాయి తండ్రి వీరన్న పర్సులోనుండి డబ్బులు తీసీ ఫీస్ సార్.. అని ఇవ్వబోతుంటే .. ఫీజ్ తీసుకోక పోగా వాళ్ళకే అదనంగా మందులు ఇచ్చి, అమ్మాయి తలపై చేతితో నిమిరి భయపడకమ్మా.. ఏమీ కాదు ఇక నువ్వు నిశ్చింతగా ఇంటికి వెళ్ళవచ్చని భరోసా ఇచ్చాడు డాక్టర్.

ప్రపంచమంతా కరోనా కరాళ నృత్యం చేస్తుంటే దేవాలయాలతో పాటు కొన్ని నర్సింగ్ హోమ్ లు కూడా మూతబడ్డాయి. మామూలు జ్వరం దగ్గు లాంటివి వచ్చిన వారిని కూడా కొన్ని హాస్పిటల్స్ దగ్గరికి రానివ్వడం లేదు. అలాంటి విపత్కర సమయంలో కూడా డాక్టర్ కుమార్ గారు తన నర్సింగ్ హోమ్‌ని ఇరవై నాలుగు గంటలు తెరిచి ఉంచి, ఎప్పటిలాగే పేదవారికి ఫీస్ తీసుకోకుండానే వైద్యం అందిస్తూ, మందులు కొనలేని నిరుపేదలకి ఉచితంగా మందులు కూడా ఇస్తున్నాడు. కరోనా రోగులకు విడిగా ఒక వార్డు ఏర్పాటు చేసి, ఎంతోమంది ప్రాణాలు నిలుపుతున్నాడు. ఆ చుట్టు పట్టు గ్రామాలల్లో, పట్టణాల్లో డాక్టర్ కుమార్ అంటే తెలియని పేదవారు లేరంటే అతిశయోక్తి కాదు.

కరోనా కట్టడి కోసం ప్రభుత్వం లాక్ డౌన్ విధించింది. కరోనా పేరు వింటేనే భయపడిపోతున్నారందరూ. ఎందరో డాక్టర్లు కరోనా బారిన పడి ప్రాణాలను విడుస్తునారు. కొందరు డాక్టర్లు ప్రాణాలను పణంగా పెట్టి కొందరికి ప్రాణాలు పోస్తునారు. డాక్టర్ కుమార్ గారు కూడా ఆవిరామంగా కరోనా బాధితులను చేరదీసి ఆదుకుంటున్నాడు.

ఒక రోజు అర్ధరాత్రి ఫోన్ మోగింది ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా కుమార్ ఫోన్ ఎత్తాడు. అవతలి వైపునుండి ఆడ గొంతు 'అయ్యా నా భర్తకు కాలు చెయ్యి సచ్చుపడిపోయి ఆగమాగం చేస్తుండయ్యా..!' అంటూ రోదిస్తుంది స్వామి భార్య. వెంటనే హాస్పటల్ కి తీసుకొని రాండమ్మా.. అన్నాడు కుమార్. బయట ఆటోలు లెవ్వు, నా పిల్లలు చిన్న పిల్లలు' అని ఆమె చెప్పటం పూర్తి కాకముందే 'అమ్మా.. మీ ఇంటి అడ్రస్ చెప్పండని, అడ్రస్ తీసుకన్న పడి నిమిషాలలో కారు వచ్చి స్వామి వాకిట్లో ఆగింది. కార్ డ్రైవర్ ఇంట్లోకి వచ్చి స్వామికి సాయం పట్టి కారులో ఎక్కించుకొని హాస్పటల్‌కి తీసుకొని వెళ్ళేసరికే డాక్టర్ కుమార్ తన సిబ్బందితో రెడీగా ఉండి, వెంటనే స్వామికి అన్ని టెస్టులు చేసి, ఖచ్చితమైన నిర్ధారణ కోసం సిటీ స్కాన్ కావాలని, వేరే హాస్పిటల్‌కు ఫోన్ చేసి అక్కడి వారిని ఆ అర్ధరాత్రి నిద్రలేపి సిటీస్కాన్ చేయించి, రిపోర్ట్ రాగానే అది పక్షవాతమని నిర్ధారించగానే స్వామి భార్య పిల్లలు ఏడుపు లంకించుకున్నారు. "స్వామికి ఏమీ కాదమ్మా.. నేనున్నానుకదా..!" అంటూ వారికి ధైర్యం చెప్పి, వారి సిబ్బందితో మెడిసన్ తెప్పించి వేటంనే వైద్యం ప్రారంభించాడు.

రెండు రోజులు హాస్పిటల్లోనే ఉంచి వైద్యం చేస్తూనే, మళ్ళీ ఒక సారి అన్ని టెస్టులు చేయించి, స్వామి భార్యను పిలిచి "అమ్మా..! రిపోర్ట్స్ వచ్చాయి. మరి స్వామిని వరంగల్ కానీ, హైదరాబాదుకు కానీ తీసుకెళ్లగలవా..!" అన్నాడు కుమార్. ఒక్కసారే కుప్పకూలి పోయింది స్వామి భార్య. "అమ్మా.. అధైర్య పడొద్దు, నామీద నమ్మకం ఉంటే ఇక్కడే ఉంచండి." ఆనాడు నమ్మకంగా, "ఎట్లాగైనా మీరే కాపాడాలని రెండు చేతులు జోడించింది.

వారి పేదరికాన్ని గమనించి నాలుగు రోజులు వైద్యం అందించి స్వామి ప్రాణాలు కాపాడడమే కాకుండా, మళ్ళీ స్వామి లేచి నడిచేటట్టు చేశాడు. టెస్టులకు నాలుగు రోజులకు గాను వారి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఇంటికి పంపించాడు. ఇలా అందరిని ఆదుకుంటూ అందరి హృదయాలలో ఆపద్బాంవుడిగా నిలిచిపోయాడు డాక్టర్ కుమార్.

# పద్యమనోహరం - 25

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448



"కురియింపరేల? మీ కుసుమ సర్వస్వమ్ము
స్వర్గ సామ్రాజ్య వృక్షమ్ములార!
వెలయింపరేల? మీ లలిత జయధ్వాన
భారముల్ కాహళీ భేరులార!
వెదజల్లరేల? మీ హృదయ పూర్వ సుభక్తి
సర్వ చరాచర సమితులార!
ఎగబట్టరేల? మీ సొగసు బంగరుపుటల్
రహి భారతీ చరిత్రమ్ములార!
యింక మీకితోధిక మహోత్కృష్టమైన
రమ్య సుముహూర్త కాలంబు రాదు రాదు
అవిగో ఝాన్సీ లక్ష్మీబాయి యరుగుదెంచి
దుముకుచున్నది యుద్ధరంగమునకిపుడు"

అవి ఉద్ధృతంగా స్వాతంత్ర్య పోరాటం సాగుతున్న రోజులు. ప్రచార మాధ్యమాలైన నాటి పత్రికలు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని రగలించే సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని పుష్కలంగా ప్రచురిస్తున్న సందర్భం. తెలుగు నాట కవిత్వరంగంలో భావ కవిత్వం ప్రతి కవిని ప్రభావితం చేసిన ఆరోజుల్లో కవిత్వ రంగంలోకి ఎందరో కవయిత్రులు కూడా తమతమ రచనల ద్వారా ఈ స్ఫూర్తిని రగిలిస్తూనే రచనలు చేశారు. నాటి పత్రికలైన గృహలక్ష్మి, అనసూయ, భారతి వంటి మహిళా రచయిత్రులకు ప్రోత్సాహమివ్వడంలో ముందంజలో ఉన్నాయి. పుంఖానుపుంఖాలుగా కవయిత్రులు ఆ పత్రికల వేదికనుండి తమ తమ రచనలను ప్రజలకు అందించే ప్రయత్నం చేశారు. నాటి సామాజిక స్థితిగతులను, పోరాటాల అవసరాన్ని, పోరాట వీరుల శౌర్యాన్ని వస్తువుగా స్వీకరించి, కనుపర్తి వరలక్ష్మమ్మ రాజ్యలక్ష్మి, పరచూరి భువనేశ్వరి, వింజమూరి వెంకట రత్నమ్మ, మహాలక్ష్మి, పరచూరి అనసపూర్ణమ్మ మొదలైన ఎందరెందరో కవయిత్రులు సమర్ధమైన పద్యరచనలు చేసి సాహిత్యం ద్వారా ముఖ్యంగా పద్యకవిత్వం ద్వారా ఈ పోరాట స్ఫూర్తిని పంచే ప్రయత్నాన్ని చిత్తశుద్ధితో చేశారు. నాటి కవయిత్రుల్లో ఒకరైన వెలువోలు వసంతాదేవి రచించిన ఈ పద్యం వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయిని స్వాగతించమని ప్రబోధిస్తూ రాసింది. ఝాన్సీలక్ష్మీబాయి పౌరుషానికి ప్రతీక. మహాయోధురాలు. జాతికి ఊపిరి పోసిన ఆ మహాయోధురాలి స్మరణ ఈ పద్యాన్ని సుసంపన్నం చేసింది.

ఆ వీరనారి లక్ష్మీబాయినీ, ఆమె మన జాతికి అందిస్తున్న పోరాటస్ఫూర్తినీ ఈ పద్యంలో ప్రకటిస్తూ, సర్వ ప్రకృతి దాన్ని ఆహ్వానిస్తున్న విశిష్ట భావ వ్యక్తీకరణను ఈ పద్యం అందిస్తున్నది. స్వాతంత్ర్య పోరాట రంగంలోకి దూకి వస్తున్న వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిపై మీ వృక్షాలకు పూచిన పుష్పాలను కురిపించమని స్వర్గ సామ్రాజ్యవృక్షాలను, జయ జయ ధ్వానులను మ్రోగించమని కాహళీ భేర్యాది ధ్వని ప్రకటన పరికరాలను, హృదయపూర్వకమైన దేశభక్తిని వెదజల్లమని అన్ని సమూహాలను బంగారు పుటల్లో నిక్షిప్తమయ్యే భారతీ చరిత్రల్లో ఆ వీరనారి చరితను వినిపించమని, ఇంతకన్న మంచి సమయం ఎప్పటికీ రాదు, రాదని నొక్కి చెబుతూ ఝాన్సీ లక్ష్మీబాయి పోరాట భూమిలోకి దూకిన సందర్భాన్ని కవయిత్రి స్ఫూర్తిమంతంగా కవిత్వీకరించారు.

నాటి మహా పోరాటాన్ని సమర్ధిస్తున్న వైనాన్ని ఈ కవయిత్రి తన పద్యం ద్వారా ప్రతిబింబించిన తీరు ప్రశంసనీయం. నాటి కవుల కవిత్వానికి దీటుగా కవయిత్రులు కూడా కలం కదిపి గొప్ప స్ఫూర్తినిచ్చారనడానికి ఇటువంటి కవితలే ప్రమాణం.

మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# జానపద పరిశోధన - మెళకువలు

**డా. బుక్కాబాలస్వామి,** విశ్రాంత అధ్యాపకులు
ఫోన్ : 9701674044

జానపదులకు సంబంధించింది జానపదం. జానపద సంస్కృతి, జానపద జీవనం, జానపద విజ్ఞానం వేరువేరు కాదు. ఇవి పరస్పర సంబంధితాలు, ఆధార ఆధేయాలు. ఒకప్పుడు జానపదులంటే జనపదాలలో నివసించే అనాగరికులు, నిరక్షర కుక్షులు అని భావించేవారు. కాని మారుతున్న కాలానికి అనుగుణంగా యీ విషయంలో జానపద విజ్ఞానవేత్తల అభిప్రాయం కూడా మారింది. సమాన సంప్రదాయాలు, ఆచారాలు కలిగిన జనసముదాయానికి సంబంధించిన విజ్ఞానమే జానపద విజ్ఞానమని, జనపదాలలో నివసించినా, నగరాలలో నివసించినా జానపదత్వం ఉన్నవారు జానపదులని నేటితరం జానపద విజ్ఞానవేత్తలు భావిస్తున్నారు.

జానపదత్వాన్ని పరిరక్షించుకొను ప్రజల విజ్ఞానమే జానపద విజ్ఞానం అని నిర్వచించుట సమంజసంగా ఉంటుందనేది అనేకమంది జానపద విద్వాంసుల అభిప్రాయం. జానపద సాహిత్యం జానపదుల చేత జానపదుల కొరకు సృష్టించబడిందని చెప్పవచ్చు. జానపదులలో జనపదత్వమే కాక తత్సంబంధ 'జానపదత్వం' కూడా అంతర్లీనంగా ఇమిడి ఉంటుంది. అందువల్లనే వేదవ్యాసులవారు **"కృత యజ్ఞశ్చ మేధా విబుధో జ్ఞానపదశ్శుచి:"** అని జానపదులను యజ్ఞం చేసినవారితో, పండితులతో సమానంగా భావించారు.

జానపద సాహిత్యం, జానపద ప్రదర్శన కళలు జానపద విజ్ఞానంలో అంతర్భాగం. మౌఖిక సాహిత్యాన్నే మనం జానపద సాహిత్యమని పిలుస్తున్నాం. అంటే జానపద సాహిత్యం జానపద విజ్ఞానంలో అంతర్భాగం. విజ్ఞాన ప్రబోధ సాధకం అనుట సమంజసంగా ఉంటుంది.

తెలంగాణ ప్రాంతంలో జానపద విజ్ఞాన ఖనిగా, జానపద విజ్ఞాన బ్రహ్మగా జానపద సాహిత్య పరిశోధనకు విశ్వవిద్యాలయ స్థాయిలో స్థానం కల్పించి, జానపద సాహిత్య పరిశోధనకు మార్గదర్శకంగా నిలిచిన మహనీయులు కీర్తిశేషులు ఆచార్య బిరుదురాజు రామరాజు గారు. వీరు చూపిన బాటలో నేడు తెలంగాణ ప్రాంతంలో ఎందరో జానపద విజ్ఞానవేత్తలుగా జానపద విజ్ఞాన రంగంలో ప్రసిద్ధులైనారు.

జానపద విజ్ఞానం పరిధి చాలా లోతైనది, విస్తృతమైనది. ప్రపంచం లోని ఒక దేశం, ఒక భాష, ఒక జనసమూహం ఎలా జీవిస్తుందో, ఎలా విశ్వసిస్తుందో, ఎలా అభివ్యక్తీకరిస్తుందో తెలుసుకోవాలంటే జానపద విజ్ఞాన సింధువు లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయవలసి వుంటుంది. ప్రస్తుత వ్యాసం జానపద సాహిత్యంపై పరిశోధన చేసే జిజ్ఞాసువులు, పరిశోధకులు తెలుసుకోవలసిన మెలకువలు, జాగ్రత్తల గురించి వివరించుటకు మాత్రమే పరిమితమైందని విజ్ఞులు గ్రహించగలరు.

## జానపద సాహిత్య పరిశోధన - మెలకువలు

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం అంతర్భాగమని నిర్వచించుకున్నారు. జానపద విజ్ఞానాన్ని వర్గీకరించడంలో వేరు వేరు సంస్కృతుల వాళ్ళు వేరువేరు పద్ధతులు అవలంబించారు. జానపద సాహిత్య పరిశోధకులు ఈ పద్ధతులన్నింటిని లోతుగా అధ్యయనం చేయవలసి వుంటుంది. పూర్వ పరిశోధకుల పరిశోధనా పద్ధతులును, రీతులను, మెలకువలను నిరంతరాయంగా మెరుగు పరచుకోవలసి వుంటుంది. మౌఖిక సాహిత్యానికి, లిఖిత సాహిత్యానికి భేదసాదృశ్యాలు అనేకం వుంటాయి. వాటిని పరిశోధకుడు నిరంతర అధ్యయనం ద్వారా అవగాహన చేసుకోవాలి.

జానపద గేయాలు (కథా సహితాలు, కథా రహితాలు), జానపద వచన కథలు, పొడుపుకథలు, సామెతలు, జాతీయాలు మౌఖిక సాహిత్యంలో అంతర్భాగాలు. అట్లే జానపద ప్రదర్శన కళల జానపద విజ్ఞానంలో అంతర్భాగాలు. జానపదులు భౌతిక జీవనాన్నే కాక వారి వివిధ అనుభూతులను, భావపరంపరలను, జానపద సాహిత్యం హృదయంగమంగా చిత్రిస్తుంది. అట్లా ప్రతి ప్రాంతంలోని జానపద ప్రదర్శన కళలు ఆయా ప్రాంతీయ ప్రజల సంస్కృతిని, జీవన రీతిని ప్రదర్శించే సజీవ చిత్రాలు. తరతరాల సాంస్కృతిక వారధులు, భావి తరాల చైతన్య దీపాలు జానపద కళారూపాలు.

## జానపద సాహిత్య పరిశోధకులు గమనించవలసిన అంశాలు

1. తనకు ఇష్టమైన జానపద సాహిత్య పరిశోధనాంశం తాను చదువుకున్న ఆచార్యుల వద్ద సంప్రదించి నిర్ణయించుకోవాలి.

2. తాను ఎన్నుకున్న అంశంపై ఇతర విశ్వవిద్యాలయాలలో పరిశోధన జరిగిందా? లేదా? అనే విషయాన్ని మనకు లభిస్తున్న ఆకర గ్రంథాల ద్వారా తెలుసుకోవాలి.

3. తాను నిర్ణయించుకున్న అంశానికి సంబంధించిన విజ్ఞానాన్ని నిరంతర అధ్యయనం ద్వారా మెరుగు పరచుకోవాలి.

4. మౌఖిక సాహిత్యమైన జానపద సాహిత్యం లేదా గిరిజన సాహిత్యం క్షేత్ర పర్యటన, సేకరణపై ఆధారపడి ముందుకు సాగుతుంది. అందువల్ల పరిశోధనాంశం నిర్దేశించబడిన తర్వాత క్షేత్ర పర్యటన ద్వారా పరిశోధనాంశానికి చెందిన సామగ్రిని, సమాచారాన్ని సేకరించుకోవాలి.

5. ఆధునిక యుగంలో క్షేత్రస్థాయిలో జానపద సాహిత్య సేకరణకు సంబంధించి ఉపయోగపడే సాంకేతిక పరికరాలు విరివిగా అందుబాటులో వున్నాయి. వీటిద్వారా వస్తుసేకరణను సులభమైన మార్గంలో సేకరించవచ్చు.

6. జానపద గేయాలు, వచన కథలు, గేయకథలు, సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సేకరించడానికి అవకాశముంది.

7. విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, ఆచార్యులకు ఈ సేకరణ కొంతవరకు సులభమైనదిగానే భావించవచ్చు. ఎందుకంటే తమ విద్యార్థుల ద్వారా, సహాధ్యాయుల ద్వారా, మిత్రుల ద్వారా కావలసినంత సమాచారాన్ని సేకరించవచ్చు.

8. స్వయంగా క్షేత్రపర్యటన ద్వారా విషయ సేకరణ చేయాలనుకునే పరిశోధకులు కొన్ని ప్రాంతాలను తమ పరిశోధనాంశానికి సంబంధించి ఎన్నుకొని ఆ ప్రాంతాలకు వెళ్ళి విషయ సేకరణ చేయాలి.

9. తాము ఇంతకుముందఱ సేకరించిన విషయాలను జానపదులకు వివరించి, వారిని విషయోన్ముఖులను చేసి, ప్రేరేపించి, వారినుండి మనకు కావలసిన అంశం పైననే కాకుండా తదితర అంశాలపై కూడా వారికి తెలిసిన సమాచారాన్ని సేకరించాలి. విషయ సేకరణకు సహకరించిన వారి వివరాలు, ఛాయాచిత్రాలు కూడా తీసుకోవాలి.

10. జానపద సాహిత్య సేకరణ పద్ధతులకు జానపద కళల విషయ సేకరణ పద్ధతులకు కొన్ని భేదసాదృశ్యాలు మౌలికంగా ఉ టాయి. వాటిని పరిశోధనా జిజ్ఞాసువులు గ్రహించాలి.

11. తెలంగాణ జానపద కళారూపాలపై కృషి చేయాలనుకొనే పరిశోధకులు ఆయా ప్రదర్శన కళారూపాల ప్రదర్శన జరుగుచున్నప్పుడు ప్రత్యక్షంగా వారి కళాప్రదర్శనలను ఆడియో, వీడియోల ద్వారా రికార్డు చేయాలి.

12. సంగీత, సాహిత్య, నాట్యకళల సమాహారంగా జానపద కళా ప్రదర్శన కళలు తరతరాల నుండి ప్రదర్శింపబడుచున్నవి.

13. ఒగ్గుకథ, చిందు భాగవతం, వృత్తి గాయకుల గానం చేసే కథలు, కోలాటం, యోగానం, కిన్నెర కథలు, కడ్డి వాయిద్యం, బతుకమ్మ నృత్యాలు, గంగిరెద్దుల ఆటలు, దొమ్మరివారి ప్రదర్శన కళలు, పాములాటలు, ఎలుగుబంటి ఆటలు, కోతులాటలు, జాతరలలో జరిగే ఉత్సవ కళలు, సంకురాతిరి ఉత్సవాలు, చెక్క భజనలు, చిరుతల భజనలు తదితర జానపద కళలకు తెలంగాణ కాణాచి. ఇట్టి కళలపై పరిశోధన చేయాలనుకునే పరిశోధకులు కళాకారులతో ముఖాముఖిగా స్పందించి వారితో ఇంటర్వ్యూ తీసుకొని ఆయా కళల పుట్టు పూర్వోత్తరాలను నమోదు చేయవలసి వుంటుంది.

గ్రామదేవతల ఉత్సవాలలో, జాతరలలో, సంతలలో, పండుగల సందర్భంగా జానపద కళలు విరివిగా ప్రదర్శింపబడుతుంటాయి. గ్రామ దేవతల ఉత్సవాలలో ప్రత్యేకంగా తెలంగాణలో బైండ్లవారు ముందుండి వీరనాగమ్మ, రేణుకా ఎల్లమ్మ, కోట మైసమ్మ, పెద్దమ్మ తదితర దేవతల కథలను తమ వాద్యాల ద్వారా ప్రదర్శిస్తూ ప్రజలను రంజింపజేస్తారు. అట్లే బీరప్పవాండ్లు తమ వాద్యాల ద్వారా తమ కులదైవమైన బీరప్ప కథలను చక్కగా వివరించి తమ కులస్థులకు తమ ఇలవేల్పుల మహిమలను తెలియజేస్తారు. అట్లే పటం కథల ద్వారా తమ కుల పురాణాలను వివరిస్తారు. అందువల్ల మరుగున పడిన ప్రాదేశిక జానపద కథలను పరిశోధకులు వెలికితీసి పరిచయం చేయాలి. పరిశోధనానురక్తి, పట్టుదల, నూతనత్వాన్ని ఆవిష్కరించాలనే అన్వేషణా ప్రవృత్తి ఉత్తమ పరిశోధకుని లక్షణాలు. క్షేత్రస్థాయిలో తాను సేకరించిన విషయాన్ని తన పరిశోధనాంశానికి అనుకూలంగా మలచుకోవాలి జిజ్ఞాసువులైన పరిశోధకుడు.

జానపద సాహిత్య పరిశోధనలో విషయ సేకరణ ఎంత ముఖ్యమో విషయ విభజన, విశ్లేషణ కూడా అంతే ముఖ్యమైనవి. తాను సేకరించిన మౌఖిక సాహిత్య పరిశోధనాంశానికి అనుగుణంగా ఎన్నుకొని పర్యవేక్షకుల సహకారంతో సిద్ధాంత గ్రంథ రచనా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ప్రణాళికననుసరించి సిద్ధాంత వ్యాస రచనకు పూనుకోవాలి. తాను రచించబోయే సిద్ధాంత వ్యాసానికి సంబంధించి తనకంటే ముందుతరం వారు రచించిన గ్రంథాలను విస్తృతస్థాయిలో అధ్యయనం చేసి, ఆ విషయంపై అవగాహనను పెంచుకోవాలి. పర్యవేక్షకునితో అనేకసార్లు చర్చలు జరిపి ఉత్తమ పరిశోధనా వ్యాసరచనకు పూనుకోవాలి.

జానపద సాహిత్యంలో ప్రతి జాతి జీవన విధానం, జీవనరీతి అంతర్లీనంగా ప్రతిబింబిస్తుంది. అందువల్ల మన సంస్కృతి నుండి ఆవిర్భవించిన సాహిత్యాన్ని మన సంస్కృతి దృష్టితోనే విశ్లేషించి ఆవిష్కరించాలి. అప్పుడే మన పూర్వీకుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని, వైశిష్ట్యాన్ని వెలికి తీసినవారమవుతాము. జాతికి పరిచయం చేసినవారమవుతాము.

## పాశ్చాత్యుల జానపద సాహిత్య విజ్ఞాన పరిశోధన ఫలితాలను అన్వయించుటకు యత్నించుట

శరవేగంగా మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంతో మన జానపద సాహిత్యాన్ని పాశ్చాత్యులు నిర్దేశించిన శాస్త్రీయ విధానాలకు అన్వయించుటకు కూడా యత్నించాలి.

పాశ్చాత్యులు అన్ని రంగాలలో మనకంటే ముందున్నట్లుగానే జానపద విజ్ఞాన పరిశోధనారంగంలో కూడా ముందుండి మనకు ఆదర్శంగా నున్నారు. జానపద విజ్ఞానరంగంలో ఎందరో జానపద విద్వాంసులు తాము సేకరించిన విషయాన్ని శాస్త్రీయ దృక్కోణంతో

వింగడించి, ప్రయోగించి అనేక విలువైన గ్రంథాలను రచించారు. అట్టివారిలో డబ్ల్యు.జె. థామస్, గ్రిమ్ సోదరులు, ఆర్.ఎస్. బాగ్స్, విలియం జాన్ థామ్స్, బెవిస్ట్రాస్, స్టిత్ థామ్సన్, రిచర్డ్ ఎమ్. డార్సన్, వి.జె. ప్రాప్, ఆలన్ దండెస్, థియోడర్ బెన్ఫె, ఫ్రాన్సిస్ జె. చైల్డ్, ఆర్చర్ టేలర్, విలిమ్ ఆర్ బాస్కమ్, ఆంటి ఆర్నే, అలెగ్జాండర్ కాఫ, సి.పి. బ్రౌన్, చార్లెస్ ఇ.గోవర్, జె.ఏ. బోయల్, జార్జి మాథెన్, కెప్టెన్ ఎం.డబ్ల్యు.కార్ ప్రముఖులు.

వీరిలో 1846లో డబ్ల్యు.జె.థామస్ జానపద విజ్ఞానాన్ని 'ఫోక్‌లోర్'గా ప్రచారంలోకి తెచ్చాడు. అలెన్ డూడర్ "ద స్టడీ ఆఫ్ ఫోక్‌లోర్" అనే గ్రంథం ద్వారా జానపద విజ్ఞాన క్షేత్రంలో జానపద విజ్ఞానంపై విశేష కృషి చేసినాడు. రిచర్డ్ ఎం. డార్సన్ అనే జానపద విజ్ఞానవేత్త "ఫోక్‌లోర్ అండ్ ఫోక్ లైఫ్" ద్వారా జానపద విజ్ఞానాన్ని విభజించి అధ్యయనం చేశారు. ఆర్.ఎస్.బాగ్స్ జానపద విజ్ఞానాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, అధ్యయనం చేసి అనేక నూతనాంశాలకు ప్రాణం పోసాడు. స్టిత్ థామ్సన్ జానపద కళాక్షేత్రంలో ప్రధానంగా కథల వర్గీకరణలో ప్రధానపాత్ర పోషించి దిగ్విజయుడయ్యాడు.

పాశ్చాత్య విద్వాంసులందరు కూడా ప్రపంచ వ్యాప్తంగా వున్న జానపద విజ్ఞానాన్ని, జానపద సాహిత్యాన్ని శాస్త్రీయంగా విభజించి అధ్యయనం చేయడానికి ప్రయత్నించారు.

తెలుగులో జానపద సాహిత్యంలో పరిశోధన చేసే విద్యార్థులు కూడా పాశ్చాత్యుల రచనలను లోతుగా అధ్యయనం చేసి మన జానపద సాహిత్యానికి అన్వయించడానికి ప్రయత్నించాలి. దీనివల్ల విశ్వ వ్యాపితంగా జానపద విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించడానికి అవకాశం కలుగుతుంది. విభిన్న సంస్కృతుల సింధువులైన జానపద విజ్ఞాన సింధువులను మానవశాస్త్రం (ఆంత్రోపాలజీ), సమాజ శాస్త్రం (సోషియాలజీ), మనస్తత్వ శాస్త్రం (సైకాలజీ) ఆధారంగా వివిధ దృక్కోణాలతో పరిశీలించి, పరిశోధించి జాతికి అందించాలి.

**"ఆపూర్యమాణం అచల ప్రతిష్ఠం సముద్రమాప: ప్రవిశంతి"**

(నదులలోని నీరు దినదినం సముద్రంలో కలుస్తుంది. అయినా సముద్రుడు గంభీరంగా ఉంటాడు) అనే సూక్తి ననుసరించి జానపద విజ్ఞాన సింధువు కూడా విశ్వవ్యాపితమైన అనేక జాతుల మౌఖిక సాహిత్య స్రవంతుల కూడలి. ఇటువంటి జానపద విజ్ఞాన సింధువులో మన ప్రాంతీయ జానపద విజ్ఞానాన్ని, జానపద కళారూపాలను, జానపద సాహిత్య సంపదను భావితరాలకు అందించవలసిన గురుతరమైన బాధ్యత వర్తమానతరంపై ఉన్నది. అందువల్ల జానపద సాహిత్యం, జానపద ప్రదర్శన కళలపై పరిశోధన చేయాలనుకునే పరిశోధక విద్యార్థులు గ్రామీణ జీవితాన్ని సమగ్రంగా జీర్ణించుకున్న వారై ఉండాలి. గ్రామీణ జీవితం, కట్టుబాట్లు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, పండుగలు, ఉత్సవాలు బాగా తెలిసినవారై వుండాలి. జన్మత: గ్రామీణులైతే ఇంకా బాగా న్యాయం చేయగలుగుతారు.

ప్రపంచీకరణ ప్రభావంతో మన ప్రాంతీయ, జాతీయ జానపద సంపదను చాలావరకు పోగొట్టుకున్నాము. మన పూర్వులు ఉపయోగించిన వస్తువుల రూపురేఖలను విస్మరించినాము జానపద విజ్ఞానరంగంలో ప్రపంచంలోని పాశ్చాత్య దేశాలలో జరిగిన విజ్ఞాన శాస్త్రరంగంలో జరిగిన కృషిని మనం లోతుగా అధ్యయనం చేసి మన జాతి సంస్కృతికి అనుగుణంగా మనం పాశ్చాత్యుల శాస్త్రీయ పద్ధతులను అన్వయించి సూత్రబద్ధం చేయడానికి యత్నించాలి.

ప్రతి ఉన్నత విద్యావంతుడు తాను నివసిస్తున్న గ్రామ చరిత్రను సమగ్రంగా పరిశీలించి ఆ గ్రామ జానపద విజ్ఞానాన్ని ప్రకటించవచ్చు. ఇట్లు భారతావనిలో ప్రతి గ్రామ ప్రాచీన చరిత్రను జానపద విజ్ఞాన దృక్కోణంతో పరిశీలించి, పుస్తకరూపంలో నిక్షిప్తం చేస్తే భావితరాలకు అమూల్యమైన జానపద విజ్ఞానం అందుబాటులోకి వస్తుంది. అప్పుడు జానపద విజ్ఞాన భాండాగారంగా భారతదేశం పరిఢవిల్లుతుంది.

జానపద సాహిత్యం, విజ్ఞానం పరిరక్షింపబడాలంటే విశ్వవిద్యాలయాలు ఈ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించాలి. రెండు తెలుగు రాష్ట్రాలు విశ్వవిద్యాలయాలలో స్నాతకోత్తర (ఎం.ఏ) స్థాయిలో "జానపద విజ్ఞానం"ను ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టి విస్తృతస్థాయి అధ్యయనానికి అవకాశం కల్పించాలి. ప్రతిజిల్లాలో జానపద విజ్ఞాన భాండాగారాన్ని నెలకొల్పి అంతరించిపోతున్న మన జానపద విజ్ఞాన సంపదను పరిరక్షించుకోవాలి. కనీసం రాష్ట్రస్థాయిలోనైనా ప్రభుత్వం ఆయా రాష్ట్ర జానపద సంపదను మ్యూజియం ద్వారా భద్రపరచి భావితరాలకు అందించాలి. జానపద వస్తు ప్రదర్శన శాలలు ప్రతి జాతి పురాసంస్కృతికి మూలాలుగా, ఆకరాలుగా విలసిల్లాలి. పాఠశాల స్థాయిలో, కళాశాలస్థాయిలో, విశ్వవిద్యాలయ స్థాయిలో జానపద సాహిత్యాన్ని పాఠ్యాంశాలుగా నిర్ణయించాలి. తద్వారా యువతరానికి జానపద సాహిత్య పరిజ్ఞానాన్ని కల్గించాలి. అంతరించిపోతున్న జానపద సంపదను, విజ్ఞానాన్ని జాతికి అందించడంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయం, అభినందనీయం. ఈ కృషి నిరంతరం నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

మూసీ మాసపత్రిక సుప్రసిద్ధ పరిశోధకులు కీర్తిశేషులు బి.ఎన్.శాస్త్రిగారి మానసపుత్రిక. ఈ పత్రికను నిర్వహిస్తున్న వారి పుత్రిక, అల్లుడు కమలాకరశర్మ దంపతులను మనసారా అభినందిస్తున్నాను. విశ్వవిద్యాలయ తెలుగు పరిశోధక విద్యార్థులకు సాహిత్యాన్ని అన్ని కోణాలలో అందించడానికి ఆయా సాహిత్య రంగాలలో విశేష కృషి చేసిన విజ్ఞుల చేత ప్రసంగాల రూపాలలో అందించి, వాటిని ప్రసంగ వాయసాలుగా తమ పత్రికలో ప్రచురించి పరిశోదక విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తున్నారు. ఇట్టి వీరి

కృషిని త్రికరణశుద్ధిగా అభినందిస్తూ యీ మూసీ సాహిత్యధార నిరంతరం సాహిత్య స్రవంతులుగా ప్రవహించాలని కోరుకుంటున్నాను.

మూసీ మాసపత్రిక రజతోత్సవాలు జరుపుకుంటున్నశుభ తరుణంలో నాకు “జానపదసాహిత్య పరిశోధన – మెలకువలు’ అనే అంశంపై ప్రసంగించే అవకాశం కల్పించినందులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.


మానమిత్రులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారు ప్రారంభించిన మూసీమాసపత్రిక డా. సాగికమలాకరశర్మ, డా. మనోహరి గారి సారథ్యంలో నిరంతరం విజ్ఞానచంద్రికలను సాహితీ పిపాసులకు అందించాలని ఆకాంక్షిస్తున్నాను. శాస్త్రిగారి అడుగుజాడలలో పయనిస్తూ తెలుగు సాహిత్య జ్ఞానదీప్తులను సాహిత్య పిపాసువుల కందిస్తున్న ఆదర్శ దంపతులకు సర్వేశ్వరుడు సర్వాంతర్యామి, జ్ఞానచైతన్య దీప్తిని దీర్ఘాయురారోగ్యశక్తిని అనుగ్రహించాలని కోరుకుంటున్నాను. మూసీ మాసపత్రిక రజతోత్సవాలతో పాటు భవిష్యత్తులో స్వర్ణోత్సవ, వజ్రోత్సవాలు కూడా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

జానపద జీవనం జాతి సాంస్కృతిక మూలనిధికి పునాది. జానపదుల హృదయాలు నవరస రమ్య నిలయాలు. జానపదుల కల్పనా చమత్కారం నిసర్గ సుందరం. జ్ఞానపథగాములైన జానపదులకు అద్దంలో ఆకాశాన్ని చూపించినట్లుగా విహంగ వీక్షణంగా రచించిన యీ వ్యాసం అంకితం.

## సత్సంగం

### మానవ ప్రయత్నము – దైవానుగ్రహము

కొన్ని సిద్ధాంతాల ప్రకారం పూర్వజన్మల లోని కర్మలు తప్ప భగవంతుడంటూ ఎవరూ లేరు. శాస్త్రాల ననుసరించి, ఈ జన్మలో చేసిన కర్మని పురుష కార్యమంటారు (మానవ ప్రయత్నం), పూర్వజన్మలోని కర్మలూ, ప్రస్తుత కర్మలూ పొట్టేళ్ళ వలె ఢీకొంటాయనీ, వాటిలో బలహీనమైనది మాసిపోతుందనీ అంటారు. అందువల్లే, ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు పురుషకార్యాన్ని బలపరచాలంటారు. వాళ్ళని అసలు కర్మకి మూలమేమిటని అడిగితే, “చెట్టుముందా, విత్తుముందా” అని అడగడం వలంటే అదీను. నిష్ప్రయోజనమని అంటారు.



ఇట్లాంటి వాదనలేవీ అంతిమ సత్యాన్ని కనుగొనలేవు. అందువల్లనే, ఆరంభంలోనే, నీవెవరివో తెలుసుకొమ్మని చెప్పాను. “ఎవరిని నేను. ఈ జన్మదోషం నాకెట్లా కలిగింది” అని ప్రశ్నించుకుంటే అహంకారం సమసిపోతుంది. ఆత్మ సాక్షాత్కారమవుతుంది. ఈ విచారణని సరిగ్గా చేస్తే “దోష” మనే భావం పోతుంది. శాంతం కలుగుతుంది. కలగటమేమిటి? తానుగా ఆత్మ ఉంటుంది.

“కర్మగా, కర్మలనాచరించే నేనెవరిని” అని విచారణ చేసికొని, తన గురించిన యథార్థాన్ని తెలుసుకోవాలి. కర్మ యొక్క సారాంశమదే. విచారణ వల్ల కర్మలని ఆచరించే అహంకారాన్ని ధ్వంసం చేయకపోతే, కర్మ యోగానికి ఫలితమైన పరమానందం లభించదు.

“నేను చేస్తున్నా”ను అనే భావమున్నంత వరకూ మంచి పనులకైనా, చెడుపనులకైనా ఫలితాలని అనుభవించాల్సిందే. ఒక పనితో మరొక పనిని ఎట్లా ముడిపెట్టటం? “నేను చేస్తున్నా”నే భావం లేకపోతే మనిషిపై ఏ ప్రభావమూ ఉండదు. ఆత్మ సాక్షాత్కారమయితేనే గాని “నేను చేస్తున్నా” ననే భావం పోదు. ఆత్మ సాక్షాత్కారమైన వానికి జపమవసరమేమిటి? తపస్సు అవసరమేమిటి? ప్రారబ్ధబలం వల్ల జీవితం కొనసాగి పోతుంది. కాని ఆత్మ సాక్షాత్కారం పొందినవాడు దేనినీ కోరడు. ప్రారబ్ధకర్మ మూడు రకాలు. ఇచ్ఛ, అనిచ్ఛ, పరేచ్ఛ అని – అంటే స్వయంగా కోరుకున్నది, కోరిక లేనిది, ఇతరుల కోరిక వల్లనయేది.

ఆత్మ సాక్షాత్కారమైన వానికి ఇచ్ఛా ప్రారబ్ధముండదు. కాని మిగిలిన రెండూ ఉంటాయి. జ్ఞాని ఏమి చేసినా, ఇతరుల కోసమే. ఇతరుల కోసమేదైనా చేయవలసి వస్తే చేస్తాడు. కాని ఫలితాలు అతనినేమీ ప్రభావితం చేయవు. జ్ఞాని చేసిన పనులకు పుణ్యము గాని, పాపంగాని అంటవు. జ్ఞాని ఏమి చేసిన లోకం దృష్టిలో ప్రామాణికము, ఉచితమూ అయినదే చేస్తాడు.

ఈ జన్మలో తమ ప్రారబ్ధం ప్రకారం కొన్ని అనుభవించి తీరాలి అని తెలిసిన వాళ్ళు – ఆ అనుభవాల వల్ల ఏ వ్యాకులపాటునూ చెందరు. నీ సంకల్పమున్నా, లేకపోయినా, నీవనుభవించాల్సింది నీ మీద తప్పకుండా పడుతుంది. దీనిని గ్రహించు.

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# దిన పత్రికలలో సాహిత్య విమర్శ (1990-2010)

**మహేందర్ జి.** ప్రభుత్వ తెలుగు అధ్యాపకులు, ములుగు.
ఫోన్ : 9908161151

తెలుగు సాహిత్య వికాసానికి దినపత్రికలు చేసిన సేవ ప్రశంసనీయమైంది. సాహిత్య వ్యాప్తి కోసమే ప్రత్యేకంగా వెలువడ్డ పత్రికలు కన్నా దినపత్రికలు సాహిత్యాంశాలను అధిక సంఖ్యాకులైన సాహిత్య ప్రియులకు అందించే అవకాశం ఉంది. దిన పత్రికల్లో ప్రచురితమైన సాహిత్యం గురించి పరిశోధనలు జరిగినప్పటికి ప్రత్యేకంగా పత్రికల్లో ప్రచురితమైన విమర్శ గురించి పరిశోధన జరగలేదు. దిన పత్రికల్లో ప్రచురితమైన సాహిత్య విమర్శను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది అనే ఉద్దేశ్యంతో **"తెలుగు దినపత్రికలలో సాహిత్య విమర్శ(1990-2010)"** అంశాన్ని పరిశోధనకు ఎన్నుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ లో ఆచార్య ననుమాస స్వామి గారి పర్యవేక్షణలో నేను పరిశోధన చేస్తున్నాను. అధ్యయన సౌలభ్యం కోసం పరిశోధనాంశాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించుకున్నాను.

మొదటి అధ్యాయం పరిశోధనాంశం - పరిచయం లో పరిశోధనాంశం పరిచయం చేయడంతో పాటు పరిశోధన ఉద్దేశాన్ని, పరిశోధన పరిమితిని, ప్రయోజనాన్ని వివరించాను. అలాగే పరిశోధన అంశానికి సంబంధించి పూర్వ పరిశోధనను కూడా సమీక్షించాను. దినపత్రికల సాహిత్యానుబంధాల్లో వచ్చిన సాహిత్య విమర్శను పరిశీలించటం నా పరిశోధన ఉద్దేశ్యం. పరిశోధనకు 1990 - 2010 మధ్య రెండు దశాబ్దాల కాలాన్ని కాల పరిమితిగా విధించు కున్నాను. 1990 - 2010 మధ్య కాలంలో దినపత్రికల సాహిత్యానుబంధాల్లో ప్రచురితమైన విమర్శ రచనలను మాత్రమే పరిశీలించటం నా పరిశోధనపరిమితి. ఈ పరిశోధన కోసం ఆంధ్ర పత్రిక, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, వార్త, ప్రజాశక్తి, విశాలాంధ్ర, సూర్య, సాక్షి దినపత్రికల సాహిత్యపేజీల్లోను, ఆదివారం సాహిత్యానుబంధాల్లోను ప్రచురితమైన సాహిత్య విమర్శను పరిశీలించాను. రెండు దశాబ్దాల్లో పత్రికల్లో వచ్చిన విమర్శను పరిశీలించటం ద్వారా సాహిత్య విమర్శలో వస్తున్న ధోరణులను, సాహిత్య విమర్శకు అందించిన నూతన సిద్ధాంతాలను తెలుసుకోవచ్చు. పూర్వ పరిశోధన పరిశీలనలో భాగంగా తెలుగు పత్రికలలో సాహిత్య ఈ అంశాలకు సంబంధించిన పరిశోధన, తెలుగు సాహిత్య విమర్శ పై జరిగిన పరిశోధనలను కూడా సమీక్షించాను.

**"తెలుగు దినపత్రికలు - సాహిత్యానుబంధాలు"** అనే రెండవ అధ్యాయములో వివిధ దినపత్రికల సాహిత్య అనుబంధ పేజీలను, ఆదివారం అనుబంధం పేజీలను, ప్రత్యేక సందర్భాలలో ప్రచురించే సాహిత్య అనుబంధ సంచికలను విశ్లేషించాను. ఆంధ్ర పత్రిక 'సాహితీ' పేరుతో ఉదయం దినపత్రిక ' సాహిత్యం', 'వీక్షణం','రసన' శీర్షికలతో తమ సాహిత్య అనుబంధ పేజీలను నిర్వహించాయి. ఆంధ్రభూమి దినపత్రిక 'అక్షరం','సాహితీ' శీర్షికలతోను, ఆంధ్రప్రభ దినపత్రిక 'సాహితీగవాక్షం' శీర్షికతో సాహిత్య అనుబంధ పేజీలను నిర్వహిస్తున్నాయి. ఆంధ్రజ్యోతి దినపత్రిక 'సాహిత్య వేదిక', 'వివిధ' శీర్షికలతో సాహిత్య అనుబంధ పేజీలను ప్రచురించింది. ప్రజాశక్తి దినపత్రిక సాహిత్యం, కళలు-సాహిత్యం, 'సవ్వడి' శీర్షికలతో, విశాలాంధ్ర దినపత్రిక 'విశాలాంధ్ర సాహిత్యానుబంధం' శీర్షికతో సాహిత్య పేజీలను ప్రచురిస్తున్నాయి. వార్త దినపత్రిక 'కళ', 'రచన' 'కావ్య' 'సృష్టి' శీర్షికలతో సాహిత్య అనుబంధ పేజీలను ప్రచురించింది. సూర్య దినపత్రిక 'అక్షరం' శీర్షికతో, సాక్షి దినపత్రిక 'సాహిత్యం' శీర్షికతో సాహిత్య అనుబంధ పేజీలను ప్రచురిస్తున్నాయి. ఆంధ్ర పత్రిక తన ఆదివారం అనుబంధాన్ని 'ఆదివారం ఆంధ్రపత్రిక','ఆదివారం ఆహ్లాద వేదిక' పేర్లతో ఉదయం దినపత్రిక 'ఆదివారం ఉదయం' పేరుతో, ఆంధ్రభూమి దినపత్రిక 'ఆదివారం ఆంధ్రభూమి' శీర్షికతో , ఆంధ్రప్రభ దినపత్రిక 'ఆంధ్రప్రభ ఆదిత్య హృదయం' శీర్షికతో, ప్రజాశక్తి దినపత్రిక 'సోపతి' అనే పేరుతో, విశాలాంధ్ర దినపత్రిక 'విశాలాంధ్ర ఆదివారం' శీర్షికతో, వార్త దినపత్రిక 'వార్త ఆదివారం 'శీర్షికతో, సూర్య దినపత్రిక 'సూర్య ఆదివారం' శీర్షికతో, సాక్షి దినపత్రిక 'ఫన్ డే' శీర్షికతోనూ ఆదివారం అనుబంధాలను ప్రచురిస్తున్నాయి. దిన పత్రికలు ఉగాది, దసరా, దీపావళి మొదలైన పర్వదినాలను పురస్కరించుకుని, మహా సభలను పురస్కరించుకుని ప్రత్యేక సంచికలను వెలువరిస్తూ ఉంటాయి. అలాగే ఆయా దినపత్రికల ప్రారంభోత్సవ సందర్భాలు, రజతోత్సవాలు, స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక సంచికలు విడుదల చేస్తాయి.

**"తెలుగు దినపత్రికలలో సాహిత్య విమర్శ రూపాలు"** మూడో అధ్యాయంలో దిన పత్రికలలో వివిధ రూపాలలో ప్రచురితమవుతున్న సాహిత్య విమర్శ రూపాలను విశ్లేషించాను. దిన పత్రికల్లో వ్యాసాలు, ఇంటర్వ్యూలు, సాహిత్య లేఖలు, గ్రంథ సమీక్షలు, చర్చలు, లేఖలు, సంపాదకీయాలు, సాహిత్య ప్రసంగాలు, పీఠికా పరిచయాలు మొదలైన రూపాల్లో సాహిత్య విమర్శ వెలువడ్తున్నది. సాహిత్య విమర్శను వెలయించడానికి తెలుగులో శక్తివంతమైన ప్రక్రియ వ్యాసం. ఈ రెండు దశాబ్దాల కాలంలో విమర్శకులు దినపత్రికల్లో వెలువరించిన సాహిత్య వ్యాసాలను విశ్లేషించాను. సమకాలీన సాహిత్య ధోరణులపై, రచనలపై ఒక చర్చను కొనసాగించడానికి కావాల్సిన సామాగ్రిని వివిధ పత్రికలలో ప్రచురితమౌతున్న సాహిత్య

ఇంటర్వ్యూలు అందిస్తున్నాయి. 1990 తర్వాత దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో చర్చలు, వాదోపవాదాలు ప్రధానంగా అస్తిత్వవాద సాహిత్యం చుట్టూ తిరిగాయి. సాహిత్యంలో నూతనంగా వచ్చిన స్త్రీవాద, దళితవాద, ప్రపంచీకరణ, మైనార్టీ, ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్యంలోని అనేక అంశాలు చర్చకు వచ్చాయి. అంతకు ముందు వారాల్లో ప్రచురితమైన వ్యాసం, చర్చ, ఇంటర్వ్యూలో వ్యక్తీకరించిన అంశాలను సమర్థిస్తూనో, వ్యతిరేకిస్తూనో సాహిత్యకారులు దినపత్రికలకు లేఖలు రాస్తుంటారు. తెలుగు దినపత్రికలు సమకాలీన రచనలను ప్రోత్సహించడానికి గ్రంథసమీక్షలకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తూ ప్రత్యేక శీర్షికలు కూడా నిర్వహించాయి. కేవలం రచనా వివరాలు మాత్రమే కాకుండా విశ్లేషణలు కూడా గ్రంథసమీక్షల్లో కనిపిస్తాయి. ఆంధ్రభూమి దినపత్రిక పుస్తక సమీక్ష కోసం 'కితాబు' అనే పేజీని, ఆంధ్రప్రభ దినపత్రిక పుస్తక సమీక్ష కోసం 'తూలిక' అనే పేరుతో, వార్త దినపత్రిక 'కావ్య' పేరుతో ప్రత్యేక గ్రంథ సమీక్ష పేజీని నిర్వహించాయి. సంపాదకీయం పత్రిక యాజమాన్యం తరపున ముద్రించబడే వ్యాసం. సాధారణంగా ఒక రచనకి సంబంధించి, పత్రికగా తాను సృజనకారుల పైన, రచనలపైన, ధోరణులు, వాదాల పైన ఏర్పరుచుకున్న అభిప్రాయాన్ని ఏదో ఒక ప్రత్యేక సందర్భంలో పత్రిక సంపాదకీయ రూపంలో వెలువరిస్తుంది. పత్రికా సంపాదకులు డా. ఎబికె ప్రసాద్ గారు దిన పత్రికలో ప్రతి ఆదివారం సాహిత్య సంపాదకీయాన్ని రాశారు. గ్రంథాన్ని, రచనలు ఆవిష్కరణ జరుగుతున్న సందర్భంలో రచయితను, ప్రోత్సహించడానికి, సమర్థించడానికి పీఠికలను దినపత్రికలు సాహిత్య పేజీల్లో ప్రచురిస్తాయి. సాహిత్య సమావేశాల్లో రచయితలపై, రచనలపై వక్తలు విశేషించి మాట్లాడుతుంటారు. ఈ ప్రసంగం లిఖిత ప్రతి ఆధారంగా జరిగింది అయినా సహజంగా మాట్లాడినా దానిని తిరిగి లిఖితంగా మార్చి ఆయా ప్రత్యేక సందర్భాల్లో పత్రికలు ప్రచురిస్తాయి. రచయితలు పత్రికకు వారం వారమో, పక్షమో, మాసానికి క్రమం తప్పకుండా ఒకే మకుటంతో రాసే వ్యాసాన్ని ప్రత్యేక శీర్షిక కాలమ్ అంటారు. ఇట్లా సాహిత్య శీర్షికల్లో (కాలమ్) సాహిత్య విమర్శ కూడా చోటు చేసుకుంటుంది.

**"తెలుగు దినపత్రికల్లో సాహిత్య విమర్శ రీతులు"** అనే నాలుగవ అధ్యాయంలో సాహిత్య విమర్శ స్వభావాన్ని బట్టి విమర్శ రీతులైన గ్రంథ పరిష్కార విమర్శ, కవి జీవిత విమర్శ, మార్క్సిస్టు విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ, శైలీశాస్త్ర విమర్శ, తులనాత్మక విమర్శ, ప్రక్రియా విమర్శ రీతులలో వచ్చిన విమర్శ రూపాలను విశ్లేషించాను. సాహిత్య విమర్శకు ఆధారమైంది పరిష్కృత కావ్యం లేదా సాహిత్య గ్రంథం. సాహిత్య గ్రంథం మూల ప్రతిని నిర్ణయించటం, శుద్ధ ప్రతిని రూపొందించడం, గ్రంథ పరిష్కరణ విమర్శ లక్ష్యం. రచనకు గల మూలాలను, ఆకరాలను అన్వేషించడం, కాల నిర్ణయం చేయడం, గ్రంథ పరిష్కారం చేయడం ఈ విమర్శలో కనబడే అంశాలు. కవి జీవితానికి కావ్య రచనకు ఉన్న సంబంధాన్ని పరిశీలించి ఈ రెండింటి సమన్వయంతో సాహిత్యాన్ని విమర్శించటం కవి జీవిత విమర్శ. ఈ విమర్శనే కవి జీవిత లేదా కావ్య సమన్వయ విమర్శ అంటారు. మనస్తత్వశాస్త్రం సిద్ధాంతాలను సాహిత్యానికి అన్వయింపజేసే అనుశీలన విధానం మనోవైజ్ఞానిక విమర్శ. ఇది రచయిత మనస్తత్త్వ అధ్యయనం, రచనా నిర్మాణ క్రమ అధ్యయనం, సాహిత్యేతివృత్తాల అధ్యయనం అనే అంశాల ఆధారంగా కొనసాగుతుంది. ఒక సాహిత్య రచనను చారిత్రక దృష్టితో పరిశీలించటాన్ని చారిత్రక విమర్శ అంటారు. ఏ రచననైనా ఒక చారిత్రక దస్తావేజుగా చారిత్రక విమర్శకులు పరిగణిస్తారు. సమకాలీన మత సాంఘిక, రాజకీయ పరిస్థితులు కావ్య రచనకు ఏ విధంగా దోహదం చేశాయో , ఆ కాలం నాటి పరిస్థితులు కావ్యంలో ఎలా ప్రతిఫలించాయో చారిత్రక విమర్శ వివరిస్తుంది. సాహిత్యాన్ని గతి తార్కిక, భౌతికవాద దృష్టితో పరిశీలించే విమర్శా విధానం మార్క్సిస్టు విమర్శ. మార్క్సు, ఏంగెల్సు ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఈ విమర్శ రీతికి ఆధారం. ఒక రచనను భాషా శాస్త్ర పద్ధతిలో విమర్శించే రీతిని శైలీశాస్త్ర విమర్శ అంటారు. సాహిత్య అధ్యయనంలో భాషా శాస్త్ర సూత్రాలను అనువర్తితం చేయడం ద్వారా సాహిత్యాన్ని మూల్యాంకనం చేసే విమర్శా విధానమిది. సాహిత్యంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ రచనల మధ్య గానీ, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ రచయితల మధ్య గానీ పోలికలను, తేడాలను గుర్తించటానికి చేసే పరిశీలన తులనాత్మక విమర్శ. ఒక రచన సృజించబడు తున్నపుడు దాని స్వభావం అది వ్యక్తం చేస్తూ ఉంటుంది. ప్రక్రియా సూత్రాన్ని వినియోగించుకుంటూ సాహిత్య స్వరూప స్వభావాలను విలువలను నిర్ధారించే విమర్శ పద్ధతిని ప్రక్రియా విమర్శ అంటారు.

**"తెలుగు దిన పత్రికలు – సమకాలీన సాహిత్య విమర్శ"** అనే అయిదవ అధ్యాయంలో దినపత్రికలలో ప్రచురితమైన స్త్రీవాద, దళిత వాద, మైనారిటీ, ప్రాంతీయ, బి.సి.అస్తిత్వవాద, పోస్ట్ మాడ్రన్ సాహిత్య విమర్శలను పరిశీలించాను. విమర్శకులు సమకాలీన సాహిత్యంతో పాటు ప్రాచీన ఆధునిక సాహిత్యాలను కూడా స్త్రీవాద, దళిత వాద దృక్పథాలతో పరిశీలిస్తూ వ్యాసాలు రచించారు. స్త్రీ సాహిత్యం పై వచ్చిన విమర్శలో స్త్రీవాద భావాలు, స్వేచ్ఛ, కవిత్వ భాష, ఏది స్త్రీవాద సాహిత్యం? ఎవరు స్త్రీవాద విమర్శ చేయాలి? స్త్రీవాద సాహిత్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? మొదలైనవి ప్రధాన అంశాలుగా ఉన్నాయి. దళిత అలంకార శాస్త్రం, ఎవరు దళితులు? ఏది దళిత సాహిత్యం? దళిత సాహిత్యానికి విమర్శకు తాత్త్విక భూమిక ఏమిటి? మాదిగ దండోరా సాహిత్యం, అభివ్యక్తి విధానం, పురాణ ప్రతీకలు, కవిత్వభాష, దళిత పాట మొదలైన అంశాలను ఆధారంగా చేసుకుని దళిత సాహిత్య విమర్శ వచ్చింది. 1990 తర్వాత

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు సమాజంపై చూపిన ప్రభావాన్ని,సమాజంలో వస్తున్న పరిణామాలను చిత్రీకరిస్తూ ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం వెలువడింది. ఈ సాహిత్యాన్ని అనుశీలిస్తూ పత్రికల్లో విమర్శ కొనసాగింది. గ్లోబల్ సందర్భంలో పూర్వ సాహిత్యాన్ని, పూర్వపు కవులను పునర్మూల్యాంకనం చేస్తూ విమర్శలు వచ్చాయి. ప్రపంచీకరణకు సరైన సమాధానం స్థానికత అనే స్పృహతో తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలనుంచి ప్రత్యేక సాహిత్యం వచ్చింది. విమర్శ ప్రక్రియకు సంబంధించి ప్రాంతీయ చైతన్యంతో సాహిత్యాన్ని పునర్విశ్లేషించాలనే ధోరణి పెరిగింది. సాహిత్య సాంస్కృతిక రంగంలో వాడుతున్న భాష, సాహిత్యంలో మాండలిక ప్రయోగం, ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యాన్ని అంచనా వేసే ప్రమాణాలు, తెలంగాణ కవులకు తెలుగు సాహిత్యంలో ప్రాధాన్యం లేకపోవడం మొదలైన అంశాల ఆధారంగా సాహిత్య విమర్శ కొనసాగింది. కథ, కవిత్వ ప్రక్రియలకు ప్రత్యేకంగా ప్రచురితమౌతున్న సాహిత్య సంకలనాలపై కూడా విమర్శ వచ్చింది. సమాజంలో స్త్రీలు, దళితుల వలే ముస్లింలు, బి.సిలు కూడా అన్యాయాలకు గురవుతున్నారన్న అభిప్రాయంతో మైనార్టీ సాహిత్యం, బి.సి.అస్తిత్వవాద సాహిత్యాలు వచ్చాయి. ఈ సాహిత్యంపై వచ్చిన విమర్శ సాహిత్యంలో మైనార్టీ కవిత్వ నేపథ్యం, అభివ్యక్తి, భాష, మైనార్టీ స్త్రీల ప్రత్యేక అస్తిత్వం మొదలైన విషయాలు విమర్శలో చోటుచేసుకున్నాయి. ఇస్లాంవాదమా? ముస్లింవాదమా? అనే ప్రశ్నలతో పత్రికల్లో చర్చలు కొనసాగాయి. తెలుగు సాహిత్యంలో ఆధునికత ముగిసిందా? అత్యాధునికత ప్రారంభమైందా? అనే ప్రశ్నలతో పోస్ట్ మాడ్రన్ సాహిత్య విమర్శ ప్రారంభమైంది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని అత్యాధునిక దృక్పథంతో పరిశీలిస్తూ విమర్శలు వచ్చాయి.

**"తెలుగు దినపత్రికలు – సాహిత్య విమర్శ అభివృద్ధి వికాసాలు"** అనే ఆరవ అధ్యాయంలో 1990–2010 మధ్య కాలంలో దినపత్రికల్లో సాహిత్య విమర్శ పరిణామాన్ని విశ్లేషించాను. ఈ రెండు దశాబ్దాల్లో కొనసాగిన విమర్శలో రెండు దశలు కనిపిస్తాయి. 1990 దశకంలో ఎక్కువగా విమర్శ స్త్రీ వాద, దళిత వాద సాహిత్య విమర్శలపై ఎక్కువగా విమర్శ వచ్చింది. 2000 దశకంలో స్త్రీవాద సాహిత్యంలో మైనారిటీ, దళిత మహిళల ప్రత్యేక సాహిత్యంపై విమర్శతో పాటు ప్రపంచీకరణ, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వవాద, బి.సి.అస్తిత్వ వాద సాహిత్యాలపై ఎక్కువగా విమర్శ కొనసాగింది. ప్రధానంగా వ్యాస రూపంలో సాహిత్య విమర్శ ఎక్కువగా కొనసాగింది. గ్రంథ సమీక్షలు ఎక్కువ పరిచయాత్మకంగానే కొనసాగినప్పటికీ విశ్లేషణాత్మకంగా కొనసాగిన సమీక్షలు కూడా ఉన్నాయి. తెలుగు సాహిత్యం పైనే కాక ఆంగ్ల, ఇతర భారతీయ భాష సాహిత్యాలపై కూడా వ్యాసాలు ప్రచురించబడ్డాయి. ఒకే అంశంపై విస్తృతంగా చర్చలు కొనసాగాయి. ఒకే రచయితతో ప్రత్యేక సాహిత్య శీర్షికలు (కాలమ్) కొనసాగాయి. నూతన సాహిత్య విమర్శకులకు పత్రికలు అవకాశం కల్పించాయి. దిన పత్రికల సాహిత్య విమర్శలో సమకాలీన సాహిత్య చర్చలకే ఎక్కువ ప్రాధాన్యత కనిపించినప్పటికి ఆధునిక, ప్రాచీన సాహిత్య రచనలపై కూడా విమర్శ కొనసాగింది. సమకాలీన, ఆధునిక దృక్పథం నుండి కూడా ప్రాచీన సాహిత్యాన్ని విమర్శిస్తూ విమర్శ కొనసాగింది. కేవలం సృజన రచనలపైనే కాక సాహిత్య విమర్శపై కూడా వ్యాసాలు వచ్చాయి. ఒక్కో రచయిత పైనో, ఒక్కో రచనపై విమర్శలతో పాటు సాహిత్య వాదాలపై చర్చలు, వ్యాసాలు కొనసాగాయి. 1990 – 2010 మధ్య కాలంలో సాహిత్యంలోను, విమర్శలోను వచ్చిన పరిణామాల్ని పత్రికల్లో వచ్చిన సాహిత్య విమర్శ ప్రతిబింబించింది. నూతనంగా వచ్చే సాహిత్యాన్ని అర్థం చేసుకోవటానికి, పూర్వ సాహిత్యాన్ని నూతనంగా అర్థం చేసుకోవడానికి పత్రికల్లో వచ్చిన సాహిత్య విమర్శ దోహదపడింది. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దటానికి సాహిత్యం దోహద పడితే ఆ సాహిత్యాన్ని మూల్యాంకనం చేస్తూ మంచి సాహిత్యం రావడానికి దోహదం చేసే సాహిత్య విమర్శ ప్రయోజనాన్ని 1990 – 2010 మధ్య కాలంలో దిన పత్రికల్లో ప్రచురితమైన విమర్శ నెరవేర్చిందని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. చెన్నయ్య, జె. తెలుగు దిన పత్రికలు భాషా, సాహిత్య స్వరూపం. ప్రథమ ముద్రణ.,రవికిరణ్ పబ్లికేషన్స్ , హైదరాబాద్, 1998.
2. రామచంద్ర, తిరుమల తెలుగు పత్రికలు సాహిత్య సేవ. ప్రథమ ముద్రణ., హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1992.
3. మందేశ్వర రావు, వడలి. అనుశీలన సాహిత్య విమర్శ. తెలుగు అకాడమి, హైదారాబాద్, 2001.
4. యాకూబ్. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ. నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ , హైదారాబాద్, 2018.
5. రామదాస్, కె. తెలుగు దినపత్రికల్లో సాహిత్యం 1970 – 90. మొదటి ముద్రణ ., బిగ్ ఫైవ్ పబ్లిషర్స్ , హైదరాబాద్, 2001.
6. రామారావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు. పసిడి ప్రచురణలు, హైదరాబాద్, 2007.
7. లక్ష్మణ చక్రవర్తి , సి.హెచ్. మరియు సంపత్కుమారాచార్య కోవెల, (సం). తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదారాబాద్, 2016.
8. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. మరియు పి. వారిజా రాణి, (సం). ఆధునిక సాహిత్య విమర్శ రీతులు. ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, హైదారాబాద్, 2004.
9. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. విమర్శ శిల్పం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదారాబాద్, 2002.

# మూసీ పదవినోదం - 33

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 3 ర్తి | 4 | 6 మా | 8 | ము | X | 11 |
| 2 రం | | ల | | ల | X | 10 | ర |
| 5 | వం | X | 7 | కు | 14 | ము | X |
| ట్లు | | X | X | 9 లు | | సా | 19 |
| X | 12 | 14 వ | 16 | X | ల | X | కా |
| 18 | X | 15 | ద | 21 | X | 20 గూ | |
| 17 వి | | ధ | X | 22 | 23 చె | X | దీ |
| 13 | ప | | ప | X | 24 | తి | X |

**ఆధారాలు (అడ్డం)**

1. కృత్తికా నక్షత్రముతో కూడిన పౌర్ణమి కలిగిన మాసము (6)
2. బి. నరసింగరావు, రూప, సాయిచంద్, గద్దర్ ముఖ్యపాత్రలు పోషించిన 1983లో వచ్చి సినిమా (6)
5. వంగదీయటం అనే అర్థం వచ్చే క్రియ వంగిపోయింది (2)
7. నిమ్మపండు లేదా కమ్మరేగు పండు (4)
9. కోస్తా తెలంగాణ ప్రాంతాలలో నష్టం, శ్రమ అనే అర్థాలలో ఈ పదాన్ని వాడుతుంటారు (4)
10. సమానము (2)
12. యవనదేశపు స్త్రీ, తెర (3)
13. లొల్లి, గొడవ (4)
15. చక్కని ఆడుది (3)
17. అనేక విధములు కలది (3)
20. తెలంగాణములో గుంజును ఇలా అంటారు (2)
22. ఆవరణముగా పెట్టిన కంప (2)
24. మన్మథుని భార్య (2)

**ఆధారాలు (నిలువు)**

1. తెలంగాణం, రాయలసీమ ప్రాంతాలలో వీటిని చక్కిలాలు, జంతికలు అంటారు (4)
3. రెండు, మూడేసి గుత్తిగా కాసే వంకాయ రకము గుర్తితో కలిసి వరుస తప్పింది (5)
4. ఆమె మొకమ్మీద... ఇది ఉందని తెలంగాణములో వాడుక. స్వప్నం అని కూడా ఇంకొక అర్థం (2)
6. ఇంద్రసారథి (3)
8. అదృష్టంతో కూడినవారు వీరని రావిశాస్త్రి తన బుక్కులలో చెప్పారు (4)
10. మూడు కోణాల ఆకారంలో ఉండే ఈ మూడు అక్షరాల చిరుతిండిని కొరకటం వలన కొంచెం రూపం మారింది (3)
11. కొంటావా? కొనవా? ఈ మధ్య బాగా వ్యాప్తి అయిన ధాన్యము (2)
14. భూమి, స్త్రీ (4)
16. విషం (2)
18. ముసలివాడు (3)
19. పోలీసులు చేయు తనిఖీ (4)
21. భావమునందు వచ్చెడు ఒకానొక ప్రత్యయము (2)
23. కారాగృహము (2)

(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)

నిర్వహణ

**డా. తాడేపల్లి పతంజలి**

ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

ఫోన్ : 98666 91587



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

(ప్రపంచ పదులు
– డా. సి. నారాయణ రెడ్డి)

మూసీ సాహిత్యధార
పుస్తక సమీక్ష

# కోలాహలం లక్ష్మణ రాజు కథలు

**పగిడోజు యాకానంద చారి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 85230 98627

నవలా రచయితగా, కథారచయితగా, ఖండకావ్య కర్తగా, ఉద్యమ కారుడిగా పేరుగాంచిన కోలాహలం లక్ష్మణరాజు కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు మండంలోని అనిగెండ్లపాడు గ్రామంలో 09-07-1920న మహాలక్ష్మమ్మ, నారాయణరాజు దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య అనిగెండ్లపాడులో జరిగింది. ప్రాథమికోన్నత విద్యకోసం పెనుగంచిప్రోలు వరకు (6.5 కి.మీ) కాలి నడకన వెళ్ళి విద్యనభ్యసించారు. చిన్న వయసులోనే మేనత్త కూతురుతో వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య మనస్పర్థలు మొదలై విడిపోయారు. ఆ తర్వాత లక్ష్మణరాజు అక్క కూతురైన వెంకటసుబ్బమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగసంతానం, ఇద్దరు ఆడసంతానం కలరు. లక్ష్మణరాజు సాహిత్య సుధాకర పరీక్షలో ఉత్తీర్ణుడై ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి నల్లగొండ జిల్లా వాడపల్లి గ్రామంలో హిందీ ఉపాధ్యాయునిగా బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలం ఉపాధ్యాయ వృత్తి నిర్వర్తించారు. సంఘసంస్కరణ మీద ఉన్న అభిలాషతో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా ఇచ్చారు. ప్రజలకంకితం కావాలనే ఉద్దేశ్యంతో ముందే నేర్చుకున్న వైద్యవృత్తిని కొనసాగించారు.

ఉద్యోగ నిమిత్తమై వాడపల్లికి వచ్చిన లక్ష్మణరాజు ఉద్యోగ రాజీనామా తర్వాత కూడా వాడపల్లిలోనే ఉంటూ వైద్యవృత్తి కొనసాగించారు. కొన్ని రోజులు వాడపల్లిలోనూ, ఆ తర్వాత రామన్నపేటలోనూ, ఆ తర్వాత హుజుర్‌నగర్‌లోనూ చివరకు మిర్యాలగూడలో తన వైద్య వృత్తిని కొనసాగించారు. పుట్టింది ఆంధ్ర ప్రాంతమైనప్పటికీ ఉద్యోగం, వృత్తి జీవితాంతం నల్లగొండ జిల్లాలోనే కొనసాగింది. జాతీయోద్యమంలోనూ, తొలిదశ తెలంగాణోద్యమంలోనూ పాల్గొన్నారు. వృత్తివైద్యం అయినప్పటికీ తెలుగు సాహిత్యంపై మక్కువతో కావ్యాలు, ప్రబంధాలు, నవలలు, కథలు చదివేవారు. ఆ సాహిత్య అభిలాషే తర్వాత కాలంలో రచయితగా నిలబడడానికి దోహదపడింది. లక్ష్మణరాజు నాలుగు ప్రక్రియలలో సాహిత్య కృషి చేశారు.

1. ఖండకావ్యం 2. కథాసంపుటి 3.నవలలు 4. వ్యాసాలు

లక్ష్మణరాజు తన పదిహేనవ యేటనే ఛందోబద్ధ పద్య రచన ప్రారంభించినట్లుగా కొన్ని సభల్లో ఆశువుగా పద్యాలు చెప్పినట్లుగా తెలుస్తుంది. 33 ఖండికలతో హెచ్చుతగ్గులు ఖండకావ్యాన్ని రూపొందించారు. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ తిరునాళ్ళ సందర్భంగా జీవహింసను అధిక్షేపిస్తూ 'అహింస' అనే ఖండికలోని పద్యాలను ఆశువుగా చెప్పారు. అందుకు మెచ్చిన జీవదయా జ్ఞాన ప్రచార సంఘంవారు లక్ష్మణరాజుకు 'సహజకవి' అనే బిరుదును ప్రదానం చేశారు.

లక్ష్మణరాజు ఎక్కువగా నవలా సాహిత్యంపైనే కృషి చేశారు. 23 నవలలు రాశారు. నెలకు ఒక నవల చొప్పున తీసుకురావాలనే సంకల్పంతోనూ కొన్ని నవలలు రాశారు. తన 50 - 55 సంవత్సరాల వయసులో నవల రచన ప్రారంభించారు. జీవితాలను ప్రతిబింబించే నవలలు రాశారు. స్థానిక సాహిత్య సంఘాల తరపున తుర్లపాటి కుటుంబరావు లక్ష్మణరాజుకి 'నవలా కళానిధి' అనే బిరదును ప్రదానం చేశారు. లక్ష్మణరాజు 'వంకాయ వెంకటలక్ష్మి' అనే మారుపేరుతో ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలకు వ్యాసాలు రాసినట్లు తెలుస్తున్నా అవి అలభ్యంగా ఉన్నవి.

లక్ష్మణరాజు నవలా రచనలోనే కాక కథానికా రచనలో కూడా అందెవేసిన చేయి. మారుతున్నటువంటి కాలంలో మంచి విలువలకు ప్రాధాన్యత నిచ్చి వాటి సంరక్షణ కోసం తన సాహిత్యాన్ని అడ్డుపెట్టి పోరాడిన మహోన్నత వ్యక్తి. 'ప్రేమభిక్ష' అనే పేరుతో ఒకే ఒక కథాసంపుటిని రాశారు. ఈ కథా సంపుటిలో పందొమ్మిది కథలు సమాజ శ్రేయస్సును కాపాడే విధంగా ఉన్నాయి. దేశానికి ఏదైనా ప్రయోజనం సిద్ధించాలనే లక్ష్యంతో రచనలు సాగించారు. తన సొంత కథలు కాకపోయినప్పటికీ తను చిన్నప్పుడు విన్న కథలను, కాలానికి అనుగుణంగా ఉన్న కథలను ఐదింటిని 'ఇది నా కథ కాదు' పేరుతో ఇందులో చేర్చారు. ఈ కథాసంపుటిలోని కథలను నాలుగు రకాలుగా చూడవచ్చు.

1. ప్రేమ 2. దళిత 3. సామాజిక 4. సందేశాత్మక కథలు

ఆనాటి సమాజానికి, వర్తమాన కాలానికి, భవిష్యత్ సమాజానికి కూడా స్ఫూర్తినిచ్చే విధంగా ఈ కథాసంపుటిలోని కథలు ఉన్నాయి.స్త్రీ, పురుష సంబంధాలు ధనిక, పేదల ఆర్థిక స్థితిగతులు, బంధాలు, బాంధవ్యాలు మొదలైన ప్రేమకథలు ఏడింటిని ఈ కథా సంపుటిలో చెప్పారు. మానవ సంబంధాలను రకరకాలుగా చిత్రీకరించారు. మధ్య తరగతి వారి ఆర్థిక స్థితి అంతంత మాత్రమే ఉంటుంది. వారి స్థితిగతులకు అనుగుణంగా జీవనాన్ని గడిపే విధానం ఎలా ఉంటుందనేది కొన్ని కథల్లో చూస్తాం. విలాస జీవితానికి అలవాటు పడిన ఉన్నత తరగతి కుటుంబాల్లోని యువతీయువకుల మనస్తత్వాలు, పేదవారి ప్రేమలు లక్ష్మణరాజు కథానికలను పరిశీలిస్తే అవగతమవుతుంది. మొదటినుండి అస్పృశ్యులుగా, అంటరానివారిగా సామాజికంగా అణచివేయబడుతూ, సమాజంలో అణగారినవారిగా

పరిగణింపబడుతూ, సాంఘిక దోపిడికి గురౌతూ, ఎప్పటికప్పుడూ ఆర్థిక పీడనతో సతమతమవుతూ, సామాజిక, రాజకీయ, అసమానతలకు గురౌతూ హిందువుల్లో కొందరు దళితులుగా పరిగణింపబడుతున్నారు. వేలయేండ్లుగా ఊరికి దూరంగా ఉండి తమ ఉనికిని కోల్పోయిన వాళ్ళూ, సభ్యసమాజంతో సరైన సంబంధం లేనివాళ్ళూ, నిత్యపీడితులు, నిత్యతాడితులు, కులవ్యవస్థ వేళ్ళూనుకు పోయిన భారతీయ సమాజంలో మొదటినుంచి అవస్థలు పడుతూ వచ్చిన వారు దళితులు. వారి గురించి వారి చైతన్యం గురించే రాసే కథలే దళిత కథలు. జమీందార్లు, దొరలు, భూస్వాములు, అధికారులు బడుగు బలహీనవర్గాలను ఏ విధంగా అణచివేతకు గురిచేశారో పేదల కష్టాన్ని, పేదల హక్కులను ఎలా హరించారో, దళితుల జీవితాన్ని వారి సమస్యలను, సంఘర్షణలను, సామాజిక వివక్షను, సాధికారతను మొదలగు వాటిని వస్తువులుగా తీసుకొని లక్ష్మణరాజు రెండు దళిత కథలను రాశారు. ప్రతిఘటనతో అణగారిన బతుకుల్ని ఆదరించి చైతన్యపరచాలంటే నిరంతర కృషి అవసరమంటారు.

సమకాలీన సమాజ జీవితాన్ని వాస్తవిక దృష్టితో చిత్రించారు. ఆనాటి సమాజంలో తీవ్రంగా నెలకొని ఉన్న బాల్యవివాహాలను, అంటరానితనం, స్త్రీ వివక్ష, నిరంకుశత్వం, కులపక్షపాతం, వెట్టిచాకిరి, దోపిడీ వ్యవస్థ మొదలైన వాటిపై తన ప్రతిఘటనా గళాన్ని వినిపించారు. రచయిత సమాజంలో అంతర్భాగం. స్పందించే హృదయం శిల్ప సంపద రచయితను ఇతరులకన్నా ఉన్నతంగా నిల్చోబెడుతుంది. సమాజంలోని పరిస్థితులు, రైతులు, కార్మికుల స్థితిగతులు, ఆర్థిక వ్యత్యాసాలతో దుర్భరంగా మారుతున్న జీవితాలు, బీటలు వారుతున్న మానవ సంబంధాలు, కులమత భేదాలు, వ్యక్తిగత సంఘర్షణలు, కుట్రకుహన రాజకీయాలు, సంస్కృతి ఇదంతా నేడు మానవుడికి, మానవుడికి మధ్య దూరం చేస్తున్నది. ఇలాంటి జీవితాలలోని అనేక విషయాలను లక్ష్మణరాజు తన కథానికలలో పొందుపరిచారు. సమాజంలో మధ్య తరగతి వారి బతుకులు, నమ్మకాలు, విశ్వాసాలు, కుటుంబ వ్యవస్థను వారి కష్టాలను, కడగండ్లను జీవన పరిస్థితులను ఆరు కథలుగా రాశారు. సమాజానికి అద్దం పట్టినట్లుగా చిత్రిచండం వలన సమాజాన్ని సంస్కరించాలనే తపన రచయితలో కనిపిస్తుంది.

లక్ష్మణరాజు నాలుగు సందేశాత్మక కథలను అందించారు. ప్రజల్లో ఆరంభమైన మార్పు కారణంగా సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పెనుమార్పులు సంభవించాయి. లక్ష్మణరాజు కథలో సామాజిక జీవన చిత్రణకే అధిక ప్రాధాన్యత ఉంటుంది. సమాజ వాస్తవికత పునాదులపై వీరు చిత్రించే కథల్లో ఏదో ఒక సందేశ మందుతూనే ఉంటుంది. వీటినే సందేశాత్మక కథలుగా ఎందుకు భావించాలంటే కథా వస్తువులో మిగతా కథల కంటే వైవిధ్యంగా ఉండి అందించే సమాచారము ఆలోచింపజేసేటట్లు ఉండటమే. ఈ కథలు భిన్న కోణాల్లో సామాజిక జీవన పరిణామాలను చిత్రించినవే. తరతరాలుగా మానవజాతి అభివృద్ధి మార్గంలో నడుస్తూ ఈ జీవన పరిణామక్రమంలో మనిషి క్రమక్రమంగా అనుకరిస్తూ, అనుసరిస్తూ వెళ్తుంటాడు. మనిషి జీవన విధానంలో కొన్ని సదాచారాలు అయితే మరికొన్ని మూఢాచారాలుగా ఉంటాయి. హేతువాద దృష్టితో ఆలోచిస్తూ అభివృద్ధి పథంలో నడిచే విధానమే సందేశాత్మకం.

లక్ష్మణరాజు తన పెద్ద కుమారుడి కూతురైన 'నాగినీదేవి' పేర నాగిని పబ్లికేషన్ మిర్యాలగూడలో స్థాపించి తన రచనలను నాగిని పబ్లికేషన్ ద్వారా ప్రచురించారు.

## వెన్నెలలో కలిసిన పాటల సిరి

ఎవ్వారు నిను బిల్చి రెటకేగి నావయ్య?
సిరివెన్నెలా నీవు త్వరపడుచును?
గాన గంధర్వుడౌ ఘన యశస్కుడు బాలు
కబురంపెనా నీకు? కలము జిలుక!
మించు లొలుకునట్లు పంచె గట్టుట నేర్ప,
నాకమునకు బిల్చెనా సినారె?
నా సఖా! రమ్మని యాసతో వేటూరి,
కనుసైగ జేయగా కదలినావ?
తన ప్రక్క కూర్చుండ దగినవాడవటంచు
కేల్సాచి పిలిచెనా కృష్ణశాస్త్రి!
మనసున్న కవివంచు 'మనసుకవి'యె నిన్ను
పిలిపించుకొన్నాడ? బలిమితోడ!
పొగగ్రక్కు రచనకై సిగరెట్టొకటి యివ్వ
శ్రీశ్రీయె బిల్చెనా శీఘ్రగతిని!
సురలచెంతన నిల్ప సురగురువే బిల్వ
దివికేగినావయ్య? భువిని వీడి
అమృతము లింకగా నమృతకలము నీదె
యనియెంచి బిల్చిరే యమరులంత?
సురగంగ మునుగంగ సొంపారు నీ పాట
తరగలై వినిపింప తరలినావొ?
యేల యీ నేల వీడి, మమ్మేల శోక
వార్ధి మునకల దోలినావయ్య? కలము
లన్ని వర్షించె! నీ స్మృతులన్ని తలచి!
తిరిగి పాళీల ప్రవహించి కురియుమోయి!!

**అవుసుల భానుప్రకాశ్**
**ఫోన్ : 9603204507**

గ్రంథాంతరంగం 07

# ప్రాకృత గ్రంథకర్తలూ ప్రజాసేవానూ


శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

బ్రహ్మశ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు (1888, 90?– 1951) విద్యానగరమైన కాశీలో సంస్కృత కావ్య వ్యాకరణాల్ని పుంభావ సరస్వతుల వద్ద క్షుణ్ణంగా చదివి 'కావ్య వ్యాకరణ తీర్థ' పట్టా పొందిన ప్రగల్భ పండితులు. ఆ మహాభాగుడు 1933లో రాసిన **'ప్రాకృత గ్రంథకర్తలూ ప్రజాసేవానూ'** అనే 100 పేజీలకు మించిన సుదీర్ఘ వ్యాసం పాండిత్య పూర్ణమైన, ఆలోచనాత్మకమైన, సుబోధకమైన, చారిత్రాత్మకమైన రచన. 1933 లో డిసెంబర్ 29వ తేదీన గిడుగు రామమూర్తి పంతులు గారి 70 వ పుట్టిన రోజు సందర్భంగా రాజమండ్రిలో అంగరంగ వైభవంగా జరిగిన సన్మాన సభలో గిడుగువారికి సమర్పింపబడ్డ 'వ్యాససంగ్రహము' అభినందన గ్రంథంలో చోటు చేసుకొన్న వ్యాసరాజం ఈ 'ప్రాకృత గ్రంథకర్తలూ ప్రజాసేవానూ. 116 పేజీల ఈ వ్యాసాన్ని ఇదే పేరుతో ప్రాచీపబ్లికేషన్స్ తరపున 1994 లో ప్రచురించారు. పుణ్యశ్లోకులైన పి. పి. సి. జోషిగారు, ఈ మహానుభావుణ్ణి సుమారు ముప్పై ఏళ్లక్రితం బెంగుళూరులో నిడమర్తి ఉమా రాజేశ్వరరావుగారింట్లో జరిగిన సాహిత్య గోష్ఠిలో కలుసుకోవడం నా అదృష్టం. **'పాతకొత్తల మేలుకలయిక పంచాగ్నులవారు'** అన్నా పీఠికలో డా. అక్కిరాజు రమాపతిరావు గారు 'పాకృత గ్రంథకర్తలూ– ప్రజాసేవానూ' అనే చొక్కపు అపరంజితో తులతూగ గలిగిన ఈ రచన అంటూ దీని ప్రాశస్త్యాన్ని కొనియాడారు. **"సంప్రదాయ పండితులలో సాధారణంగా కన్పించని ఉదార దృక్పథం, విశాల హృదయం పంచాగ్నుల వారిలో పుష్కలంగా ఉన్నట్లు"** ఆయన విలక్షణ, సాహితీ దృక్పథాన్ని డా. రమాపతిరావు వెల్లడించడం గమనార్హం.

పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు 1933 లో రచించిన 'ప్రాకృత కవులూ ప్రజాసేవానూ' పఠనయోగ్యమూ, పరిశీలనార్హమూ కావడం ఆ వ్యాసరాజం ప్రాధాన్యాన్ని చాటుతుంది. ప్రాశస్త్యాన్ని కీర్తిస్తుంది.

పంచాగ్నుల వారి ఈ వ్యాసం రెండు విధాలుగా విశిష్టమైనది. ప్రాచీన భారతదేశంలో శతాబ్దాల పాటు ఆబాలగోపాలం ఆశానిరాశల్నీ, కష్టసుఖాల్నీ, రాగద్వేషాల్నీ, జీవిత సాఫల్య, వైఫల్యాన్నీ కళాత్మకంగా వెల్లడించి ప్రాకృతభాష తన గరిమను చాటుకొంది. అది శతాబ్దాల వెనుక పామరుల వాడుక భాష, వ్యావహారిక భాష, సంస్కృతానికి దీటైన భాష. ప్రాకృతానికీ తెలుగుకూ అవినాభావ సంబంధముందని పంచాగ్నుల వారి అభిప్రాయం. గ్రాంథిక భాష పాండిత్య భారం వల్ల ఏ కొద్దిమందికో అర్థం అవుతుందనీ, వ్యావహారిక భాష ఎంతోమందికి అర్థమై సాహిత్య ముఖ ప్రయోజనమైన సమాజ శ్రేయస్సుకు దోహదకారి అవుతుందనీ శాస్త్రులుగారు గాఢంగా విశ్వసించారు.

పంచాగ్నుల వారు ఈ వ్యాసం ద్వారా తెలుగువాళ్లకు పరిచయం లేని ప్రాకృత కావ్యాల విశేషాల్ని తెలియజేయటం మొదటి సిద్ధి. కాగా ఆ కావ్యాల విశిష్టతను, వ్యావహారిక భాషలో తేటతెల్లం చేసి, వాడుకభాష శక్తి సామర్థ్యాల్ని ప్రదర్శించటం రెండవ సిద్ధి. ఈ వ్యాస రచన జరిగిన కాలానికి అంటే 1933 నాటికి, ఇంత




గహనమైన విషయాన్ని ఇంత తేటతెలుగులో వెల్లడించటం అపూర్వం, అద్భుతమునూ. ఇంతటి ప్రతిభను చూపిన మహా పండితులు అక్కిరాజు ఉమాకాంతం, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి, డా. చిలుకూరి నారాయణరావు ప్రభృతులు. ఇక పూర్వ సూరులైన గిడుగు, గురజాడ, కందుకూరి వారల ప్రజ్ఞా పాటవాల గురించి చెప్పనవసరం లేదు.

ప్రాచీ పబ్లికేషన్స్ తరపున శ్రీ పి.పి.సి. జోషి 'ప్రాకృత గ్రంథకర్తలూ ప్రజాసేవానూ' గ్రంథం 'మామనవి' లో ఇలా అన్నారు–**"ప్రజాభాష, ప్రజా సాహిత్యం అనే మాటల వెనుక తత్త్వాన్ని బోధపరచుకోవటానికి ప్రాకృత భాషా సాహిత్య పరిచయం తప్పక తోడ్పడగలదని మా విశ్వాసం."**

'ప్రాకృత గ్రంథకర్తలూ– ప్రజాసేవానూ' గ్రంథం అధ్యాయాలుగా విభజింపబడలేదు. కాని 'సంస్కృత ప్రాకృతాలల్లో మాతృక ఏది? పుత్రిక ఏది?' ప్రాకృతమే మాతృక అనేవారి వాదానికి నిదర్శనాలు, 'ప్రాకృత పఠనం కూడా ఒక ప్రత్యేకమైన కళ', 'అంత వృద్ధి

పొందిన ప్రాకృత భాషలు నేడు ఏమైనవీ?', 'నేటి వ్యావహారిక భాష – గ్రాంథిక భాషావాదుల కొంగు మనవి' అన్న శీర్షికల ద్వారా ఈ గ్రంథం ఆద్యంతం ఆసక్తికరంగా, ఉత్కంఠను కలిగిస్తూ నల్లేరుపై బండి నడకలా సాగటం పంచాగ్నులశాస్త్రిగారి రచనా ప్రావీణ్యాన్ని తెలియజేస్తుంది.

గ్రంథకర్త భారతదేశంలోని ప్రాచీన భాషలు సంస్కృతం, ప్రాకృతమని అర్వవిద్వాంసుల మాటల్ని ఉటంకిస్తారు. సంస్కృతం నుంచి ప్రాకృతం వెలువడిందని కొందరు భావిస్తే, కాదు కాదు ప్రాకృతం నుంచే పరిష్కరింపబడి సంస్కృతం రూపుదాల్చిందని ఇంకొందరు వాదిస్తారు. పంచాగ్నుల వారు ఇద్దరు ప్రాకృత కవుల మాటల్ని ఉటంకిస్తూ, ప్రాకృతభాష పుట్టుకకు కారణాన్నీ, లక్ష్యాన్నీ వివరిస్తారు.

మహేశ్వరసూరి 'శబ్దభేద ప్రకాశిక' అనే ప్రాకృత రచనలో, ఆ భాషలో రాయడ మెందుకో చెప్పిన మాటల్ని యిలా అనువదించారు శాస్త్రిగారు. – **"అంటే సంస్కృత కావ్యపు అర్థం తెలియని మందబుద్ధులందరికీ సుఖబోధం కోసరం ఇది ప్రాకృతంలో రచితమైంది. గూఢార్థం లేని దేశీ పదాలతో లలితాలయిన వర్ణాలతో** వ్రాసిన అందమైన ప్రాకృత కావ్యం ఎవరికి సుఖం కలిగింపదూ? **పరోపకారపరుడైన కవి పిల్లలు, తల్లులు మొదలయిన వారి కందరికీ తెలిసేటందుకై ఈ ప్రాకృతంలోనే గ్రంథరచన చెయ్యవలెనని తాత్పర్యం."** (పేజి: 9) మహాపండితుడూ, కవీ అయిన హరిభద్ర సూరి ఒక శ్లోకంలో ఇలా అంటారని పంచాగ్నులవారు సెలవిచ్చిన వైన మిది– **"బాలురున్నూ, స్త్రీలున్నూ, వృద్ధులున్నూ, మూర్ఖులున్నూ అయిన మనుష్యులకూ, చారిత్రాది గుణాలు అలవరచుకొనే నిమిత్తం ప్రయత్నించే వారికి – అనుగ్రహం చూపే నిమిత్తమై తత్త్వవేత్తలుగా వుండే పెద్దలచేత ప్రాకృతమే (వ్రాయవలశినట్లు) ఏర్పరుపబడ్డది అని దీని అర్థం."** (పేజి:10) మొత్తం మీద పంచాగ్నుల వారు ప్రాకృతమే ఆనాటి ప్రజల భాష అనీ, ప్రజలకు జ్ఞానోదయం కలిగించేందుకు కవులు వాళ్ల భాషలోనే రకరకాల గ్రంథాలు రాశారని చెప్పారు.

శాస్త్రిగారు ఈ సందర్భంగా ప్రాకృతంలోని లీలావతీకథలో ఆంధ్రదేశానికి సంబంధించిన చరిత్ర వుందని, అందులో ఆంధ్రదేశం లోని అనేక ప్రాంతాలు వర్ణించబడ్డాయని అన్నారు. మానవల్లి రామకృష్ణకవిగారు ఈ పుస్తకం గురించి చాలాకాలం క్రిందట 'భారతి' మాసపత్రికలో రెండు, మూడు వ్యాసాలు ప్రచురించినట్లు కూడా గుర్తుచేశారు. (పేజి: 12)

నిసర్గ సుందరమైన ప్రాకృత కావ్యాల్ని ఆనాటి సంస్కృత విద్వాంసులు లేవిడీ చేశారనీ, ఎద్దేవా చేసిచేసి ఎంతోమంది ప్రాకృత కవుల్ని రచనలు చేయకుండా అవమానపరచారని శాస్త్రిగారు సోదాహరణంగా చెప్పి, వాపోయారు.

ఆదినారాయణ శాస్త్రిగారు తెలుగు వ్యావహారిక భాష గ్రామ్యం అనీ, నిందనీయం అనీ చెప్పడం భావ్యం కాదని తర్కించి నిరూపించారు. శిష్టభాషలోని ఒక్కో పదానికి జన వ్యవహారంలో ఎన్నో రూపాలు వుంటాయనీ, వాటిని అపభ్రంశాలని చెప్పినా నిందనీయం కాదనీ, అపభ్రంశత్వం అంటే అపశబ్దరూపం మాత్రమే అనీ, శిష్టజనుల గ్రంథాల్లోనూ అని కానవస్తాయనీ వాటిని నిందించటం తగదనీ గట్టిగా వాదించారు. (పేజి: 48, 49)

ప్రాకృత భాషలో ముక్తక కవితలు, కావ్యాలు, నాటకాలు, అలంకార గ్రంథాలు, వ్యాకరణ గ్రంథాలు రచింపబడి, ప్రాకృత సాహిత్యం భారతదేశంలోని ఎన్నో ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిందని చెప్పారు పంచాగ్నులవారు. ప్రాకృతం ఆరు ప్రధాన భాషలుగా –సంస్కృతం, ప్రాకృతం, మాగధి, శౌరసేని, అపభ్రంశం, పైశాచి – వర్ధిల్లిందన్నారు.

ఈ ఆరు భాషలే కాలక్రమంలో 18 భాషలుగా వికసించాయని అన్నారు. శాస్త్రిగారి మాటల్లోనే విందాం– **"కాబట్టి ప్రాకృత మనేది క్రమంగా సమిష్టి కుటుంబములు చీలి వ్యష్టిగా పెఱిగి, అనంతత్వాన్ని పొందిన విధంగా, ఆయా దేశభేదాలతో నెలకొని అనంతరత్న ప్రభవమైంది, అనంతత్వాన్ని పొందింది. చివఱ కీనాటికి పూర్తి దేశ భాషలుగా పరిణమించింది."** (పేజి: 67)

జాబాలిపుర రాజ కుమారుడు ఉద్యోతనుడు. ఇతనికి దాక్షిణ్య చిహ్నసూరి అనే మరోపేరు కూడా వుంది ఇతడు రచించిన 'కువలయమాల కథ' కావ్యంలో విక్రమశకం 9 వశతాబ్దం నాటి 18 దేశాల ప్రజలు, వాళ్ల భాషలు పేర్కొనబడ్డాయి. ఈ కావ్యంలో ఆంధ్రులు ఉల్లేఖింపబడ్డారు– **"ప్రియ మహిళా సంగామే సుందరగత్తేయ భోయణే రోద్దే, అటు పుటు రటుం– భణంతే ఆంధ్రే, కుమారో పలోయేతి"** (పేజి: 71) (అందగత్తెలన్నా అథవా యుద్ధరంగ మన్నానూ, సమానంగా ప్రేమించే వాళ్ళన్నూ, అందమైన శరీరాలు గలవాళ్ళున్నూ, తిండిలో దిట్టలున్నూ అయిన ఆంధ్రులు– అటూ పుటూ (పెట్టూ– కాబోలుదే? రటూ (రట్టు– ఏమో) అనుకొంటూ వస్తూండగా చూచాడు (పేజి: 73)

ఆర్యులు సంస్కృత భాషను అభివృద్ధి చేసి శిష్టులకు ఉపకారం చేస్తే బౌద్ధ, జైన మతాచార్యులు ప్రాకృత భాషనూ దాని దేశీ రూపాల్ని అభివృద్ధి చేసి పామరులకు మేలు చేశారు శాస్త్రిగారు. మలయగిర్యాచార్యుడు హరిభద్ర సూరి, అభయ దేవసూరి, హేమ చంద్రసూరి మొదలైన ప్రాకృత గ్రంథకర్తల స్థూల పరిచయం చేశారు. కలికాల సర్వజ్ఞుడు. కవి కులపతి ఐన హేమచంద్రాచార్యుని 22 రచనల్లో ముద్రితమైన కావ్యానుశాసనం, ఛందోనుశాసనం, లింగానుశాసనం, అభిధాన చింతామణి, దేశీనామమాల, సప్తసంధాన కావ్యం మొదలైన రచనల్ని తెలుగు విద్వాంసులు అభ్యసించాలనీ, విమర్శించాలనీ, తెలుగులోకి అనువదించాలనీ విన్నవించుకొన్నారు. (పేజి: 83, 84)

ప్రాకృత కావ్యాలు చాలా మందికి అలభ్యాలు, సులభంగా అర్థం కానివి. అందువల్ల పంచాగ్నులవారు కొన్ని ప్రాకృతకావ్యాల ఉ టంకింపుల్ని, వాటికిసంస్కృతఛాయల్ని, వాటికి తెలుగు అనువాదాల్ని ఇచ్చి, తెలుగు పాఠకులకు ప్రాకృత కావ్య రసాస్వాదనా భాగ్యం కలిగించారు. మానవల్లి రామకృష్ణకవి గారు 'లీలావతి' కావ్యాన్ని తెలుగులోకి అనువదింప చేశారనీ, అది ప్రచురింపబడితే బాగుంటుందని చెప్పారు శాస్త్రిగారు. (పేజి: 104) గ్రంథకర్త అలంకార గ్రంథమైన 'వజ్జాలగ్గం' కావ్యశోభ, లక్షణ శోభల సంగమ మంటూ "దీన్ని ఏ అనంతకృష్ణశర్మగారో ఆంధ్రీకరిస్తే ఎంతో ముచ్చటగా ఉంటుంది." (పేజి: 108) అని అనడం వరాల మూట లాంటిది.

ప్రాకృత భాషా పండితులు మానవల్లి, డా. చిలుకూరి, శివశంకర శాస్త్రి, వేలూరి శివరామ శాస్త్రి, రాళ్ళపల్లి, పుట్టపర్తి, తిరుమల రామచంద్ర, డా. పుల్లెల శ్రీ రామచంద్రుడు మొదలైన వారెవ్వరూ నేడు లేరు. పంచాగ్నుల, వంగూరి సుబ్బారావు, డా. చిలుకూరి నారాయణరావు ప్రభృతులు ప్రాకృతానికీ తెలుగుకు సన్నిహిత సంబంధముందని బలంగా విశ్వసించిన పండితులు. చీమకుర్తి శేషగిరిరావు గారు కూడా 'తెలుగులో పాళీపదాలు' (1990) ప్రచురించి ఈ రెండు భాషల సాన్నిహిత్యాన్ని వెలువరించారు.

భారతీయ భాషల సాహిత్యాన్ని ముఖ్యంగా– ఆవిర్భావ కాలం నాటి పద్యగద్య రచనల పుట్టుక, వికాసాల గురించి తెలుసుకోవాలంటే సంస్కృత ప్రాకృత భాషా సాహిత్యాల అధ్యయనం అత్యావశ్యకం. పైగా ఆధునిక భారతీయ భాషల ప్రాచీన చరిత్ర, భారతదేశ రాష్ట్రాల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్ర తెలుసుకోవాలంటే చాలా మంది సంస్కృత గ్రంథాల్నే పరిశీలిస్తారు. కాని ప్రాకృత గ్రంథాల్ని స్పృశించిన విద్వాంసులు తక్కువ. తెలుగులో మరీ తక్కువ. ప్రాకృత భాషా సాహిత్యం ఇంగ్లీషుతో పాటు, హిందీ, రాజస్థానీ, గుజరాతీ భాషల్లో కూడా లభ్యమవుతూ వుంది. తెలుగు సాహిత్య ప్రియులు, భాషా శాస్త్రవేత్తలు కనీసం ఇంగ్లీషు, హిందీ, కొంత వరకు మరాఠీ పరిశోధనా గ్రంథాలు చదివితే, తెలుగు భాష– తెలుగు దేశచరిత్రకు సంబంధించిన ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోగలుగుతారు. తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర అధ్యయనంలో కొత్త కోణాలు దర్శించి, దర్శింప చేసిన వారవుతారు ఈ సందర్భంగా పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు 'ప్రాకృత గ్రంథాలు – ప్రజాసేవానూ' గ్రంథం చివరి పేజీల్లో చేసిన మనవి మాటల్ని ఉటంకించడం ఎంతో సముచితమూ, సాందర్భికమూనూ.

**"నేడు వాఙ్మయ విమర్శనం కోసం పరిశ్రమించే వారూ, చరిత్ర కోసం వెదికేవారూ కూడా ప్రాకృతం గాలించాలి. ఎన్నో దేశ్యాలు, ఎన్నో కల్పనలు, ఎన్నెన్నో వాక్య చమత్కారాలు, సరస ఫణితులు, ఎన్నో చరిత్రాంశాలు– ప్రాకృతం ఇస్తుంది. తక్కిన వాటిని వదలు కొనవలెనని నా మనవి కాదు. దీన్ని ప్రధానంగా ఎంచండి అనే."** (పేజి : 115) మరి పంచాగ్నుల మహాభాగుల మాటలు ఆచరణలో పెట్టే మంచి రోజులు మనకు వస్తాయంటారా? నాకేమో అనుమానమే!


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# కథా సాహిత్యంలో రజకుల ప్రస్తావన

**బాసాని సీతారాములు,** ప్రభుత్వ తెలుగు అధ్యాపకులు, జనగామ. ఫోన్ : 966 49 44 66

**పరిచయం :** మనిషి తన చుట్టూ ఉన్న ప్రపంచంలో తాను, విన్నవీ, చూసినవీ, అనుభవించినవీ ఎన్నో అనుభవాలను, అనుభూతులను ప్రతిబింబించేదే కథ, కథ శ్రవణానందాన్ని కల్గిస్తుంది, కథ వినగానే మనిషికి ఊరట కల్గుతుంది, తృప్తినిస్తుంది, అనేక చమత్కారాలు, వ్యంగ్యం జ్ఞానాన్ని కలగలిపి నిర్మితమవుతుంది కథ. సమయస్ఫూర్తిని రక్తికట్టించే గుణం కథకు ఉంటుంది, తాతయ్య, నానమ్మలు పిల్లలు గోలచేసినప్పుడు అనేక కథలు చెబుతుంటారు. సాహసవీర గాథలు పురాణ పురుషుల కథలు చెబుతుంటారు, ముందు కథ అనే ప్రక్రియ జానపద కథా రూపంలోనే మొదలైందని చెప్పాలి. సామాజిక స్పృహను కలిగించే కథలు, భారతీయ సంస్కృతి, ఆచారాలను ఉటంకించే కథలు కూడా అనేకం ఉన్నాయి. ఇందులో కులాలు, మతాలకు చెందిన కథలు కూడా ఉన్నాయి. కుల కథలు, కులాల మధ్య అంతరాలకు తెలియపరచే కథలు సామాజిక చైతన్యాన్ని రగిలిస్తాయి.

**మంచి కథకు ఉండవలసిన లక్షణాలు :** మంచి కథకు తప్పనిసరిగా ఉండవలసిన నాలుగు లక్షణాలు క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం ముఖ్యమైనవి. తెలుగులో కథా ప్రక్రియను ప్రారంభించిన వారు ***గురజాడ వెంకట అప్పారావు*** గారు. ఈయన రాసిన మొట్టమొదటి తెలుగు కథ **'దిద్దుబాటు'** ఆ తర్వాత తెలుగు సాహిత్యంలో కథలు అసంఖ్యాకంగా పుట్టుకొచ్చాయి. ఈ కథా సాహిత్యంలో అక్కడ అక్కడ రజక కుల ప్రస్తావన కూడా కనబడుతుంది. వాటిలో ***సత్యం శంకరమంచి*** గారు రాసిన అమరావతి కథల్లో **'ఆరేసిన చీర'** అనే కథ, **పెద్దింటి అశోక్ కుమార్** రాసిన **'సాకి రేవు కథ' 'వసంతాలు'** కథ (సాకిరేవు కథలు) రజకుల గురించి వారి జీవన విధానం గురించి చక్కగా వివరించబడింది.

**ఆరేసిన చీర :** సత్యం శంకరమంచి రాసిన అమరావతి కథల్లో **'ఆరేసిన చీర'** అనే కథ రజక దంపతుల అన్యోన్య దాంపత్యం గురించి వివరిస్తుంది. ఇందులో సాంబడు, లచ్చి భార్యాభర్తలు. వీరిద్దరూ అనుక్షణం తగవులాడుతూ కొట్టుకునే వారు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం లేదు, పెద్దలు కుదిర్చిన పెళ్లి కాబట్టి వారిని గౌరవిస్తూ కాపురం చేస్తున్నారు, ఒకరోజు సాకిరేవుకు బట్టలు తీసుకొని వెళ్లి బట్టలు ఉతుకుతుంటారు, లచ్చికి ఆ ఊర్లోనే కోటేశు అంటే ఇష్టం, అలాగే సాంబనికి సీతాలు అంటే ఇష్టం. ఆరోజు వారిద్దరి బట్టలు ఉతకడానికి వచ్చారు, కోటేశు బట్టలు లచ్చి ఉతుకుతూ మైమరచిపోయింది. సాంబడు కూడా సీతాలు చీర ఉతుక్కుంటూ సంతోష పడుతున్నాడు. ఇరువురు కలిసి బట్టలన్నీ ఉతికి ఆరేశారు. కాపేపటికి బట్టలు ఆరిన తర్వాత వాటన్నింటిని ఎదిరి మూట కట్టారు. సీతాలు చీరను లచ్చి కట్టుకుంది, కోటేశు ధోవతిని సాంబడు కట్టుకున్నాడు, వారిరువురూ ఒకరినొకరు చూసుకుంటూ మురిసిపోయారు .పరకాయ ప్రవేశం చేసినట్టు ఆనందపడ్డారు, బట్టలన్నీ మూట కట్టి ఆ మూట ఎత్తమని సాంబడిని పిలిచింది లచ్చి, సాంబడు లచ్చికి మూటెత్తి ముద్దు పెట్టుకున్నాడు, లచ్చి కూడా సిగ్గుపడుతూ ఏమనలేదు, ఈ విధంగా అడ్డదారి పడుతున్న వారి మనసులను ఇతరుల వస్త్రాలు ఒకటి చేసి వారి మధ్య ఉన్న బంధాన్ని బలోపేతం చేశాయి. చీరల ద్వారా బంధం బలపడింది. ఇలా జరిగింది కాబట్టి ఆరేసిన చీర ఈ కథకు సరైన పేరు ఈని చెప్పవచ్చు.

<u>**సాకి రేవు :**</u> **'సాకి రేవు'** కథా రచయిత ***<u>పెద్దింటి అశోక్ కుమార్.</u>*** వీపు మీద ఉన్న బట్టల మూటను కింద దింపి లక్ష్మీ అంటూ కేక వేశాడు బాలయ్య అంటూ ఈ కథ ప్రారంభం అవుతుంది. బాలయ్య లక్ష్మి భార్యాభర్తలు. వారికి సంతానం లేదు, వీరు కులానికి కూడా దూరంగా ఉంటారు. పెళ్లయిన తర్వాత తల్లిదండ్రులను, పెళ్లి కాని ఇద్దరు చెల్లెళ్లను విడిచి వేరే కాపురం పెడతాడు బాలయ్య. పెద్దలు ఎంత చెప్పినా వినడు, మాట వినని కారణంగా బాలయ్యకు కులం వాళ్ళతో సంబంధాలు తగ్గిపోతాయాయి, చెల్లెలి పెళ్లి చేయబడుతుందని వేరే కాపురం పెట్టాడని అందరూ బాలయ్యను విమర్శిస్తుంటారు. బాలయ్య భార్యకు తరచూ కడుపులో నొప్పి వస్తుంది. ఏదో ఒక ఆకు పసరు మందు వాడుతూ తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నది. పట్నం వెళ్లి వైద్యం చేయించుకుందామంటే వారికి సరిపడా డబ్బు లేదు. అప్పు ఇచ్చేవారు కూడా ఎవరూ లేరు, అందువలన లక్ష్మికి వైద్యం చేయించుకుందామంటే వారికి సరిపడా డబ్బు లేదు. అప్పు ఇచ్చేవారు కూడా ఎవరూ లేరు, అందువలన లక్ష్మికి వైద్యం చేయించలేకపోయాడు బాలయ్య. ఆ గ్రామంలో కిషన్ రావు అనే పెద్ద మోతుబరి రైతు ఉన్నాడు. మంచి అవకాశవాది కూడా. ఎవరిని ఎప్పుడు మోసం చేస్తాడో తెలియదు, అలాంటి కిషన్‌రావు బట్టలు బాలయ్య ఉతుకుతుంటాడు. కిషన్ రావు ఇంట్లో రెండు శుభకార్యాలు జరగబోతున్నాయి. ఈ రెండు కార్యాలు చేస్తే బాలయ్యకు కొంత సొమ్ము దొరుకుతుంది. అప్పుడు లక్ష్మిని పట్నంలో చూపించవచ్చు కాని, లక్ష్మికి కడుపు నొప్పి తగ్గకపోవడంతో ఎలాగూ కార్యాలు జరగబోతున్నాయి. అప్పుడే పిడుగులాంటి వార్త గ్రామంలో రైతులందరూ రజకులకు చాలినంత జీతం ఇవ్వడం లేదని, అందరూ బట్టలు ఉతకడం మానేయ్యాలని మూకుమ్మడిగా నిర్ణయం

తీసుకుంటారు, కానీ బాలయ్య కిషన్ రావు వద్ద తీసుకున్న అప్పు తీర్చాలి, ఇంకా వారింట్లో కార్యాలు ఉన్నాయి. ఈ సమస్య ఎట్లా తీరుతుంది అని కిషన్‌రావు వద్దకే వెళ్తాడు, బాలయ్య పరిస్థితిని చూసిన కిషన్ రావు నీకే సమస్య రాకుండా నేను చూసుకుంటాను ఈ రోజు వచ్చి మా ఇంట్లో పని చెయ్యి అని భరోసా ఇస్తాడు. కాని గ్రామంలోని రజకులంతా కట్టుపై ఉండి బట్టలు ఉతకడం ఆపేస్తే, బాలయ్య ఒక్కడే కిషన్ రావు ఇంట్లో పని చేస్తున్నాడు అని, కులంలో పంచాయితీ పెట్టి బాలయ్యను గ్రామం నుండి కులం నుండి వెలి వెయ్యాలని చూస్తారు.

**కంబాల మిట్టలో సాకిరేవు :** ఈ కథ మారిశెట్టి గోవింద్ రాసిన సాకిరేవు కథల సంపుటి లోనిది, ఉళ్ళో అప్పులు ఎక్కువై కుటుంబం గడవక, వలసవెళ్ళిపోయిన గురప్ప అనే రజకుని మనోగతాన్ని వర్ణిస్తుంది ఈ కథ. సొంత ఊరిపై, సొంతవాళ్ళపై ఉన్న మమకారం మనిషిని ఎంతగా క్షోభకు గురిచేస్తుందో ఈ కథ ద్వారా అర్థం అవుతుంది. గురప్ప కులవృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాడు. కూతురు పెళ్ళి చేసి, కుటుంబాన్ని పోషించలేక, చాలీ, చాలని ఆదాయంతో బతుకీడుస్తున్నాడు. ఒకరోజు అప్పుల బాధలు తట్టుకోలేక ఊరొదిలి వెళ్ళిపోతాడు. బస్సెక్కి ఊరి నుండి బయలుదేరిన దగ్గరి నుండి గురప్ప మనస్సు పిండేస్తుంది. చిన్ననాటి మిత్రులున్న ఊరిపై ఉన్న మమకారాన్ని చంపుకోలేక గుండె బరువుతో కంబాలమిట్టకు వెళ్తాడు. **"నేను ఊరొదిలి పోయినానే గాని, పోయింది నా కట్టె మాత్రమే నా మనసేమో ఊరిచుట్టూ గిరికీలు కొడుతూ ఉంది"** అంటూ గురప్ప తన ఊరిపై ఉన్న అభిమానాన్ని చాటుచుంటాడు. నేను ఏనాడు ఏ పాపం చేశానో సొంత ఊర్లో జీవించే అవకాశం లేకుండా పోయింది అని తెగబాధపడతాడు గురప్ప.

ఒకరోజు సాకిరేవులో బట్టలు ఉతుకుతుండగా ఎవరో పిలిచారు గురప్పను, తీరా చూస్తే తన మిత్రుడు మాణిక్యం ఆచారి ఇన్నాళ్ళకు తెలిసిన మనిషిని చూసిన గురప్పకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లైంది. ఇద్దరూ కలిసి చాలాసేపు ముచ్చటించి గ్రామంలోని సంగతులు చర్చించారు. మరికొన్నాళ్ళకు మాణిక్యం ఇచ్చిన సమాచారంతో, తన ప్రాణమిత్రులు చెంగల్లప్ప, రామప్ప, రోసయ్య వాళ్లను చూడగానే గురప్పకు కాళ్ళు చేతులు ఆడలేదు, కళ్ల నుండి నీళ్ళు ఉబికివచ్చాయి. వాళ్ళ దగ్గరకెళ్లి మీదపడి బోరున ఏడ్చాడు. వాళ్ల కంటా నీళ్ళు జలజలా కారుతున్నాయి. కొద్దిసేపు ఏమి మాట్లాడకుండా ముఖాలు చూసుకుంటూ ఉన్నారు, మాటలు రావడం లేదు, ఈ దృశ్యం గ్రామప్రాంతంలోని స్వచ్ఛమైన స్నేహానికి మచ్చుతునక అని చెప్పవచ్చు.

**వసంతాలు కథ :** మూరిశెట్టి గోవింద్ గారి కథాసంపుటి **"సాకిరేవు కథలు"** నుండి ఈ వసంతాలు కథను పరిశీలించడం జరిగింది. ఈ కథ రజక కుల వృత్తికి ఆత్మగౌరవాన్ని తెలియజేస్తుంది. పూర్వం సుమారు 100 సం။రాల కంటే ముందు తెలుగు ప్రాంతాల్లో ముఖ్యంగా రాయలసీమ మాండలికంలో పాత్రలు మాట్లాడుతున్న తీరు ఆ నాటి గ్రామ ప్రజల మధ్య ఉన్న ఆప్యాయత, అనురాగాలను రచయిత చక్కగా వివరించాడు. ఈ కథంతా రజకుడైన గురప్ప తన స్వగతాన్ని, తన అనుభవాలను మనకు చెబుతున్నట్లుగా కవి వివరించాడు. గురప్ప అనే రజకుడు గ్రామంలో వృత్తి పనిలో బాగా పేరు తెచ్చుకున్నవాడు. తనకు బట్టలు తెల్లగా ఉతికి, ఇస్త్రీ చేయడం అంటే బాగా ఇష్టం. ఎవరైనా సరే బట్టలు బాగా ఇస్త్రీ చేశావని అంటే చాలు గురప్పకు ఆ రోజంతా ఆనందమే తన శ్రమనంతా మరిచిపోతాడు. **"తెల్లారి పొద్దుపుట్టి బారెడెక్కుంటుంది, అమ్మలక్కలు ఊరి ముందర కమ్మోలోళ్ళ బాయిలో కడవల్లో నీళ్ళు తెచ్చుకుంటూ ఉండేవారు"** అనే గురప్ప మాటలతో కథ ప్రారంభమవుతుంది. కథ మొత్తం రాయలసీమ మాండలికంలో సాగుతుంది. గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించే సామెతలు, జాతీయాలు, ఎత్తిపొడుపు మాటలు అనేకం ఉన్నాయి. కథ మొత్తం పెళ్ళి తంతు చుట్టూ సాగుతుంది. గురప్ప రజక వృత్తిలో భాగంగా గ్రామంలోని యాజమాని సంజీవయ్య కూతురు పెళ్ళికి ఏర్పాట్లు చేయడం మొదలు వివాహ అనంతరం కార్యక్రమాల వరకు సంప్రదాయబద్ధంగా రజకులు చేసే ప్రతీ పనిని తెలియజేస్తుంది ఈ కథ.

**టార్చిలైటు కథ :** 'కరుణకుమార కథలు' లో నుండి గ్రహించినదే ఈ టార్చిలైటు కథ. ఈ కథలో రజక ప్రస్తావన ఉంది. కరుణకుమార అసలు పేరు కందుకూరి అనంతం. ఈయన కరుణకుమార అనే కలం పేరుతో రచనలు చేస్తున్నాడు. వెంకటరెడ్డిపాలెం అనే గ్రామంలో స్కూలు హెడ్‌మాస్టర్‌గా జకీరయ్య అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. ఆ గ్రామంలో పాఠశాల వార్షికోత్సవం సందర్భముగా అనేక అంశాలలో క్రీడల పోటీలు నిర్వహించదలచారు. దీనికి బహుమతులు కొనుటకై గ్రామ పెద్దలు ఆర్థిక సమాయం చేశారు. క్రీడా పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలలో ఒక రజకుని కొడుకు, మంగళి కొడుకు, గొల్లవాని కుమారుడు, సాలెవాడు, యానాది వాడొకడు ఉన్నాడు. హెడ్‌మాస్టర్ విజేతలకు బహుమతులు ఇచ్చాడు. కాని పెద్ద కుటుంబాల వారి పిల్లలకు బహుమతులు రానందుకు వారు ఇంటికెళ్లి తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. ఆ గ్రామములోని భూస్వాములు హెడ్‌మాస్టర్‌పైకి వచ్చి మా డబ్బుతో కొన్న బహుమతులు వేరే వాళ్ళకు ఇస్తావా అని కోపగించుకున్నారు. వాటిని వెంటనే వెనక్కి తెప్పించి మా పిల్లలకు ఇవ్వాలి అని బెదిరించారు. గ్రామ పెద్ద పెద్దిరెడ్డి వీరికి నాయకత్వం వహించాడు.

పెద్దిరెడ్డి భయానికి అందరూ తమ బహుమతులు వెనక్కి తిరిగి ఇచ్చివేసినారు. రజకులు రంగని ఇంటికి వెళ్లితే అతడు మాత్రం తన కొడుక్కు వచ్చిన బహుమతి టార్చిలైటును తిరిగి ఇవ్వలేదు. వ్యతిరేకించినాడు కూడా. రంగడు పట్టణములో ఉండి వచ్చినవాడు.

కాస్త నాగరికత తెలిసినవాడు. కాబట్టి ఎవ్వరి మాట వినలేదు. పైపెచ్చు మిగిలిన వారందరిని చైతన్యపరచి మీ బహుమతులు తిరిగి తెచ్చుకోండని ప్రోత్సహించినాడు. బడుగు బలహీన వర్గాల వారైన తల్లిదండ్రులు ధైర్యం తెచ్చుకొని మా బహుమతులు మాకిమ్మని పట్టుబట్టారు. చేసేది ఏమీలేక పెద్దిరెడ్డి ఇతర పెద్దమనుష్యులు తిరిగి ఇచ్చివేసినారు. రంగడు చేసిన ధైర్యం బడుగు బలహీన వర్గాల వారికి స్ఫూర్తినిచ్చింది. ఉత్తేజాన్ని కలిగించింది వారిలో నూతన చైతన్యాన్ని రగిలించింది. ఈ కథ ద్వారా అణచివేసేవారిని ఏ విధంగా ఎదుర్కోవాలో మనం తెలుసుకోవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1) సాకిరేవు కతలు – మూరిశెట్టి గోవింద్.
2) కథాశిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య.
3) కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షిణామూర్తి.
4) సాకిరేవు కథ – పెద్దింటి అశోక్‌కుమార్.
5) ఆరేసిన చీర (అమరావతి కథలు) – సత్యం శంకరమంచి.
6) టార్చిలైటు కథ (కరుణకుమార కథలు) – కరుణకుమార.


# కన్నీటి ఉపదేశం

ఒకప్పుడు గురువులు
కర్తవ్యాన్ని ఉపదేశించేవారు
ఇప్పుడు కన్నీటి చుక్కలు
కర్తవ్యాన్ని ఉపదేశిస్తున్నాయి
ఎంతైనా ఇది
నీ నిర్లక్ష్యమే నిన్ను మృత్యు పల్లకినెక్కించే
కరోనా కాలం కదా !

దేహపు చెట్టునుంచి
ప్రాణాలు పక్షుల్లా ఎగిరిపోతున్నాయి
అయినవాళ్ళ శవాలు కూడా
అనాథ శవాల్లాగే తగలబడుతున్నాయి
పట్టుకొని ఏడవలేము
ముట్టుకొని బతకలేము

మొన్న భూమి వ్యాపార వస్తువు
నిన్న నీళ్లు వ్యాపార వస్తువు
నేడు గాలి కూడా వ్యాపార వస్తువే
కరోనా చేరి కలుషితమైన గాలిలో
లీటర్ మంచిగాలి పీల్చాలన్నా
పుస్తెలనమ్మాలి మెట్టెలనమ్మాలి
అవసరమైతే
ఇళ్ళను కూడా తెగనమ్మాలి

అందుకే
మృత్యు తుఫానొకటి
నిన్నూ నీదేశాన్నీ
ఊడ్చేయకముందే
కన్నీటిచుక్కలు
నీకో కర్తవ్యాన్ని ఉపదేశిస్తున్నాయి
మూతికి గుడ్డ కట్టుకోమని
చేతులు శుభ్రంగా కడుక్కోమని
ఎంతైనా ఇది
నీ నిర్లక్ష్యమే నిన్ను మృత్యు
పల్లకినెక్కించే
కరోనా కాలం కదా!

**నరేశ్ చారి**
ఫోన్ : 9701 334 516


# దయ కలిగిన తల్లి

ఆక్షేపకమేదో
జీవిత నిగూఢ రహస్యాల్ని
వెతికినట్లే వుంది.
నా ప్రక్కన ఎవరో
పాడుతున్నారు గానీ
అది వంద సంవత్సరాల
విషాదంలా వుంది.
నేను 'ఆమె' లోనే
వుండిపోయానా!
ఏమో!
ఎప్పుడో చెదిరిపోయింది
హృదయం.
జీవితం రెండుకాళ్ళ
నరకం చూశాక
కదలికలమీద కూడా
గూఢచర్యం చేస్తుంటుంది
కాలం!
ఎక్కడెక్కడో దొర్లుతూ
పడుతూ – లేస్తూ
నాకు నేనే – – నాలోనే
నీలోకికూడా తొంగిచూస్తూ
కసిగా కాటేసిన రోజులు
గుర్తుకొస్తున్నాయి.
కళ్ళల్లో హఠాత్తుగా
నీళ్ళు తిరుగుతాయి.
దయకలిగిన అమ్మ నవ్వు
గుర్తుకొస్తుంది.
నేను ఖండిత జీవితాన్ని
మనసు జేబులో
దాచుకొంటాను.

**ఏటూరి నాగేంద్రరావు**
ఫోన్ : 741 666 5323

# తెలంగాణ యక్షగానం – చంద్రహాస చరిత్రము – రసపోషణ

**కె. సురేష్,** ప్రభుత్వ తెలుగు అధ్యాపకులు, హయత్ నగర్, హైదరాబాద్. ఫోన్ : 9441705076



తెలంగాణ ఎన్నో కళలకు కళారూపాలకు పుట్టినిల్లు. తెలంగాణ సంస్కృతిలో జనించి, ఇక్కడి సాహిత్యంతో జవజీవాలను సంతరించుకుని, వేషభాషలలో తెలంగాణ ఉనికిని చాటుతూ తెలంగాణ ప్రజల దైనందిన జీవితంలో భాగమైనిలిచింది తెలంగాణ యక్షగానం. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికచింతన పెంపొందించే కళగా ప్రత్యేకంగా విరాజిల్లింది. తెలంగాణలో యక్షగానాన్ని భాగవతం, వీధి భాగోతం లేదా భాగోతం అని పిలుస్తారు. ఇది సంగీత ,సాహిత్య, నృత్యాభినయాలతో కూడిన సమాహార కళారూపం.

తెలంగాణ యక్షగానాన్ని మిగతా ప్రాంత యక్షగానాలతో అంటే ఆంధ్ర, కర్ణాటక, తంజావూరు యక్షగానాలతో పోల్చి చూస్తే వస్తువురీత్యా, ఛందస్సురీత్యా, ఆహార్యం, అభినయాల రీత్యా వైవిధ్యం కనిపిస్తుంది. పౌరాణిక, రామాయణ, భారత, చారిత్రక, సాంఘిక, కాల్పనిక కథాంశాలతో కూడిన అనేక తెలంగాణ యక్షగానాలు నవరసభరితమై అటు పాఠకులను, ఇటు ప్రేక్షకులను అలరిస్తూ, పండిత పామరులను మెప్పించాయి. శృంగార, కరుణ, వీర రసములు ప్రధానంగా అనేక యక్షగానాలు తెలంగాణ రచయితలు సృష్టించారు.

**చంద్రహాస చరిత్రము – యక్షగానం**

జైమినీ భారతంలోని అశ్వమేధ పర్వము నుండి గ్రహించబడిన ఇతివృత్తం కలిగిన యక్షగానం చంద్రహాస చరిత్రము. ఇది కన్నడ దేశంలో కూడా బయలాటగా ప్రసిద్ధిగాంచి, బహుళ ప్రజాదరణ పొందిన యక్షగానం. తెలుగులో ఆడెపు నారాయణదాసు చంద్రహాస చరిత్రము యక్షగానాన్ని రచించి వేములవాడ రాజరాజేశ్వర స్వామికి అంకితమిచ్చారు.

దుష్టబుద్ధి అనే మంత్రి సత్యశీలుడనే రాజు చెంతనే ఉండి అతనికి పుత్రులు లేనందున అన్నీ తానై పరిపాలన చేస్తాడు. కేరళ రాజకుమారుడు చంద్రహాసుడు మూల నక్షత్రాన జన్మించి, తల్లిదండ్రులను పోగొట్టుకొని ఒంటరివాడై విప్రుల ఆశ్రయం పొందుతాడు. అంతట ఒకానొక రోజు చంద్రహాసుడు దుష్టబుద్ధి దగ్గరకు రాగా అతన్ని తన ఇంట చేర్చుకుంటాడు. అయితే దుష్టబుద్ధి మూల నక్షత్రంలో జన్మించిన చంద్రహాసుని గూర్చి సంశయించి వేదబ్రాహ్మణులను పిలిపించి, ఆ పిల్లవాడి గురించి విచారణ చేయిస్తాడు. బాలుడైన చంద్రహాసుడు సుందరాకారుడు, సద్గుణసంపన్నుడు, శూరపరాక్రమవంతుడై రాజ్యమేలి సార్వభౌముడు అవుతాడని విప్రులు పలుకుతారు. అది విని దుష్టబుద్ధి మనసులో మిక్కిలి వ్యసనపడి వీరసేనుని పిలిపించి బాలుని తలఖండించి రమ్మని ఆజ్ఞాపిస్తాడు.

వీరసేనుడు చంద్రహాసుని అడవికి తీసుకుని వెళ్తాడు. అతన్ని చంపాలని నిశ్చయంతో ఉంటాడు. కానీ ఆ బాలుని స్వచ్ఛమైన మనసుకు, మాటలకు విస్మయమొంది, అతన్ని చంపకుండా చిటికెనవేలు నరికి తెచ్చి దుష్టబుద్ధికి ఆనవాలుగా చూపిస్తాడు.

బాలుడైన చంద్రహాసుడు అడవిలో రోదిస్తూ తిరుగుచుండగా, అదే సమయంలో రాజు వేటకై మంత్రితో కలిసి ఆప్రాంతంలో సంచరిస్తూ ఉంటాడు. ఏడుస్తూ అడవిలో తిరుగుతున్న బాలుని చూసి, వివరాలు అడిగి, సంతానం లేని తనకు దైవప్రసాదం అని భావించి తనరాజ్యానికి తోడ్కొనివచ్చి పెంచి పెద్దచేస్తాడు.

కుళిందరాజు దుష్టబుద్ధికి సామంతరాజు అగుటవలన ద్రవ్యము (కప్పము) ఇచ్చుటకు చంద్రహాసుని అతని దగ్గరికి పంపెను. చంద్రహాసుని చూసిన దుష్టబుద్ధి తాను చంపమని వీరసేనునికి ఆజ్ఞాపించిన బాలుడు ఇతడేనని అనుమానిస్తాడు. కుళిందరాజ్యం వెళ్లి నిజం తెలుసుకుంటాడు. తిరిగి అతన్ని అంతమొందించాలని భావించిన దుష్టబుద్ధి ఒక లేఖరాసి చంద్రహాసునికిచ్చి తన కొడుకు మదనునికిమ్మని పంపిస్తాడు. ఆ లేఖలో **'ఇతనికి విషము నిమ్ము'** అని రాసెను.

ఆ ఉత్తరము తెచ్చిన చంద్రహాసుని దుష్టబుద్ధి కూతురు విషయ చూసి అతన్ని మోహించి, పెళ్లి చేసుకోమని అడుగుతుంది. అతనికి తెలియకుండా లేఖలో **'విషము నిమ్ము'** అనేపదాన్ని బదులుగా **'విషయ నిమ్ము'** అని రాస్తుంది. ఆలేఖ చూసిన మదనుడు అతనికి చెల్లినిచ్చి పెళ్లి చేస్తాడు.

అటు తర్వాత దుష్టబుద్ధి విషయమంతా గ్రహించి కోపావేశంతో చంద్రహాసుని కాళికాదేవికి బలిగా ఇచ్చుటకు నిర్ణయిస్తాడు. కానీ అతనికి బదులుగా తనకొడుకు మదనుడు

వెళ్ళి బలి అవుతాడు. అది తెలిసిన దుష్టబుద్ధి తాను పొడుచుకుని చనిపోతాడు. చంద్రహాసుడు సత్యశీలరాజు ఆహ్వానం మేరకు వెళ్లి అతని కూతురు మంజరిని వివాహం చేసుకొని సుఖంగా రాజ్యమేలాడు.

ఈ చంద్రహాసచరిత్రము యక్షగానంలో అంగిరసములు అనగా ప్రధానంగా కరుణ, శృంగారములని చెప్పవచ్చు. అంగరసములుగా భయానక, అద్భుతములు పోషించబడినవి.

**కరుణ రసము**

**'ఏకో రసః కరుణ ఏవ'** అని భవభూతి ప్రశంసించాడు. కరుణరసం వయస్సు, లింగ, ఆశ్రమభేదాలకు అతీతంగా సర్వమానవ సామాన్యమైనది. మానవునికి తనపరిసరాలతో కలుగు విలక్షణత, సంఘర్షణ అనేవాటిని అనుసరించి వచ్చేది కరుణరస పరిపోషకమగు విషాదము. కరుణరసానికి స్థాయి భావం శోకము.

అలాంటి కరుణ రసాత్మకసన్నివేశాలు, ఘట్టాలు చంద్రహాస చరిత్రములో అనేకంగా కనిపిస్తాయి. తల్లిదండ్రులను పోగొట్టుకొని ఒంటరివాడైన చంద్రహాసుడు దుష్టబుద్ధిని ఆశ్రయించి తన నిస్సహాయతను వెల్లడిస్తూ చేసిన విన్నపంలో కొంత కరుణ రసస్ఫూర్తి కనిపిస్తుంది.

**చంద్రహాసునికి - దుష్టబుద్ధికి- వాదం-దర్వు**

దు॥ రాచబాలక నిన్ను రక్షింతు నీకేమి చింతా॥ సుగుణవంతా
చం॥ చింతయేలను నేనీ చెంతచేరితి రక్షించు॥ దయలుంచూ
చం॥ తల్లిదండ్రుల అన్నదమ్ములు నాకింక లేరు॥ అంత మీరు
దు॥ లేకబోయిరటంచు వ్యాకులములు చెందుటేల॥ చిన్నబాలా
చం॥ నా పూర్వకాలమున నళినభవుడిట్లు జేసె । నొదుట వ్రాసే
దు॥ జేసితె భయమేమి వాసిగా పోషింతు సుమ్ము॥ మాట నమ్ము

అయితే దుష్టబుద్ధి అసూయచేత చంద్రహాసుని తల ఖండించి రమ్మని వీరసేనుని ఆజ్ఞాపిస్తాడు. బాలుని తల ఛేదించుటకు అడవికి తీసుకెళ్ళుచుండగా వీరసేనుని బారినుండి తప్పించుకొనుటకు చంద్రహాసుడు పడిన పాట్లు, అతని నిస్సహాయత, అమాయకత్వం, మనసును కదిలించే అత్యంత కరుణ రసాత్మకమైన ఘట్టంగా కనిపిస్తుంది.

**వీర సేనునికి - చంద్రహాసునికి - వాదం**

వీ॥ పదరా యిప్పుడు రాచబాల అడవికి వేగా । కదలూ కదలూ ఆలస్యంబేల । కుదురుగ నీతలబెదరక నిప్పుడు । పదును ఖడ్గమున వదలక ద్రుంచెద

చం ॥ యెందుకొరకు ద్రుంచెదవు నిన్నైతే నీటకు యెవరుదోలితే వచ్చినావు । పొందుగ పరగృహ మందునుంటి నా । యందు కలత మీ కెందుకు దోచెను

వీ॥ దుష్టమంత్రియు నన్ను బిలచి॥ చందహాసుని యీపట్టి తలగొట్టవచ్చితిని దలచీ । అట్లె మీర నా కాజ్ఞజేసితే । గల్టిగ నీ తల గొట్టవచ్చితిని - దు

చం ॥ ఇన్నిదినములనుండి తాను । నన్ను కన్నపుత్రుని కన్న మిక్కిలి బ్రోతు ననెను । యెన్నో విధముల తిన్నగ బల్కియు । నన్ను జంపుటకు నిన్ను దోలెనా । యె.

వీ ॥ అటుగాదుర వెర్రి మూరా?! దుష్టమంత్రియు నిట్లదోలెను నిన్ను నరకా । కల్లమాట లిప్పట్ల బల్కకుమీ నట్టడవిలోపల గొట్టివేతునిక - అ

చం॥ నన్ను జంపుటకేమి ఫలమూ గతిలేక నిట । నిన్నువాడను యెన్నరాని తప్పేమి జేసితిని । పన్నుగ శ్రీహరి పాదము నమ్మితి -న

చంద్రహాసుని వినయవిధేయతలు, పెద్దలపట్ల గౌరవం, దైవభక్తి, కఠినాత్ముడు అయిన వీరసేనుని మనసునుకూడా కరిగించింది. ఆబాలుని చంపకుండా చిటికెనవేలు ఖండించి ఆనవాలుగా చూపించాడు.

**శృంగార రసం**

శృంగారం నిండుయవ్వనంలోనున్న ఉత్తమ స్త్రీపురుష ప్రకృతి లకు సంబంధించి ఉండును అనే విషయం నాట్యశాస్త్రములో వివరింపబడింది. స్త్రీ పురుషుల పరస్పర ఆధారముగా కలిగిన ప్రేమ అనే చిత్త విశేషం. దీని స్థాయి భావం రతి.

తనతండ్రి దుష్టబుద్ధి రాసిన లేఖను తీసుకొని తమరాజ్యం వచ్చిన చంద్రహాసుని చూసిన 'విషయకన్య' తొలిచూపులోనే ప్రేమలో పడుతుంది. ఎలాగైనా అతన్ని వివాహమాడాలని ఆకాంక్షిస్తుంది. కవ్విస్తుంది, మురిపిస్తుంది, చిలిపిచేష్టలతో అలరిస్తుంది. ఇందులోని శృంగారభావనలు, సంభాషణలు, విరహవేదన, వాదములు శృంగారరస పరాకాష్టకు చేరుస్తాయి.

వ. ఈ రీతిన పత్రిక త్రిప్పివ్రాసి మళ్ళీ యెప్పటి వలె నుంచిన తదుపరి, చంద్రహాసుడు సంధ్యావందనము జేసుకొని వచ్చిన. వెనుక చంద్రహాసుని జూచి -

**విషయకన్య చంద్రహాసునితో వాదించుట-వాదం-దర్వు - ఆట**

వి॥ సుందరాకార మీ రెవ్వరయ్యా ! యెందుకని మీరు యిటవస్తిరయ్యా

చం॥ బోటి వినవె తెల్పేద నాదు మాట । మేటిదొర యాని పిలుతురచ్చోట ।

వి॥ నీదుపురమును నీ పేరుదిల్పు । నాదుపై నీవు నతి ప్రేమనిల్పు

చం॥ చంపావతి నగరాధిపతికి । నందనుడను నేను చంద్రహాసుడనే

వి॥ రాజనొకవార్త మీ తోటిగలదు ।తేజముగ నీతో దెల్పెద నేను

చం॥ కన్య నాతోడ కలదేమి వార్త । విన్నవించవే వినెద విస్ఫూర్తి

వి॥ మనసున్నట్లు మాట్లాడినంత । వినకయుండెనని నాకు చింత

చం॥ నన్నుతాంగిరో పరిహాసమెట్లు । విన్నవించితే వినకుందునెట్లు

వి॥ వనజలోచన నన్ను పెండ్లియాడు । మనమున నన్ను ప్రేమజూడు

చం॥ పెండ్లి యేలనే యీ వనమందున । తల్లిదండ్రులు వింటె తగకోపమందూ!

వి॥ తనయులును పెండ్లి తాజేసుకొనుట । జనకులను యేమి జేయ రేపూట

చం॥ తల్లిదండ్రుల యాజ్ఞ లేకను । పిల్లలైతాము పెండ్లాడరికనూ

వి॥ గంధర్వ వివాహము నాడువిపుడు । అందముగ నాతో మరుకేళిగూడు

చం॥ హరిహరి నాతో యీమాట వలదే । నరకకూపాన నను వేయవలదే

వి॥ నీదు సుందరతను జూచితిని । మోదమున నీతో పొందుగోరితిని

చం॥ నీతో సుఖియించుటకు శ్రీహరినీ । నీలో మోదంబుగను దలతు మదినీ

వి॥ పరమ వేములవాడ మందిరుడు యిరువురను । బ్రోచు యెపుడు

ఈ సంభాషణలు మనుచరిత్ర యందలి వరూధిని ప్రవరాఖ్యుల వాదనను గుర్తుకుతెస్తుంది.

**భయానక, అద్భుత రసములు**

భయానక అద్భుత రసములు నాటకాలలో, కావ్యాలలో ప్రధానరసంగా ఉండవు. అవి చాలా వరకు అంగరసములుగానే పోషింపబడతాయి. వికృతమైనధ్వనులు, వనములో సంచరించుట, క్రూరజంతువులను చూచుట, అపరాధభావం వలన భయానకం, అలాగే అతి మానుష చర్యల వలన అద్భుత రసములు జనించును.

దుష్టబుద్ధి కోపావేశంతో చంద్రహాసుని బలి ఇవ్వడానికి ప్రయత్నం చేయగా, ఆసమయంలో మదనుడు చంద్రహాసుని సత్యశీలరాజు చెంతకు పంపడం, పూజకోసం తానేబయలుదేరి కాళికాదేవికి బలి అయిన భయానక ఘట్టాలు గగుర్పాటు కలిగిస్తాయి.

**మదనునికి - చంద్రహాసునికి వాదం**

మద॥ బావగారు నిన్ను భూవల్లభుడు బిలిచె సుమ్మీ౦ వేగరమ్మీ

చం॥ నాదు మామయు దేవి పాదపూజ సేయబొమ్మనే! పోయి రమ్మనే

మద॥ నేను పూజజేతు నీవు రాజును జేరబొమ్మ । మాటనమ్మి

చం॥ అయితే మంచిదిగాని ఈ రీతి మీఆజ్ఞతోను । పోయెదాను



మద॥ ధరను వేములవాడ హరుని గూడి హరికృపా । మనకు జూపా

సంవ. చంద్రహాసుని దగ్గర పూజాద్రవ్యంబులు తీసుకొని, మదనుడు దేవిపూజ చేసి దండము బెట్టుచుండగా వీరసేనుడు మదనుని తలద్రుంచి వేయుట.

అటు సత్యశీల మహారాజు మదనమంజరికి చంద్రహాసునికి వివాహము జేయుట. అటు తరువాత చంద్రహాసుడు లగ్నంబు చేసుకొని రాజ్య పట్టాభిషేకము చేసుకొని మళ్ళీ మునుపటి మామయైన దుష్టబుద్ది యొద్దకు వచ్చి దండంబు పెట్టుట.

కం॥ మామా దండము నీకును
మామా వినవయ్య నాకు మరియొక సతినిన్
యీ మహినేలు మంటచు
భూమీశ్వరుడిచ్చెనయ్య పురుషాగ్రేశా!

ఈ రీతి చంద్రహాసుడు దండము బెట్టిన తరువాత దుష్టబుద్ధి మదనుడేడని యడుగగా కాళికాయములోనికి పోయెదనని పోయినాడు. అని చంద్రహాసుడు చెప్పగానే, దుష్టబుద్ధి గుడియొద్దకు వెళ్ళి మదనుని మొండెము అక్కడనే పడియున్నవాని జూచి దుఃఖించెను. అటుతరువాత తానూ పొడుచుకొని చనిపోయే దృశ్యాలు విస్మయానికి గురిచేస్తాయి.

చంద్రహాసుడు బావమరిది, మామ చచ్చిపడియుండుట చూసి దుఃఖిస్తాడు. జగదాంబ స్తుతితో పరిసమాప్తం అవుతుంది. ఈ విధంగా ఊహించని పరిణామాలతో కథను రక్తికట్టించిన విధానం అద్భుతంగా తోస్తుంది. ఈర్ష్య, అసూయాద్వేషాలతో పతనమైన దుష్టబుద్ధి జీవితం ఎందరికో గుణపాఠం.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. చంద్రహాస చరిత్రము - యక్షగానము- ఆడెపు నారాయణదాసు
2. తెలంగాణయక్షగానం-రచన, ప్రయోగం- డా. పొద్దుటూరి ఎల్లారెడ్డి
3. సాహిత్యశిల్పసమీక్ష-పింగళిలక్ష్మీకాంతం

## సాధన పంచకమ్

**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాऽऽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాऽऽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**

తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొన వలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వగంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.

**వివరణ**

**4. దృఢతరం కర్మాऽऽశు సంత్యజ్యతామ్ –**

వదలని, దృఢతరమైన కర్మబంధనము వెంటనే వదిలిపెట్టబడు గాక! జ్ఞానానికి కర్మవిరుద్ధమైనది. కాని కర్మ అనివార్యమైనది. మనిషి కర్మవశుడు. అతడు కర్మ చేయకుండా ఉండలేడు. అట్లే మనిషిని కర్మ వదిలిపెట్టి ఉండదు. కావున విహితమైన కర్మలను ఈశ్వరార్పణబుద్ధితో చేయవలెననుటయే ఇందుకు చక్కని ఉ పాయము. అంతేగాక, రాగద్వేషాలకు కారణమై, ఈర్ష్యాసూయలను కలిగించెడు వదలని బంధహేతువగు కర్మను వెంటనే తగు జాగ్రత్తగా వదిలిపెట్టవలెను.

**5. సద్విద్వానుప సర్ప్యతామ్ –**

చక్కని, సత్యమైన విద్వత్తును కలిగినట్టి గురువును ఆశ్రయింప వలెను. గుకార: అంధకార: రుకార: తన్నివర్తక: – అజ్ఞానమనెడు అంధకారమును రూపుమాపువాడు గురువు. గురువు గొప్పనా? గోవిందుడు గొప్పనా? అని ప్రశ్నించి గోవిందుని గూర్చి తెలియ జెప్పిన గురువే గొప్ప అని నిర్ద్వంద్వంగా ప్రకటించిన మహాత్ముడు కబీరుదాసు. అందుకే సాధకుడు సద్గురువును ఆశ్రయింపవలెను అని చెప్పబడినది.

**గురువును గోవిందుడు నా**
**దరి నిలువగ నెవరి గొల్వ తగు ననగా, నే**
**పరమాత్ము చెంతజేర్చిన**
**గురువున కాత్మార్పణమ్ము కూరిమి జేతున్ ॥**

## మాండుక్యోపనిషత్తు

మూడు మాత్రలు మూడు పాదము
లందు బ్రహ్మము చెప్పబడినది;
నాలుగవది తురీయ పాదము
మాత్ర రహితము; సత్యరూపము 41

బ్రహ్మమే 'ఓం' కారమని తను
మాత్రలందున చెప్పబడినను
నిజముగా యీ మాత్ర పాదము
లతని యందున వట్టి కల్పన 42

ప్రణవమే బ్రహ్మ స్వరూపము
ప్రణవమును ధ్యానించవలయును
ప్రణవమును జపియించవలయును
మృత్యు భయమును వీడవలయును 43

బ్రహ్మమే కల్యాణమైనది
సూక్ష్మ రూపము, వ్యాపకమ్మది
అదియు నొక్కటె; ఏక రసమది
ఇట్లు తెలిసినవాడె శ్రేష్ఠుడు 44

'ఓం' కారమె బ్రహ్మమదియును
కారణమ్మే లేకయున్నది
నాశరహితము, పూర్ణమైనది
ఇట్లు తెలిసిన వాడె శ్రేష్ఠుడు 45

బ్రహ్మమే ఈ సృష్టి కంతా
కారణమ్మని తెలియవలయును
స్థితిని లయమును గూర్చు నతడని
తెలియువాడే శ్రేష్ఠ పురుషుడు 46

మాత్రలును మరి పాదములు – లే
నట్టిదే బ్రహ్మమ్ము నెప్పుడు
అద్వితీయము మంగళప్రద
మవనిలో సామ్యమ్ము లేనిది 47

ఇట్లు తెలిసిన వాడె శ్రేష్ఠుడు
యోగమందున స్థితుడు తానై
పరమ పురుషుని సన్నిధానము
లోన నుండెడి ముక్త జీవుడు 48 (సమాప్తం)

**జక్కని వెంకటరాజం**
సిరిసిల్ల, ఫోన్ : 9440021734

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం - 18

# జీవిత నౌక

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

**"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు –సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"జీవిత నౌక".** 1977 నాటి ఈ చిత్రంలో శోభన్‌బాబు, జయసుధ, జయప్రదలు ప్రధాన తారాగణంగా నటించారు. ఈ చిత్ర కథ మూడు ప్రధానపాత్రల మధ్య కొనసాగే ప్రేమకథ.

**చిత్ర కథ :**

గోపాలకృష్ణ (గోపీ) తన తాత రామయ్య పెంపకంలో గారాబంగా పెరిగిన అబ్బాయి. తన పేరుకు తగ్గట్టే తన చేష్టలన్నీ కృష్ణుడి మాదిరిగానే వుంటాయి. గోపీ చేసే అల్లరి పనులకు ఊర్లో అన్ని రకాల మనుషులు ఎక్కడో ఒకచోట అతడి తుంటరి పనుల అనుభవం పొందినవారే. కాని గోపి తాను చేసే పనులన్నింటికీ ఆ కృష్ణుడే కారణం ఎందుకంటే అప్పుడప్పుడూ ఆయన తనలో ఆవహించి ఇలాంటి పనులు చేయిస్తున్నాడంటూ సంజాయిషీ ఇచ్చుకుంటూ తప్పించుకుంటూ వుంటాడు. గోపీ ఏం చేసినా ముచ్చటగా ఆనందించే అతి దగ్గరి మనిషి లక్ష్మి (జయప్రద). లక్ష్మి, గోపిలు ఇద్దరికీ ఒకరి పట్ల ఒకరికి ఎనలేని ప్రేమ. కాని లక్ష్మి తండ్రికి మాత్రం గోపి అంటే మహాకోపం. ఆ కారణంగానే అతడు తన కూతురుకు పెళ్ళి సంబంధాలు చూస్తూ వుంటాడు. ఒకరోజు లక్ష్మిని ఆ ఊరి మునసబు కుమారుడు చినబాబు (శరత్ బాబు) చూసి ఇష్టపడుతాడు. కాని లక్ష్మి అతడి ప్రేమను తిరస్కరిస్తుంది.


మనుమడు గోపి చేష్టలకు విసిగిపోయిన రామయ్య గోపికి పెళ్ళి చేసి దారిన పెట్టాలనుకుంటాడు. రామయ్య కొబ్బరి తోటలతో కూడిన వ్యవసాయ క్షేత్రాన్ని సంరక్షిస్తూ వుంటాడు. రామయ్య ఇంటికి ఒకసారి ఒక అమ్మాయి వస్తుంది. ఆమె పేరు పద్మ. ఆమె చేసే వృత్తి వైద్యం. నిజానికి రామయ్య వ్యవసాయ క్షేత్రాలన్నింటికీ అధిపతి పద్మ. పద్మ తల్లిదండ్రులు మరణించే సమయంలో ఆమె భూములకు కాపలాదారుగా నమ్మకస్తుడైన రామయ్యకు అప్పగించి వుంటారు. పద్మ రామయ్య ఇంటికి వచ్చినప్పుడు గోపీతో పరిచయం ఏర్పడుతుంది. పద్మకు గోపీ నడవడిక, వ్యక్తిత్వం నచ్చి అతడిపై అభిమానం పెంచుకుంటుంది. పద్మ బావ మన్మధ రావ్ (రాజా బాబు) కళ్ళు అంతంత మాత్రమే కనిపించినా దాన్ని కప్పి పుచ్చుకోవడానికి వింత పనులు చేస్తూ నవ్వులపాలవుతూ వుంటాడు.

ఒకరోజు లక్ష్మి తండ్రి లక్ష్మి కి పెళ్ళి సంబంధం ఏర్పాటు చేస్తాడు. ఆ సంబంధం మునసబు గారి కుమారుడు చినబాబుతో. లక్ష్మికి ఆ సంబంధం వద్దనే విషయం ఎలా చెప్పాలనే సంశయంలో వుంటుంది.



సరిగ్గా అదే సమయానికి గోపీ మారువేషంలో జ్యోతిష్యుడిలా వచ్చి సంబంధం రద్దయ్యే ప్రయత్నం చేస్తాడు. కాని చివరి నిమిషంలో గోపీ తాతయ్య రామయ్యకు అస్వస్థత చేసిందనే కారణం చేత పథకం విఫలం అవుతుంది. గోపి రామయ్యను పట్నం తీసుకెళ్లి చికిత్స చేయించి తిరిగి ఊరికి వస్తున్న సమయంలో లక్ష్మి కి గుళ్ళో పెళ్ళి అవుతుంది అనే విషయం తెలుస్తుంది. గోపి వెళ్ళి పెళ్ళి ఆపి అందరూ చూస్తుండగానే లక్ష్మి మెడలో తాళి కడతాడు. లక్ష్మి తండ్రి ఆ విషయం పై పోలీసులను కలిసి గోపీ తన కూతురును కిడ్నాప్ చేశాడని చెప్పి ఒక సంవత్సరం జైలుకు వెళ్ళేలా చేస్తాడు. అంతేకాక కూతురు లక్ష్మికి మళ్లీ పెళ్లి చేసే ప్రయత్నం చేస్తాడు. లక్ష్మి ఇంట్లోనుండి తప్పించుకు వెళ్ళి రైల్ ఎక్కుతుంది. కాని ఆ రైలు అదేరోజు పట్టాలు తప్పి ప్రమాదానికి గురవుతుంది. ఆ సంఘటన అనంతరం లక్ష్మి తండ్రి ఆమె ఆ రైలు దుర్ఘటనలో మరణించిందని అనుకుంటాడు. జైలుశిక్ష తర్వాత గోపీ లక్ష్మి ఇంటికి వెళ్తాడు. లక్ష్మి తండ్రి తాను చేసిన పాపానికి కూతురును కోల్పోయి ఇలా ఒంటరిగా శిక్షను అనుభవిస్తున్నానంటూ దుఃఖిస్తాడు. లక్ష్మి మరణం గురించి తెలిసి గోపి నైరాశ్యం లోకి జారుకుంటాడు.

గోపీ తాత రామయ్య కు విషయం తెలిసి గోపీని సముదాయిస్తూనే మరో పెళ్లి చేసుకొని కొత్త జీవితానికి ఆహ్వానం పలకమని అనునయిస్తాడు. మరోవైపు పద్మ తన వైద్య వృత్తి నిర్వహిస్తూనే, అస్వస్థతగా వున్న గోపీ తాత రామయ్యకు తన ఇంట్లోనే ఆవాసం ఇస్తుంది. అతడి పరిస్థితిని అర్థం చేసుకొని అతడికి జీవితంపై కొత్త ఆశలు నింపే ప్రయత్నం చేస్తుంది పద్మ. పద్మ గోపీని గురించి బాగా ఆలోచించి రామయ్య వద్దకు వెళ్ళి గోపిని తాను వివాహం




చేసుకుంటానంటూ ప్రతిపాదన పెడుతుంది. దానికి రామయ్య ముందు నసిగినా తన మనుమడికి పద్మయే సరైన వ్యక్తి అని భావించి గోపీకి చెప్తాడు. కాని గోపీ మాత్రం తనకు మరో పెళ్లి చేసుకొనే ఆలోచన లేదని తెగేసి చెప్తాడు. గోపీ మాటలకు బెంగతో రామయ్య మరణిస్తాడు. తాత మరణానికి పశ్చాత్తాపం చెంది గోపీ పద్మను వివాహం చేసుకుంటాడు కాని తాను సాధారణ మనిషిగా మారడానికి కొంత సమయం కావాలని కోరతాడు. అతడి పరిస్థితిని అర్థం చేసుకున్న పద్మ సరేనంటూ వివాహం చేసుకుంటుంది. పద్మతో వివాహం తర్వాత కూడా గోపీ మనసు కుదురుకోదు.

ఒకరోజు గోపీకి తాను పద్మతో పాటు వుంటున్న ఇంట్లోనే లక్ష్మి తారసపడ్తుంది. అక్కడ లక్ష్మి కనపడడం చూసి గోపి ఆశ్చర్యపోతాడు. అదే సమయంలో పద్మ గోపితో లక్ష్మిని చూపిస్తూ ఈ అమ్మాయి ప్రమాదంలో కళ్ళు కోల్పోయింది. తనకు వైద్య చికిత్స చేసేవరకూ మనతోనే వుంటుంది అని చెప్తుంది. కాని గోపీ చనిపోయిందనుకున్న లక్ష్మి ఈ కళ్ళులేని అమ్మాయే అనే విషయం పద్మకు తెలియదు. కళ్ళ ముందే లక్ష్మి కనిపిస్తున్నా నేను నీ గోపీని అంటూ చెప్పలేని పరిస్థితి గోపీది. కళ్ళు కోల్పోయిన కారణంగా తాను ఎదురుచూస్తున్న గోపిని ఇంకెప్పుడూ చూడలేననే బాధలో వుంటుంది లక్ష్మి. అంతేకాక గోపికి తాను అంధురాలిగా మళ్ళీ కలవడం కంటే రైలు ప్రమాదంలో మరణించాననే ఆలోచనతో బతకనీయడమే సబబు అని భావిస్తుంది. మరోవైపు పద్మ తనను కాకుండా గోపీని వివాహం చేసుకుందనే కారణం చేత పద్మ, గోపీలపై కోపం పెంచుకుంటాడు పద్మ బావ మన్మధ రావు. ఒకరోజు హోటల్‌లో మన్మధరావ్‌కు ఊరిలో వుండే మునసబు కుమారుడు చినబాబు కన్పిస్తాడు. చినబాబు అప్పటికే లక్ష్మి మరణించిందనే విషయం తెలిసి ఆమె లేదనే భావనలోనే వుంటాడు. కాని మన్మధరావ్ తాను ప్రొడ్యూసర్‌ను అని చెప్పి సినిమాలపై ఇష్టం వున్న చినబాబును తన ఇంటి దాకా తీసుకెళ్తాడు. ఆ సమయంలో చినబాబు లక్ష్మి బతికే వుందని తెలుసుకుంటాడు. అప్పటికే లక్ష్మిని రెండుసార్లు పొందే అవకాశం కోల్పోయిన చినబాబు మళ్ళీ అలాంటి విషయం పునరావృతం కాకూడదని నిర్ణయించుకుంటాడు మూర్ఖంగా.

పద్మ లక్ష్మి కి నేత్ర వైద్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తూ వుంటుంది. లక్ష్మిపై ప్రేమను చంపుకోలేక, పద్మతో కలిసి బతకలేక సతమతమవుతూ కాలం వెళ్ళదీస్తున్న గోపికి పద్మకు కళ్ళు వస్తాయి అని తెలిసి సంతోషం వున్నా మరోవైపు పద్మతో తన జీవితాన్ని ఎలా తీసుకుంటుందో తెలీక బాధపడుతూ వుంటాడు. మొత్తానికి విజయవంతంగా పద్మ లక్ష్మికి కంటి ఆపరేషన్ చేస్తుంది. లక్ష్మి కళ్ళొచ్చాక తాను మొదటిసారి చూసే వ్యక్తి తన గోపీనే అయి వుండాలని కలలు కంటుంది. ఆపరేషన్ తర్వాత కొన్ని రోజులు గడిచాక కళ్ళు తెరవాలంటూ వైద్యులు చెప్తారు. ఈ లోగా ఒకరోజు చినబాబు లక్ష్మిని పద్మ ఇంటినుండి అపహరించుకొని ఒక హోటల్‌కు తీసుకెళ్తాడు. ఆ హోటల్‌లో శివయ్య అనే ఒక పిల్లాడు పనిచేస్తూ వుంటాడు. శివయ్య లక్ష్మితో పాటే ఇంట్లో తమ్ముడిగా పెరిగి వుంటాడు. శివయ్య కారణంగా లక్ష్మి హోటల్లో చినబాబు నుండి కొంత సమయం రక్షించబడ్తుంది. ఆ లోగా గోపీ హోటల్‌కు చేరుకుని చినబాబుపై దాడిచేసి అతడినుంచి లక్ష్మిని రక్షించుకుంటాడు. కాని చినబాబు గోపీ పై వెనకనుండి తలపై బాది పారిపోతాడు. గోపీని వెంటనే ఆస్పత్రిలో జాయిన్ చేస్తారు. అదే సమయంలో లక్ష్మి కళ్ళు తెరుస్తుంది. తనకు వైద్యం చేసిన పద్మ భర్త గోపీయే అని తెలిసి తనకు కళ్ళు కనబడనట్టు నటిస్తుంది. కారణం తనకు కళ్ళు రావడానికి కారణమైన పద్మ దాంపత్య జీవితం తన కారణంగా చెడిపోవద్దు అనే ఆలోచన. తర్వాత తమ్ముడు శివయ్యను తీసుకొని ఊరికి బయల్దేరడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్తుంది లక్ష్మి. ఆమెను పంపడానికి స్టేషన్‌కు భర్తతో పాటు వస్తుంది పద్మ. గోపీ తలకు గాయమైన విషయం చూసిన లక్ష్మి తన ఉద్వేగాన్ని ఆపుకోలేక వెళ్ళి అతడితో మాట్లాడుతుంది. కాని అప్పటికే పద్మ గోపిని లక్ష్మి వెంట ఇచ్చి పంపేందుకు నిర్ణయించుకుని వుంటుంది. కళ్ళు లేకపోయినా భర్త గోపీ కోసం తపించిన లక్ష్మి ప్రేమను, లక్ష్మి మరణించిందనే వార్త తెలిసినా ఆమెను మరిచిపోలేక తల్లడిల్లిన గోపీ బాధను అర్థం చేసుకున్న పద్మ తనకు నచ్చిన మనిషి చేత తాళి కట్టించుకున్నాననే సంతృప్తితో జీవితం మొత్తం బతికేస్తానంటూ గోపీ-లక్ష్మి లను రైలు ఎక్కించడంతో కథ సమాప్తం అవుతుంది.

**చిత్ర విశేషాలు :**

"జీవిత నౌక" చిత్ర నామకరణమే మనిషి జీవితానికి నౌకకు మధ్య సారూప్యతను తెలియపరుస్తుంది. ఆటుపోట్లు, సుడిగుండాలు నౌకా గమనంలో ఏ విధంగా సహజమో మనిషి జీవితంలో కూడా

కుదుపులూ, సంఘర్షణలు అంతే సహజం వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగడమే మన జీవన కర్తవ్యం అని చెప్తుంది. చిత్రం మూడు పాత్రల చుట్టూ సాగినా ప్రతి పాత్రకు దానికి సంబంధించిన అంతఃబాహ్య సంఘర్షణలు వుండడం చేత చిత్రం భావోద్వేగభరితంగా వుంటుంది. పాత్రలకు సంబంధించి ఎక్కువ ప్రభావాన్ని చూపే సంఘటనలు చాలా తక్కువ నిడివిలో జరగడం, ఒకటి, రెండు సన్నివేశాల్లోనే కాలం ఎక్కువ గడిచినట్లు చిత్రాన్ని కొనసాగించిన విధానం వల్ల ఎక్కువ మోతాదులో చిత్రకథ గమనానికి స్వేచ్ఛను తీసుకున్నట్లుగా వుండడం చేత కథ మరీ కృత్రిమంగా అనిపిస్తుంది. కాని కథలోని అంతర్గత భావోద్వేగం చిత్రంలోని పరిమితులను కొంతవరకు నొక్కిపట్టగల్గింది.

గోపీ పాత్రలో శోభన్ బాబు నటన రెండు పార్శ్వాలలో వుంటుంది. చలాకీగా తాత పెంపకంలో అల్లరి పనులు చేస్తూ సరదాగా కాలం వెళ్ళదీయడం, మరోవైపు లక్ష్మి ని పెళ్ళిచేసుకోవడానికి తెగింపు కల్గిన వ్యక్తిగా, లక్ష్మి మరణించిందని తెలిసి పద్మను వివాహం చేసుకొని భాదను మోస్తూ పైకి నిబ్బరంగా కనబడే పాత్ర. గోపీ పాత్ర చిత్ర ప్రారంభంలో వున్న స్థాయి నుంచి పోల్చి చూసినప్పుడు హాస్యధోరణి నుండి వేదనాపూరితమైన, గంభీరమైన స్థాయిలోకి మారుతుంది.

లక్ష్మి పాత్రలో జయప్రద నటన అద్భుతం. ప్రేమించిన అమ్మాయి తండ్రిని ఎదిరించి తాను నమ్మిన వ్యక్తిని వివాహం చేసుకోవడం ప్రతి కాలంలోనూ, ప్రతి సమాజంలోనూ సవాలుతో కూడుకున్న వ్యవహారమే. జయప్రద అంధురాలిగా మారిన తర్వాత గోపీ తనకోసం వస్తాడనే నమ్మకంతో ఎదురుచూడడం, గోపిని తనకు కళ్ళు వచ్చిన తర్వాత చూడాలనే ఆశతో ఎదురుచూస్తుండడం, ఆమెకు సహాయంగా వైద్యురాలైన పద్మ సహాయపడడం మొదలైన సంఘటనలను ఎదుర్కొంటుంది. కాని పద్మయే లక్ష్మి ఎదురుచూస్తున్న గోపీకి భార్య కావడం లాంటి విషయాలు ఎక్కువ మలుపులతో కూడిన కథను చెప్పిన తీరు తెలుస్తుంది. పాత్రలకు తెలియకుండా పాత్రల మధ్య ఎదురయ్యే సంఘటనలు ప్రేక్షకుడికి తెలిసేలా కథ నడిపిన విధానం సరికొత్తగా వుంటుంది. ఇక పద్మ పాత్రలో జయసుధ నటన కథలో ప్రధాన భూమికను పోషిస్తుంది. తన ఆస్తులను కాపాడుతున్న కారణంగా రామయ్య, గోపీలపై పద్మ వ్యక్తం చేసే అధికారంతో కూడిన కృతజ్ఞతా స్వభావం, అతడి తాత రామయ్య మరణం, అతడు ప్రేమించిన అమ్మాయి లక్ష్మిని కోల్పోయాడనే మరణ వార్త తెలిసి నైరాశ్యంలోకి వెళ్ళినప్పుడు అతడికి అండగా నిలబడడం, అతడిని వివాహం చేసుకోవడం, అదేవిధంగా లక్ష్మికి తన ఇంట్లో స్థానం కల్పించి ఔదార్యం చాటుకుంటుంది.

శోభన్‌బాబు పాత్ర కథలో పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించే కథానాయకుడిలా కాకుండా కథానుగుణంగా ఒక పాత్ర ఏ మేరకు స్పందించాలో ఆ పరిమితులకు అనుగుణంగా సాగుతుంది. చిత్రంలో




రాజా బాబు మన్మధ రావ్ పాత్రలో పూర్తిగా హాస్యాన్ని పండించినా మరదలు పద్మను పెళ్ళి చేసుకోలేక పోయినందుకు కొంత విరోధ స్వభావం కలిగిన పాత్ర మాదిరిగా కూడా వుంటుంది.

ఈ చిత్రానికి సాహిత్యం సినారె అందించగా సాహిత్యం కె.వి.మహదేవన్ అందించారు. 'వేయి దీపాలు నాలోన వెలిగితే' అనే గానం ఇప్పటికీ ప్రేక్షకలోకం మరవలేనిది. ఏదేమైనా కె.విశ్వనాథ్ గారి "జీవిత నౌక" చిత్రం మనిషి జీవితం అనుకోని కుదుపులకు లోనవడం సహజం, అలాంటి పరిస్థితులకు బలంగా నిలబడ గలిగితే కాలమే వాటికి పరిష్కారం చూపగలదు అనే విషయాన్ని చెప్తుంది.

**చిత్రం : జీవిత నౌక**

**తారాగణం : శోభన్ బాబు, జయసుధ, జయప్రద, శరత్ బాబు, రాజా బాబు మొదలగువారు.**

**సంగీతం : కె.వి.మహదేవన్**

**నిర్మాత : డి.వి.ఎస్.రాజు**

**కథ, దర్శకత్వం : కె.విశ్వనాథ్**

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

శాసనమందలి ఈ మధ్యాక్కరలో నొక పాదాది 'గారగల్లా' అక్షరములతో గూడిన గణమున్నది. ఇది 'సగ'మగును. 'సగ'మింద్ర గణములోనిది కాదు. కావున ఇచట గణభంగమైనది. 'ల్గా'ను తేల్చి పలికినది 'నగ'మగును. లేదా జల,సగ,లను పంచమాత్రా గణములానాడింద్ర గణములుగా బరిగణింపబడు చుండెనని తలపవచ్చును.

సీస పాదమున నాల్గేసి గణముల రెండు వరుసలుండును. ఇదియొక రగడ భేదము. ద్విపద రెండు పాదములు కలిపిన 6 ఇంద్రగణములు + 2 సూర్య గణములగును. అనగా ఒక సీసపద్య పాదమగును. కాని గణక్రమమున భేదము కలదు.

ద్విపద... 3 ఇంద్ర గణములు + 1 సూర్య గణము

సీసము... 6 ఇంద్ర గణములు + 2 సూర్య గణములు

ద్విపద పాదములను, సీస పాదములను సులభముగా మార్పు చేయవచ్చును.

యుద్ధమల్లుని బెజవాడ శాసనమున ఐదు మధ్యాక్కరలున్నవి. ఇవి ఐదు విధములు. ఈ మధ్యాక్కరలు కన్నడ భాషలోనూ ఉన్నవి. రెండు భాషలలో నున్న రగడలలో సాదృశ్యమెక్కువగా నున్నను భేదము కూడ కలదు. ఈ రెండింటికి పేళ్లలో వ్యత్యాసమున్నది.

| కన్నడము | తెలుగు |
|---|---|
| పిరియక్కర | మహాక్కర - 7 |
| దొరెయక్కర | మధ్యాక్కర - 6 |
| నడువణక్కర | మధురాక్కర - 5 |
| ఎడెయక్కర | అంతరాక్కర - 4 |
| కరియక్కర | అల్పాక్కర - 3 |

రెండవది మధ్యాక్కర. కన్నడమున దానికి సమానమైన పేరు మూడవ అక్కరకున్నది. ఇందు కన్నడ నామములే సార్థకములు. గణసంఖ్యను బట్టి చూచిన మూడవ అక్కరకు మధ్యనున్నది. దానికి కన్నడమున నడువణక్కరయని పేరున్నది.

తెలుగున మధ్యాక్కరయను పేరు రెండవదానికేల వచ్చెనో తెలియదు. యతి మూడు గణముల తరువాత (6 గణములు గల పాదముల నడుమ) నుండుటను బట్టి ఈ పేరు వచ్చినదనవచ్చును. కాని ప్రాచీన కాలమున 5వ గణాద్యక్షరమునకే యతి వేసెడివారు కాని నాలుగవ గణాద్యక్షరమునకు కాదు. దానికి కన్నడమున దొరె అక్కరయని పేరు. అనగా సమానభాగములు కల అక్కరయని అర్థము. మధ్యాక్కర (దొరెయక్కర) పాదమును సమాన గణములు గల రెండర్థములుగ విభజించపవచ్చును. కావున దానికి దొరెయక్కర సార్థకనామము.

లిపి క్రమమునననుసరించి చూచినను మధ్యాక్కరలో కొన్ని చోటులందు గణ భంగము గోచరించును. సూర్యగణమునకు బదులు గగ,స,జగణములు, ఇంద్రగణమునకు బదులు సగ, మ, జగ, జ, జల గణములు కనిపించుచున్నవి.

**ఆధునిక లిపి ప్రకారము**


| | |
|---|---|
| మల్లుదనవద్య | మల్లుణ్డనవద్య... 3 |
| దాను గట్టించె | దానుంగట్టించెం ... 40 |
| గానుదమ తాత | గానున్దమతాత ... 38 |
| ఫలముపేక్షించి | ఫలంబుపేక్షించి ... 20 |
| త్రిణయనుసుతుడొందు | త్రిణయనుసుతుణ్డొణ్డు ... 24 |
| బెజవాడగొమ | బెజవాడంగొమ ... 7 |
| వల్లభుదర్ధిన్ | వల్లభుణ్డర్ధిన్ ... 7 |
| రుసామికిభుక్తుడై | రుస్వామికి భక్తుణ్డ ...8 |
| ధాముదెత్తించె | ధాముణ్డెత్తిచ్చె ... 9 |
| మతము | మతంబు ... 10 |
| నలియబైవారల | నలియంబయ్యారల ... 18 |
| బైయున్న నిచ్చ | బయన్న నిచ్చ ... 27 |
| కనిమల్లదెత్తించె | కనిమల్లణ్డెత్తించె ... 27 |
| మతమును | మతంబునుం ... 29 |
| మల్లుదెత్తించె | మల్లుణ్డెత్తించె ... 43,44 |

సమాప్తం


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# సుచరిత్ర కీర్తి పతాక శ్రీ బి.ఎన్.శాస్త్రి

**డా. భిన్నూరి మనోహరి,** ఫోన్ : 934 797 1177

**"ఉద్యమ: సాహసం ధైర్యం బుద్ధిశ్శక్తి: పరాక్రమ:**
**షడేతే యత్ర వర్తంతే తత్ర దైవ సహాయకృత్"**

ఉద్యమం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం ఈ ఆరు లక్షణాలు ఎవరికైతే ఉంటాయో వారికి దైవం తోడుగా ఉంటుంది. అటువంటి దైవకృప ఉన్న వ్యక్తి శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు. తాను తలపెట్టిన కార్యక్రమాలు ధైర్య సాహసాలతో, బుద్ధి కుశలతతో, శక్తి, పరాక్రమాలతో ఉద్యమంగా నిర్వహించినారు. ఆ కారణంగానే వారి స్వశక్తికి దైవబలం తోడయ్యింది. ఒక వ్యక్తి తన జీవితకాలంలో ఏదైనా ఒక రంగంలో పూర్తిస్థాయిలో పరిణతి చెందాలంటే నిరంతర శ్రమ చేయాలి. ఆ నిరంతర శ్రమకు మారురూపమే శ్రీ బి.ఎన్.శాస్త్రి. శాసన పరిష్కరణలో, చరిత్ర రచనలో ఒక నూతన ఒరవడిని సృష్టించి భవిష్యత్తు తరాలవారికి ఉత్తమమైన చరిత్రను అందించిన శాస్త్రిగారు అనేక పరిశోధనాత్మక గ్రంథాలను రచించినారు. అవి చదివి పక్కన పెట్టే గ్రంథాలు కావు. మనం మరచిపోయిన మన చరిత్రకు అక్షర రూపం కల్పించిన గ్రంథాలు. శిలల మీది వ్రాతలకు పుస్తకం రూపం కల్పించబడిన గ్రంథాలు. అంతరించిపోతున్న సంస్కృతికి బాసటగా నిలిచిన గ్రంథాలు. కనుమరుగవుతున్న మన సాహిత్య సంపదకు ఆధారంగా నిలిచిన గ్రంథాలు.

గతించిన చరిత్రను తెలుసుకొని ఏం చేస్తాం అనే ధోరణి నుండి మన చరిత్రను తెలుసుకోవాలన్న ఆసక్తిని కలిగించే విధంగా చారిత్రక గ్రంథాలు వ్రాయడం శ్రీ శాస్త్రిగారి ప్రత్యేకత. ఒక రాజవంశం చరిత్ర రాయాలంటే అనేక ఆధారాలు అవసరం. అందుకు వారు ప్రధానంగా ఎంచుకున్నవి శాసనాలు. వాటిని సేకరించడానికి ఎంతటి శ్రమనైనా తట్టుకునేవారు ఆర్థికంగా, హార్దికంగా. నేటి కాలంలో ఉన్నటువంటి సౌకర్యాలు లేకపోయినా, తన ఆర్థిక స్థితిని కూడా పక్కకు పెట్టి ఏ మారుమూల ఒక శాసనం ఉందని ఎవరైనా చెబితే ఏమాత్రం ఆలోచించకుండా వెళ్ళేవారు. ఆ సమయంలో ఆయన దృష్టి మొత్తం లభించబోయే శాసనం మీద, అందులో ఉండే విషయం మీద మాత్రమే ఉండేది. శాసనంలో నూతన అంశం ఏదైనా తెలిస్తే దాన్ని ఎంత త్వరగా ముద్రిద్దామా అనే ఆలోచించేవారు. ఆ శాసనం యొక్క గొప్పతనం గూర్చి అందరికీ చెప్పేవారు.

పది సంవత్సరాలు ఉపాధ్యాయ జీవితం తర్వాత తన మార్గం అది కాదన్న సంకేతం వారికి లభించింది. ఆ సమయంలో పెద్దవారి ప్రోద్బలంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో చేరి ఎం.ఏ పూర్తిచేశారు. ఆ సమయంలోనే వారి ఉత్సాహాన్ని గమనించిన గురువులు ఖండవల్లి, రామరాజుగార్లు రెండు సంవత్సరాల్లో రెండు సెమినార్ల నిర్వహణ, తత్సంబంధిత వ్యాసాల పుస్తకాల ప్రచురణ బాధ్యతను అప్పగించారు. శాస్త్రిగారు తన పరిశోధనా ప్రస్థానం మొదలు పెట్టిన ప్రారంభంలోనే రెండు అద్భుతమైన శాసనాలు వారికి లభించాయి. ఆ శాసనాలు చరిత్రలో ఒక సంచలనాన్ని సృష్టించాయి. తెలంగాణ ప్రాంతంలో ఒక గొప్ప రాజవంశం యొక్క ఉనికిని తెలిపే శాసనాలు అవి. ఆ శాసనాలే శాస్త్రిగారి భవిష్యత్ శాసన పరిశోధనకు గట్టి పునాది వేశాయి.

విష్ణుకుండినుల రాజధాని మొదట తెలంగాణ ప్రాంతంలో ఉన్నట్లుగా ఈ శాసనాలు నిరూపించాయి. ఈ విషయం శాస్త్రిగారు మొదట భారతి పత్రికలో ప్రచురించారు. ఆ అంశంపై అనేక చర్చలు జరిగినాయి. శాస్త్రిగారు ప్రచురించిన శాసనాలు అసత్యాలని, తప్పుడు శాసనాలని చాలామంది వ్యాఖ్యానాలు చేసినారు. శాస్త్రిగారి పరిశోధనను తక్కువ చేసి మాట్లాడినారు. వారి అమ్మమ్మగారి ఊరిలో లభించాయి కాబట్టి శాస్త్రిగారే రాగిరేకులమీద రాయించి వాటిని వెలికి తీసినారనేంతవరకు వెళ్ళినారు.

మారేమండ రామారావుగారు శాస్త్రిగారి పరిశోధనను, వారు సూచించిన విష్ణుకుండినుల కాల నిర్ణయాన్ని వ్యతిరేకించినారు. తత్సంబంధ వ్యాసం ప్రకటించారు. అయితే శాస్త్రిగారు మారేమండ రామారావుగారి వాదాన్ని చాలా సున్నితంగా తిరస్కరించి తన అభిప్రాయాలను, తనకు లభించిన ఆధారంగా ఉదాహరణపూర్వంగా మళ్ళీ మళ్ళీ ప్రస్తావిస్తూ విష్ణుకుండినుల కాల నిర్ణయంపై స్పష్టమైన విశ్లేషణతో వ్యాసాన్ని ప్రకటించారు. అజయ్ మిత్ర శాస్త్రిగారు కూడా మారేమండ వారి వాదంతో అంగీకరించక శాస్త్రిగారి పరిశోధనకు పరోక్షంగా సహకరించారు. నేలటూరి వెంకట రమణయ్య వంటి పెద్దలు కూడా శాస్త్రిగారి వాదానికి ఆమోదం తెలిపారు. అయినా వాదోపవాదాలు ఆగలేదు.

శాస్త్రిగారి ఈ పరిశోధన ఆ నోటా ఈ నోటా ఢిల్లీకి చేరి, సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్టుమెంట్ హెడ్ శ్రీ జి.ఎస్.ఘాయ్‌గారికి తెలిసింది. వారు ఈ అంశాన్ని స్పష్టం చేయదలచుకొని శాస్త్రిగారి ఇంటికి వచ్చి వారి వద్ద ఉన్న రాగిరేకులు పరిశీలించి, శాస్త్రిగారి పరిశోధన, వారు సూచించిన విష్ణుకుండినుల కాలక్రమం సరియైనదని నిర్ధారిస్తూ వ్యాసం రాసినారు. అది శాస్త్రిగారి పరిశోధనకు లభించిన అరుదైన గౌరవం. ఎందుకంటే అప్పటికి కానీ వీరి పరిశోధన స్వచ్ఛమైనదనీ, తప్పుడు తడకలు లేనిదని స్పష్టమైంది.

శ్రీ శివలెంక శంభూప్రసాద్‌గారు శాస్త్రిగారికి ఈ విషయంలో పూర్తి తోడ్పాటును అందించారు. అందుకు శాస్త్రిగారు భారతి పత్రిక యాజమాన్యంవారికి సదా కృతజ్ఞులై ఉండేవారు.

విష్ణుకుండినుల శాసనాలతో ప్రారంభమైన శాస్త్రిగారి పరిశోధన అనేక రాజవంశాల శాసనాల సంపుటులు వెలువరించడంలో పరిపుష్టం చెందింది. స్థానిక పాలకుల శాసనాలను, స్థానిక చరిత్రను, స్థానిక రాజవంశాల చరిత్రను వెలుగులోకి తేవడం శాస్త్రిగారి పరిశోధనా పరిధిలో ప్రధాన అంశంగా మనం గుర్తించవచ్చు.

శాసన పరిశోధన, వాటి వెలికితీత, పరిష్కరణలతో పాటు శాస్త్రిగారు చరిత్ర రచనలో కూడా తనదైన ముద్రను ఏర్పరచినారు. చరిత్ర రచనకు ఆధారాలు శాసనాలు ప్రామాణికంగా స్వీకరించినా సమకాలీన రచనలు, ఆయా రాజవంశాల కాలంలో వచ్చిన రచనలు, విదేశీయుల రచనలు, యాత్రికుల అనుభవాలు అన్నీ పరిగణనలోకి తీసుకున్నారు. ముస్లిం రచయితలు, ఇతర ఆధారాలను గ్రహించి ఉత్తమ చారిత్రక గ్రంథాలను రచించినారు. చరిత్ర రచనలో వీరు చేసిన గొప్ప రచన ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

సాంఘిక చరిత్ర అనగానే మనకు సురవరం ప్రతాపరెడ్డిగారు గుర్తుకు వస్తారు. వారు కాకతీయ యుగంతో ప్రారంభించారు. అది కూడా వారు సాహిత్య, చారిత్రక ఆధారాలను ఆకరాలుగా స్వీకరించారు. వారు శాలివాహనుల కాలం నుండి రాజరాజ నరేంద్రుని కాలం వరకు రాయటానికి పూనుకొంటానని చెప్పుకున్నారు. కానీ ఆ కార్యం పూర్తి చేయలేకపోయారు. వారి బాటలో పయనించి శాస్త్రిగారు సురవరం వారి అసంపూర్తి కార్యాన్ని పూర్తి చేశారు. ఈ గ్రంథరచనకు సంబంధించి "నా వంటి అల్పజ్ఞుడిట్టి రచనఉ ఉద్యమించుట న్యాయమైన పని కాదు. కాని సురవరం ప్రతాపరెడ్డిగారు అసంపూర్తిగా వదిలిన సాంఘిక చరిత్ర పూర్వభాగం రచించవలెనన్న ఉత్సాహము, పట్టుదల నన్నీ రచనకు పురికొల్పినవి" అని ఎంతో వినయంగా తెల్పుకున్నారు.

ఈ గ్రంథ రచనకు శాస్త్రిగారు సాహిత్య ఆధారాలతో పాటు శాసనాలు, నాణాలను ప్రమాణంగా స్వీకరించారు. అయితే శాస్త్రిగారు స్వీకరించిన కాలానికి సాహిత్యాధారాలు ఎక్కువ లేవు. ఆ కారణంగా సురవరం వారి గ్రంథానికి లభించిన ఆదరణ శాస్త్రిగారి ఆంధ్రుల సాంఘిక చరిత్రకు లభించలేదేమో అన్న సంశయం కలుగుతుంది. తనకు ఆదరణ లభించినా, లభించకపోయినా, గ్రంథానికి కానీ, తనకు కానీ ఏ గుర్తింపు లేకపోయినా తాను చేయదలచుకున్న పనిని నిర్వహించడమే ఆయనకు తెలిసిన పద్ధతి.

చిన్న గ్రంథం రాసి పదిమంది సహకారం ఆశించేవారే ఎక్కువమంది. కానీ వేల కొలది పుటలతో ఉద్గ్రంథాలు రాసినా ఎవ్వరి నుండి ఎటువంటి ఆర్థిక సహకారం ఆశించకుండా తనకు ఉన్న ధైర్యంతో ప్రతి గ్రంథాన్ని తక్కువలో తక్కువ 2వేల కాపీలు వేసేవారు. వారు కేవలం రెడ్డిరాజ్య సర్వస్వం మాత్రమే ఇతరులకు ఇవ్వడం జరిగింది. మిగతా అన్ని గ్రంథాలు వారి స్వంత ప్రచురణలే.

ఒకవైపు రచనా వ్యాసంగం, మరోవైపు దైవసంబంధ కార్యక్రమాల్లో నిమగ్నమవడం వారి ఆధ్యాత్మిక ప్రయాణానికి మార్గం సులువైందని చెప్పవచ్చు. తనకున్న ఆర్థిక వనరులతోనే హరిహర త్రిశక్తి దేవాలయ నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించినారు. వారి సంకల్పబలంతో 2013-14లలో అవి పూర్తయినవి. శాస్త్రిగారి ఆధ్యాత్మిక సంస్కృతికి ఈ క్షేత్రం ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

వారి సంకల్పం నుండి పురుదు పోసుకున్న మూసీ పత్రిక నేటికీ తన ప్రవాహాన్ని కొనసాగిస్తూనే ఉంది. భారతి పత్రిక మీద ఉన్న అభిమానంతో, అది క్షీణదశలో ఉందనే భావంతో అటువంటి పత్రిక ఒకటి ఉండాలన్న ఆకాంక్షతో పత్రికను స్థాపించినారు. అది ప్రాచీన ముచికుందా నది పేరుమీద "మూసీ" అని నిర్ణయించుకున్నారు. ఈ పత్రిక చాలామంది రచయితలకు, పరిశోధకులకు, కవులకు వేదికను కల్పిస్తుంది. వారు ప్రారంభించిన ఈ మూసీ నది పెద్దదై పిల్ల కాల్వను ఏర్పర్చుకొని "మూసీ సాహిత్య ధార"గా పరుగులు పెడుతుంది. నూతన రచయితలకు, పరిశోధకులకు, సమీక్షకులకు, కవులకు వేదికను కల్పించి వారిని నిష్ణాతులుగా తయారు చేయడంలో నిరంతరం కృషి చేస్తుంది. ఈ మూసీ మాసపత్రిక, సాహిత్య ధార అందరి సహకారంతో ముందుకు పరుగులు పెట్టాలని, శాస్త్రిగారి సంకల్పం పరిపూర్ణం కావాలని ఆకాంక్షిస్తూ వారికి పాదాభివందనం.

# మూసీ పదవినోదం - 33

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 కా | 3 ర్తి | 4 క | 6 మా | 8 స | ము | X | 11 వ |
| 2 రం | గు | ల | క | ల | X | 10 స | రి |
| 5 చు | వం | X | 7 లి | కు | 14 చ | ము | X |
| ట్లు | కా | X | X | 9 లు | గ | సా | 19 నా |
| X | 12 య | 14 వ | 16 ని | X | ల | X | కా |
| 18 స్థ | X | 15 సుం | ద | 21 రి | X | 20 గూ | బం |
| 17 వి | వి | ధ | X | 22 కం | 23 చె | X | దీ |
| 13 ర | ప | ర | ప | X | 24 ర | తి | X |

సమీక్ష

# పావన సంస్కృతీ ధార "పరంపర"

**శ్రీమతి కె. వీణారెడ్డి,** కథా రచయిత్రి, ఫోన్ : 733 705 8025

'పరంపర' అంటే ఎడతెగక నిరంతరం కొనసాగునది అని అర్థం. ఒక జీవనదిలా అది తరతరాల సంస్కృతిని అజరామరం చేసే అమృత రస ధార. అనంత కాల గమనంలోని జనజీవన సరళికి వాడిపోని సంప్రదాయ పరిమళాలను అందించే కమనీయ కల్పవృక్షం. సనాతన సంస్కృతిని వినూత్న రీతిలో ఆస్వాదించ జేసే అద్భుత మహిమ గల కామధేనువు. అదే మన పరమపావన భక్తి, ఆధ్యాత్మిక, జ్ఞాన పరంపర.

'భక్తి' అంటే భగవదర్పణమయ్యే మధుర మానసం. 'ఆధ్యాత్మికం' అంటే ఆత్మకు సంబంధించిన అంశాలను గురించి తెలిపే జ్ఞాన సంపద. అటువంటి అపురూపమైన, అనుపమానమైన భక్తి జ్ఞాన నిధులైన మహనీయుల చరిత్రల గురించీ, అలనాటి ఆదికవి వాల్మీకి, వేదవ్యాసాది ఋషులు, మునులు, భక్త కవుల కలాలయందు కదలాడిన, గళాలయందు గమకించిన, మానవాళికి మనో స్పందన నందించి, మహోన్నత మార్గాన నడిపించిన మన భారతీయ సంప్రదాయ పరిమళాలను ప్రముఖ కవి, రచయిత శ్రీ వేదార్థం మధుసూదన శర్మగారు తమ "పరంపర" గ్రంథములో వ్యక్తీకరించారు.




వారు భావకవిత్వానికీ, అస్తిత్వానికీ, వారసత్వానికీ ప్రతీకగా స్వీకరించి ఒక ఋషిలా తపించి, కృషితో శ్రమించి, అక్షరాలతో అలంకరించి, పదాలతో పరిపూతం చేసి, సరళ వాక్యాలతో సఖ్యతనొందించి మరీ అందించిన వారి వ్యాస సంపుటి 'పరంపర' ఆనాటి వైదిక, పౌరాణిక, చారిత్రక అంశాలతోపాటు భక్తి, జ్ఞాన విశేషాలతో విశిష్టతను సంతరించుకున్నది అనుటలో ఎలాంటి సంశయం లేదు.

గత మూడేళ్లుగా 'అష్టాక్షరీ' మాసపత్రికలో వెలువడిన తమ ఆధ్యాత్మిక వ్యాసాలను 'పరంపర' పేరుతో గ్రంథ రూపముగా వెలువరించడం హర్షణీయం. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో వారు గతములో వెలువరించిన "అడుగజాడలు" గ్రంథానికి ఇది కొనసాగింపు. భారత ఉప రాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారు ఈ పుస్తకాన్ని చదివి అభినందన లేఖ పంపడం ఇక్కడ మరో విశేషం.

ఈ "పరంపర" గ్రంథం అంధకారమును అంతరింప చేసి తరింపజేసే 'గురు పరంపర' పేరుతో ఒకటో భాగంగాను, నిత్యాను సరణీయమైన సత్యాల నెన్నో 'వినాయకుడు' మొదలుగా శుభకరమై, శివ సుందరమైన వ్యాసాలను 'మన పరంపర' పేరుతో మరో భాగముగా విభజించి మనోహరంగా, మననోపరంగా మనకు ఈ రచయిత అందించి, స్పందింపజేశారు.

మొదటి భాగం 'గురు పరంపర' లోని 13 వ్యాసాలలో **'శ్రీ హయగ్రీవ నమోస్తుతే'** అనే వ్యాసం హయగ్రీవుని వైభవ ప్రాశస్త్యాన్ని, అశ్వము ముఖుడిగా మారిన విష్ణువు, హయగ్రీవుడైన అద్భుతం గురించి వివిధ సన్నివేశాలలో వైవిధ్యంగా వివరించారు. విశ్వ సంక్షేమార్థమై స్థితికారకులైన లక్ష్మీనారాయణులను అనుసరించిన విచిత్ర విషయ విశేషాలతో.. అశ్వ ముఖం సైతం విశ్వవ్యాప్తమెలా అయిందో రచయిత విదితం చేసిన విధం విబుధం.

**'శ్రీ ఆంజనేయం'** అనే మరో వ్యాసంలో ధీమంతుడైన హనుమంతుని జన్మతిథి నుండి జన్మ వృత్తాంతం వరకు వివరించారు. హనుమ యొక్క శాస్త్ర పారంగత్యం నుండి సంభాషణా చాతుర్యం దాకా, ప్రభు భక్తి, ఆత్మ శక్తికి, దీక్షా, పట్టుదలకు దౌత్యానికి, త్యాగానికి, యోగానికి నాటి నుండి నేటి దాకా రామభక్తుడై చిరంజీవిగా వెలుగొందే ఆంజనేయుడెంతటి ఆదర్శప్రాయుడో అభివర్ణించిన రచయిత అభినందనీయుడు.

**'నమామి ధన్వంతరీమ్'** అనే ఇంకో వ్యాసంలో క్షీరసాగర మథన సమయంలో అమృత కలశంతో అవతరించిన ధన్వంతరి శ్రీమహావిష్ణు యొక్క ఇరవై ఎనిమిది అవతారాల్లో ఒకటి అనీ, ధన్వంతరి భగవానుడు దేవ వైద్యుడే గాక, మానవుల వార్ధక్యరోగాది అపమృత్యు భయాలను హరింప చేయగల వాడని, ధన్వంతరిని గురించి వేద పురాణాది కథనాలను గురించి అద్భుతంగా, ఆసక్తికరంగా వర్ణించిన వైనం వర్ణనాతీతం. సాక్షాత్తు సూర్య దేవుని దగ్గర ఆయుర్వేద విద్యను అభ్యసించిన ధన్వంతరి, మనో శారీరక రోగాలను హరించే వాడని, అవనీతలాన్ని అతలాకుతలం గావించే కరోనా వంటి కఠిన వ్యాధుల నివారణ

కూడా ధన్వంతరిని ధ్యానించడం, పూజించడం, మంత్ర పఠనం చేయడం చేత కూడా జరుగుతుందని తెలియజేయడం పాఠకులందరికీ ఆరోగ్యానందదాయకం.

ఆ తర్వాత, **'దత్తాత్రేయ'** గురువుల గురించిన వ్యాసంలో దత్తాత్రేయుడు త్రిమూర్త్యాత్మక స్వరూపం అయిన విధానం, అందులోని అంతరార్థాన్ని విశ్లేషించిన విధానం పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. సర్వవ్యాపకుడు అయిన దత్త గురుదేవుల గురించి గ్రహించాల్సిన అంశాలెన్నో సంగ్రహంగా, సులభ గ్రాహ్యం గా రచయిత చెప్పిన తీరు బాగుంది. చింతనను తొలగించే తాత్విక చింతన, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానమార్గానికి దివ్యదర్శనం కలిగిస్తుంది.

**'వాల్మీకి మహర్షి'** అనే మరో వ్యాసం లో ఒక గజదొంగ మహర్షి ఎలా అయ్యాడు?, ఒక కరకు బోయవాడు మహా భక్తుడు ఎలా అయ్యాడు?, కరుణ రసాత్మక విశ్వవిఖ్యాత రామాయణ కావ్యం ఎలా రాయగలిగాడు? తన తపశ్శక్తితో ఆదికవి వాల్మీకిగా ఎలా పేరొందాడు? అనే సందేహాలకు చక్కని సమాధానాలను అందించిన తీరు బాగుంది. భక్తికి, తపస్సుకు, కవిత్వానికి కులమత భేదాలు లేవని నిరూపించిన వాల్మీకి చరితం, రామాయణ కావ్యకర్తగా వాల్మీకి మహర్షి అజరామర త్వానికి అద్దంపట్టే అద్భుతమైన అంశం ఈ వ్యాస సారాంశం.

**'వ్యాస మహర్షి'** అనే ఇంకో వ్యాసంలో గురుపూర్ణిమగా పూజింపబడే లోక ప్రాశస్త్యం పొందిన వ్యాసుని గురించి, జన సౌలభ్యం కోసం వేదరాశిని నాలుగు భాగాలుగా విభజించి వ్యాసుడు వేదవ్యాసుడు అయిన విధానాన్ని,వారు విరచించిన గ్రంథాల్ని విదితం చేశారు ఈ వ్యాసంలో. మహాభారతాన్ని వ్యాసుడు వివరిస్తుంటే సాక్షాత్తు విఘ్నేశ్వరుడు లిఖించాడు అని తెలియజేస్తూ, వేదవ్యాస మహర్షిని 'కవిబ్రహ్మ' గా వర్ణించిన జ్ఞాన ఘనులైన కవి వేదార్థం గారు ధన్యులు.

ఇంకా ఇందులో శ్రీ నమ్మాళ్వార్, శ్రీ పెరియాళ్వార్, శ్రీ కులశేఖరాల్వార్, శ్రీమద్రామానుజులు, గోదాదేవి, అన్నమయ్య వంటి విష్ణు భక్త శిఖామణుల గురించి వేర్వేరు వ్యాసాలలో గొప్పగా వివరించారు. దేశ విదేశాలలోని సర్వ మానవాళికి ముఖ్యంగా యువతకు తన సందేశాలతో మార్గదర్శనం చేసిన స్వామి వివేకానంద గురించి అద్భుతముగా ఆవిష్కరించారు.

రెండవ భాగం 'మన పరంపర'లోని 29 వ్యాసాలలో ఆయా మాసాలలో వచ్చే పండగలు, పర్వాలు, నోములు, వ్రతాలను గురించి సవివరంగా చెప్పే ప్రయత్నం చేశారు. అంతేగాక భగవస్సాన్నిధ్యాన్ని చేరుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలు, ఆచరణీయాలు, పంచ సంస్కారములు, ధ్యానం మొదలైన వాటితో పాటు పుష్కరాలు, గోమాత తదితరాల ప్రాశస్త్యాన్ని వివరించారు. తెలుగు సాహిత్యంలోని భక్తి శతకాలు, విశిష్టాద్వైతం మొదలైన వ్యాసాలతో పాటు, వారి జన్మ భూమిలోని ఆధ్యాత్మిక క్షేత్రాలు, సాహిత్యం గురించి విపులంగా వర్ణించారు. అలాగే తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, బోనాల పండగల గురించి, ఆసియా తెలంగాణలోని అతి పెద్ద కుంభ మేళాగా ప్రసిద్ధి గాంచిన సమ్మక్క సారలమ్మ జాతర గురించి వ్యాసకర్త వివరించిన తీరు అమోఘం.

ఈ గ్రంథములో పేర్కొన్న అంశాలు కనువిందైన పండగల ప్రాధాన్యతతో పాటు, ఎందరో మహా రాజులు, మహా భక్తులు, దివ్య జ్ఞానులు, సామాజికవేత్తలు, లోకోపకారులైన మహనీయుల జీవన విధానాలు పావన దిశానిర్దేశం చేస్తాయి. మంచి వైపు, మాధవుని వైపు మనసును మళ్లిస్తాయి. చదివేకొద్దీ చదివింప చేసే వేదార్థం వారి ఈ 'పరంపర' గ్రంథం పాశ్చాత్య సంస్కృతిని కొంతవరకైనా మరిపించి, చదువరులకు భారతీయ సంస్కృతీ పరిమళాలను పంచి, ఆచరణకు ప్రేరణ కాగలదు. సాంస్కృతిక దర్పణంలా, సంస్కృతికీ, సంసారానికీ ధర్మ దర్శనంలా, విజయానికి సుందర దృశ్యంలా ఈ గ్రంథం ఆధ్యాత్మిక జగత్తులో వెలిగి పోతుందని కోరుకుందాం.

ప్రతులకు : **వేదార్థం మధుసూధన శర్మ,**

ఎస్.బి.ఐ బ్యాంక్ పక్కన, రాజా వీధి, కొల్లాపూర్(పోస్ట్)

నాగర్ కర్నూల్ (జిల్లా)–509102 చర వాణి.9063887585.

### ఏది కవిత...

కవిత ప్రభావం ఉల్లాసమొ! వేదనయొ
ఏదో ఒక నేపథ్య స్వరం! స్వనిస్తుంది సూక్ష్మంగా
పాత నంటి కొత్త ప్రవేశంతో జీవన ప్రవాహం
ఎప్పటికీ అవసరమైన అనుభవ సుందర రూపం
(మాదిరాజు రంగారావు)



సమీక్ష

# విభిన్న భావాల ఆహ్లాద కవిత్వం – అనాది అనాథ శతకం

**యడవల్లి సైదులు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఫోన్ : 70321 88578

నేటి ఆధునిక కాలంలో వచన కవిత్వం విస్తృతంగా వ్యాప్తి చెందుతుంది. దాంతో చాలామంది కొత్త కవులు మినీ కవిత్వం, నానీలు, దీర్ఘ కవిత, హైకూలవైపు ఆకర్షితులవుతున్నారు. ఈ కారణంగా సహజంగానే శతక రచన కాస్త వెనుకబడింది. ఈ సందర్భంలో ఉండేటి మేఘస్రవంతి శతక రచన చేయడం హర్షించదగ్గ విషయం. నేటి యువ కవులు, కవయిత్రులు కూడా శతకాన్ని రాయగలరన్న నమ్మకాన్ని వ్యాపింప జేసింది. ఈ శతక రచయిత్రి స్రవంతి.

ఈ శతక శీర్షిక, శతకంలోని మకుటం, శతకం రాయడానికి వెనకున్న నేపథ్యం అన్ని ఎంతో ప్రత్యేకమైనవి. ఎక్కడో జరిగిన ఒక సంఘటన ఇంకెక్కడో జరిగే సంఘటనకి ప్రేరణగా నిలుస్తుంది. అటువంటి చిత్రమైన సందర్భంలోంచి జన్మించినదే ఈ శతకం.

కవయిత్రి ఓసారి శెనక్కాయలు కొనుక్కొని తిన్న పొట్లం పేపర్లో "సకల శక్తుల జీవి నేటి మేధావి" అని చూడ్డం, అది ఎవరు రాశారో తెలుసుకోవాలని వెతకడం, చివరికి ఆమె అడ్రస్ పట్టుకోవడం, కానీ అప్పటికే ఆ వృద్ధురాలైన కవయిత్రి చనిపోవడం మొత్తంగా ఈ ఇతివృత్తమంతా ఒక నవలని తలపిస్తుది. ఇక ఆ మకుటాన్ని కవయిత్రి స్రవంతి స్వీకరించి ఇగో ఇప్పుడు అనాది అనాథ శతకంగా మార్చింది. ఈ శతక రచన వెనకున్న నేపథ్యం ఎంత ఆసక్తిగా ఉందో ఇందులోని పద్యాలు అంతే ఆసక్తిగా, ఆహ్లాదంగా, ఆలోచనాత్మకంగా ఉన్నాయి.

105 పద్యాలతో పొదిగింది ఈ శతకం. అందులో ఎక్కువ పద్యాలు నీతిని, లోకం పోకడనీ తెలిపేవిగా ఉన్నాయి. మరికొన్ని కవయిత్రి భావజాలాన్ని విభిన్న కోణంలో చూపేవిగా ఉన్నాయి. శతక సాహిత్యం ప్రధానమైన రెండు రకాలు భక్తి శతకాలు, నీతి శతకాలు మరికొన్ని ఉన్నాయి కానీ ఈ రెండింటికీ లభించిన ప్రచారం ఇతర శతకాలకి లభించలేదు.

నిందాస్తుతి శతకాలు, శృంగార శతకాలు, హాస్య శతకాలు, స్మృతి శతకాలు, వంటివెన్నో శతక సాహిత్యంలో కనిపిస్తాయి. పాల్కురికి వృషాధిప శతకం మొదలు వేమన శతకం దాకా శతకాల్లో భక్తి, నీతి శతకాలదే పైచేయి. అయితే ఇది శతక ప్రయాణంలో ఒక పార్శ్వం మాత్రమే. ఇంకొక కోణం నేటి ఆధునిక శతక రచనలో కానవస్తుంది. ఐది ఒకే వస్తువు, ఒకే వర్గం కాకుండా అనేక అంశాలతో శతకాల్ని రాయడం ఈ మధ్యకాలంలో చూస్తున్నాం. ఆ కోవలోకి చెందిందే స్రవంతి శతకం.

ఇందులో ఉపదేశం ఉంది, నీతి ఉంది, తిట్టు ఉంది, పొగడ్త ఉంది, హాస్యం ఉ ంది, రక్తి ఉంది, ముక్తి ఉంది, సామాజిక చింతన ఉంది. ఇట్లా అనేక రూపాల్లో ఈ శతకం దర్శనమిస్తుంది. దీనిలోని పద్యాల్లో కవయిత్రి తీసుకున్న వస్తువులు మన చుట్టూ ఉన్న సమాజాన్ని కళ్లకు కడతాయి.

దీనిలో వస్తువులు తల్లిదండ్రులు, గురువులు, ప్రేమ, ఈర్ష్య, ద్వేషం, త్యాగం, శ్రమ, పట్టుదల, దుఃఖం, ఆనందం, పేదరికం, ఓర్పు, సహనం. మనసున, లోకంలో, చిత్తము ఇట్లా నిత్యం మనం చూసే అంశాలనే వస్తువులుగా స్వీకరించి కవితలు అల్లింది. ఆ కవితలు చదువుతున్నప్పుడు మనలో అనేక సంఘర్షణలు జనిస్తాయి.




ఓ కవిత...

**"చేదు భావాలెన్నో నీ గొంతు చేరగా**
**ఉంచుకో నీ గుండెనే**
**ఎప్పుడూ గట్టిగా సాగడమే నీ వంతు ఆగడం కాదుగా**
**సకల శక్తుల జీవి నేటి మేధావి"** అంటుంది.

స్థిత ప్రజ్ఞతతో కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ జీవితాన్ని నడపాలని మన ఆధ్యాత్మిక గ్రంథాలు ఎన్నో బోధించాయి. స్రవంతి రాసిన ఈ పద్యం చదివిన తర్వాత అటువంటి గ్రంథాల సారమంతా ఈ పద్యంలో పొదిగినది కదా అనిపించింది. నిజమే జీవితం అన్నాక అన్ని తీపులే ఉండవు. చేదుకూడా ఉంటుంది. అయినా సరే అదరక బెదరక ధైర్యంగా ముందుకు నడవాలనే ఈ సందేశం ఈ పద్యంలో చెప్పింది కవయిత్రి.

మరో చోట –

**"సిద్ధాంతము చదివి సిద్ధివనుకుంటే**
**మాట మర్యాదలే నీకు లేకుంటే**
**సిద్ధివైనా సుద్ద మొద్దువన్నట్టే"** ఉంటుంది.

కొంతమందికి ఎంత జ్ఞానం, పాండిత్యం ఉన్నా ఇతరులను గౌరవించే మర్యాద ఉండదు. అటువంటి అహంకారం కలిగిన మూర్ఖులకు ఈ పద్యం చక్కగా వర్తిస్తుంది.

ప్రహ్లాదుడికి 12 సంవత్సరాలు గురుకులంలో విద్యాబుద్ధులు నేర్పించిన తండ్రి హిరణ్యకశిపుడు కొడుకు పాండిత్యాన్ని పరీక్షించగా **"వేదములు, సకల శాస్త్రముల సారములు చదివితిని నారాయణ మంత్రమే అన్నింటిలో కెల్లా శ్రేష్టమైనదని తెలుసుకున్నాను"** అంటాడు. అది అసలైన జ్ఞానానికి నిదర్శనం. కానీ నేటి ఆధునిక సమాజంలో పుస్తక జ్ఞానమే కానీ, మస్తక జ్ఞానం లేదు. ఇంత లోతైన విషయాలు దాగున్నాయి ఇందులో.

మరో కవితలో ఇంటిలోని వారి మాటకి ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని తెలుపుతూ మన ఇంటివారే మనకు నిజమైన స్నేహితులు అని తెలిపే ప్రయత్నం చేశారు కవయిత్రి.

**"ఆరు బయట మాట అమృతం కురిపించు**
**ఇంటిలోని మాట వెగటు పుట్టు**
**ఎంచి తెలుసుకున్న వాస్తవం తలకెక్కు".**

అంటూ నిజాన్ని నిర్భయంగా చెప్పింది కవయిత్రి. సహజంగా అందరి ఇళ్ళల్లో తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచిచెడులూ చెబుతారు. కష్టపడాలని చెబుతారు. కానీ పిల్లలు అవి వినరు. అయితే అదే విషయాన్ని "విజయానికి ఐదు మెట్లు, విజయానికి ఏడు మెట్లు" అంటూ ఎవరో సైకాలజిస్టులు చెప్పే సలహాలు, సూత్రాలు మాత్రం వేలకు వేలు డబ్బులు పెట్టి వినడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. కాబట్టి ఇంటిలోని వారు ఎల్లప్పుడూ మన మంచినే కోరతారు. వారి మాటలను వినడం ఉత్తమమని కవయిత్రి చాటి చెబుతుంది.


అత్యాశ ఎప్పుడూ అనర్థమే. చరిత్రలో అందుకు ఎన్నో సాక్ష్యాలున్నాయి. అయినా చాలామంది అత్యాశను వీడరు. అటువంటి వారినుద్దేశిస్తూ రాసిన కవిత్వాన్ని చూడండి.

**"సరదాల జీవితం సరిపోకపోతే**
**మితిమీరి కోర్కెతో ముందుకెళితే**
**పతనమే తుదివరకు మిగులునంతే"**

అంటూ సూటిగా చెప్పింది కవయిత్రి. అత్యాశతో హిట్లర్, అలెగ్జాండర్ లాంటి వాళ్లే కోరిక తీరకుండానే ఓడిపోయారు. అంత సైన్యం, అధికారం, బలం, ధనం ఉన్నా తృప్తి లేకపోవడంతో వారి జీవితం అసంతృప్తితో ముగిసింది. సామాన్య జనం ఇటువంటి సంఘటనలని, జీవితాల్ని గమనించైనా తృప్తితో జీవించాలి. అత్యాశకు పోవద్దని ఈ పద్యం ద్వారా గ్రహించవచ్చు.

ఇట్లా విశ్లేషణ చేస్తూ పోతే ఈ శతకంలోని పద్యాలన్ని వేటికవే ప్రత్యేకంగా కనిపిస్తాయి. మొత్తానికి శతక కారిణి ఉండేటి మేఘ స్రవంతి లోతైన సమాజ పరిశీలనతోటి ఈ పద్యాలను రాశారు. అందుకే అవి లోక రీతిని ప్రతిబింబిస్తున్నాయి. ఒక్కోసారి కొందరిని ఒక కథనో, ఒక పాటనో మారుస్తుంది. అంతెందుకు "వెంటాడే ఒక వాక్యం" కూడా ఆశక్తుడిని శక్తిమంతుడుగా మారుస్తుంది. ఆ క్రమంలో చూస్తే అటువంటి ప్రేరణ రగిల్చే కవితలు ఇందులో చాలా ఉన్నాయి.

---





**పాంచరాత్రాగమోక్త "మహోత్సవ విధిః"**
శ్రీ పెరుంబూదూరు రాఘవాచార్య
ప్రకాశకులు : డా. శ్రీరంగాచార్య
వెల : 350/-
**ప్రతులకు :** ఎస్. సరోజాదేవి, 11-14-25, రోడ్ నెం. 1, హరిపురి కాలనీ, హైదరాబాద్ -102,
ఫోన్ : 929 945 1266




**వైదిక బ్రహ్మార్పణ విధాన శ్రాద్ధము (తిరువధ్యయనము)(కొందరి తనియలు)**
సంపాదకులు : డా. శ్రీరంగాచార్య
వెల : 150/-
**ప్రతులకు :** ఇం.నెం.11-14-25, రోడ్ నెం. 1, హరిపురి కాలనీ, హైదరాబాద్ -102,
ఫోన్ : 929 945 1266





**'కోట్ల' సరళ శతకం**
కోట్ల వెంకటేశ్వర రెడ్డి
వెల : 50/-
**ప్రతులకు :** ఇం.నెం. 4-31/1/2, భాగీరథ కాలనీ, మహబూబ్ నగర్ - 509 001.
సెల్ : 9440 233261.










**ఆదిలాబాద్ నానీలు**
డా. ఉదారి నారాయణ
వెల : 70/-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 4-112/7/2, కెసిబి గార్డెన్ ఎదురుగా, రోడ్ నెం. 3, భగవతి నగర్, ఆదిలాబాద్ - 504 001.
ఫోన్ : 94414 13666




**ధర్మపురీ వైభవం (స్తుతి కావ్యం)**
వొజ్జల నరహరి శర్మ, వెల : 150/-
**ప్రతులకు :** వొజ్జల శరత్ బాబు, 206, సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 2, గణేశ్ నగర్, దూరదర్శన్ ఎదురు రోడ్డు, రామాంతపూర్, హైదరాబాద్ - 18. ఫోన్ : 9963533937



**శ్రీ కృష్ణ రమ్య రామాయణం (చంపూకావ్యం)**
గన్ను కృష్ణమూర్తి, వెల : 700/-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 5-3-770/1, బిలాల్ మసీదు వెనుక, విద్యానగర్ కాలనీ, కామారెడ్డి (జిల్లా), - 503 111.
ఫోన్ : 924 722 7087






**ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు (యాత్రా చరిత్ర)** ఆచార్య చెన్నప్ప, వెల : 150/-
**ప్రతులకు :** ప్రమీలా ప్రచురణలు, 9-76/2, ఉదయ్ నగర్ కాలనీ, బోడుప్పల్, హైదరాబాద్-92.
ఫోన్ : 988565 4381, 040- 2720 1007




**నీలో నేను (ప్రేమ మొగ్గలు)**
పులి జమున
**ప్రతులకు :** రచయిత్రి,
202, శ్రీయ ప్లాజా అపార్ట్‌మెంట్స్, రైల్వే స్టేషన్ రోడ్, మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 8500169682.

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

చూడడానికి మీరెప్పుడు సాహసించలేని
అస్పష్టపు దుఃఖ దృశ్యం.

ఆమె చెంపల మీద
దుఃఖం ఉయ్యాలలూగుతుంది.

మండిపోతున్న ముఖంతో, అద్దం ముందు నిలబడి
గట్టిగా ఏడిస్తే
తోలూడిన చర్మం సందుల్లోంచి
కనీళ్లు వంకర టింకరగా ప్రవహిస్తున్నాయి.

రాత్రుళ్ళు చెంపలు తడవందెప్పుడు
వణుకుతున్న వేళ్ళతో కనీళ్ళని తుడవందెప్పుడు
ఒక్కోసారి చుట్టూ కుట్లేసిన ముఖాన్ని
తడుముకుంటే వోలుచుకుపోయిన
చర్మపు గాజు పెంకులు,చేతివేళ్ళకి
వాషింగ్ బ్రష్ లా, కుచ్చుకుంటున్నాయి.

గీరుకపోయి పొక్కిలవుతున్న
ఆమె మొఖం రంగిప్పుడు
ఎండలో ఆరబెట్టిన శనగ పొట్టులా ఉంది.
అద్దుకోవాల్సిన పౌడర్
కనీళ్ళని కప్పదు.
దిద్దుకున్న కాటుక
గడ్డకట్టిన బాధకి ఓదార్పు నివ్వదు.

గాయం,
అనివార్యంగా కొనసాగే వేదన కాదు
భరించలేని రంపపు నొప్పి
దిగమింగలేని కఠిన చేదు.

లైట్లార్పిన చీకట్లో
మాటిమాటికి ఏడ్చినప్పుడూ
సగం కాలిపోయి ఇనుప సీకులాంటి
నల్లటి పెదాల పళ్ళచిగుళ్ళల్లోంచి
ఆశ్చర్యార్థకారంలో
బొట్లు, బొట్లుగా కారుతోంది రక్తం.

తగలబడ్డ మాంసంలో విరిగి
మెలితిరిగిన ఎముకలు
బయటకు పొడుచుకొచ్చి

# కొన్ని కన్నీళ్ళు అద్దెకి కావాలి

వంగిన కాంక్రీటు సరిహద్దు రాళ్ళై
బయపెడుతాయి.

ఇప్పుడామె కాకర గింజల మొఖం
తడారి నెర్రలు బాసిన ఉష్ణభూమి.
అలుకు పూతలేని దుక్కిలైన వాకిలి.
ఒక విషాదపు డైలీ టీవీ సీరియల్.

పగిలిపోయిన mobile screen లాగా
తుప్పుపట్టిన పాత జల్లెడ రంధ్రం లాగుంది.

మొన్నేప్పుడో పొయ్యి దగ్గర
అగ్గిపుల్ల గిస్తే, అప్పుడెప్పుడో
ఫోజులిస్తూ అందంగా దిగిన ఫోటో ఒకటి
వున్న పళంగా గోడని గట్టిగా పట్టుకుంటోంది.
భయంతో.

ఇంటి బయట డోర్ శబ్దం వినిపించింది
ఆశగా, అమాయకంగా, నవ్వుతూ
తలుపు దగ్గరికెళ్లిన పాప..........
కాలిన గాయాలు తొడుక్కున్న ముఖాన్ని
చూసి చేతిలోవున్న స్టీల్ గ్లాస్ని
విసిరేసి పరుగులు తీసింది
తలుపులేసి........

ఇవాళ మేం వాకింగ్‌కి వెళ్ళలేదు
ఎవరు స్టేటస్ పెట్టారు
ఆమె ఫోటో మీద
R I P అని
ఇప్పుడేద్వటానికి
కొన్ని కనీళ్లు అద్దెకి ఇవ్వండి
అమ్మెక్కడుందాని ఏడ్చే పాపకి..

(ఆసిడ్ దాడికి గురైన అమ్మాయిల్ని చూసి రాసింది ఇది వాళ్లకే అంకితం)

**డి. ప్రకాశ్**
**పరిశోధక విద్యార్థి, భీమ్ డ్రమ్ సాహిత్య వేదిక.**